PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 89 | విజయవాడ, గురువారం 30 అక్టోబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 30 October 2025 | Rs

ముంచెత్తిన మొంథా

- తీరం దాటినా గుంటూరు, నెల్లూరులో భారీ వర్షం
- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, గెడ్డలు
- శ్రీశైలం- కర్నూలు మధ్య రాకపోకలు నిలిపివేత
- నేలవాలిన భారీ వృక్షాలు

2



ఆసీస్‌ను ఓడిస్తేనే ఫైనల్ బెర్త్

- నేడు సెమీస్‌లో టీమిండియా కీలక పోరు
- ఇంగ్లండ్‌పై గెలుపుతో తుదిపోరుకు దక్షిణాఫ్రికా మహిళలు

8

ప్రాణనష్టాన్ని నివారించాం

ముఖ్యమంత్రి చంద్రబాబు • తుపాను బాధిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే • ఓడలరేవులో బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి- అమలాపురం (డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

మొంథా తుపాను సందర్భంగా రాష్ట్రంలో ప్రాణ నష్టాన్ని నివారించగలిగామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. బుధవారం ఆయన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఏరియల్ సర్వే చేశారు. అనంతరం అల్లవరం మండలం ఓడలరేవులో పర్యటించారు. తుపాను పునరావాస కేంద్రంలో బాధితులను పరామర్శించారు. నిర్వాసితులకు ఆర్థిక సాయం, బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. బెండమూర్లంక శివారు అరకట్లపాలెం ప్రాంతంలో తుపానుకు పాడైన వరి పొలాలను పరిశీలించారు. నష్టంపై రైతులను ఆరా తీశారు. బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మురుగు నీటి డ్రెయిన్లు పూడుకుపోవడంతో తరచూ పొలాలు ముంపునకు గురవుతున్నాయని ఈ సందర్భంగా పలువురు రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డ్రెయిన్ల పూడికతీత పనులను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ నష్టపోయిన రైతులందర్నీ ఆర్థికంగా ఆదుకుంటామన్నారు. కోనసీమ ప్రాంతం పెనుముప్పు నుంచి బయటపడిందని పేర్కొన్నారు. కొద్దిపాటి నష్టాలతో రైతులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారన్నారు. ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యల వల్ల చాలావరకూ ప్రాణ నష్టాన్ని నివారించగలిగామని, ఆస్థి నష్టాన్ని కూడా చాలా వరకు తగ్గించగలిగామని చెప్పారు. మొబైల్ క్లినిక్స్ ద్వారా బాధితులకు వైద్యసాయం అందించే చర్యలు చేపట్టామన్నారు. నేలకొరిగిన కొబ్బరి, భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలను తొలగించి రవాణా, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేపట్టామని తెలిపారు. పంట నష్టం వివరాలను త్వరగా సేకరించాలని అధికారులను ఆదేశించారు. తుపాను ప్రభావం రాష్ట్రంలో ఇతర జిల్లాలపైనా ఇంకా కనిపిస్తోందన్నారు.



ఏరియల్ సర్వే చేస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు, నీటమునగిన పంటలు

87 వేల హెక్టార్లలో పంట నష్టం

బాధిత కుటుంబాలకు ఉచితంగా నిత్యావసర వస్తువులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మొంథా తుపాను రాష్ట్రంలో బీభత్సం సృష్టించింది. వ్యవసాయానికి తీవ్ర నష్టం కలిగించింది. అధికారులు రూపొందించిన ప్రాథమిక నివేదిక ప్రకారం రాష్ట్రంలో 87 వేల హెక్టార్లలో పంట నష్టం సంభవించింది. 78,796 మంది రైతులు పంటను కోల్పోయారు. 304 మండలాల్లోని 1825 గ్రామాల్లో ఈ నష్టం సంభవించింది. బాపట్ల, పల్నాడు, కృష్ణా, బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాల్లో తుపాన్ నష్టాలను ఏరియల్ సర్వే ద్వారా ఆయన పరిశీలించారు. అనంతరం రాష్ట్ర సచివాలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు నష్టాలపై ఈ మేరకు రూపొందించిన ప్రాథమిక నివేదికను ఉన్నతాధికారులు అందచేశారు. అనంతరం ఆర్‌టిజిఎస్ కేంద్రం నుండి నిర్వహించిన సమీక్షలో సిఎం నష్టాల వివరాలను వెల్లడించారు. విద్యుత్ సరఫరా, రహదారుల పునరుద్ధరణ పనులు తక్షణం జరగాలని ఈ సమీక్షలో సిఎం ఆదేశించారు. ఎక్కడా వర్షం నీరు నిలిచిపోకుండా డ్రైనేజి వ్యవస్థలను పరిష్ట పరచాలని, పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లోని కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాల పంపిణీ వేగంగా జరగాలని సూచించారు. ఒంగోలు పట్టణంలో పలు కాలనీలు నీట మునగడంతో జిల్లా కలెక్టర్‌పై సిఎం అసహనం వ్యక్తం చేశారు. ఆర్టీసి సర్వీసులను యదావిధిగా కొనసాగించాలన్నారు. పంట నష్టంపై మిగతా 7లో

నష్టాలు ఇవి!

పంట నష్టం	: 87వేల హెక్టార్లు
వరి.మొక్కజొన్న, పత్తి, మినుము పంటలు	: 59 వేల హెక్టార్లకు పైగా
నష్టపోయిన రైతులు	: 78,796
మృతి చెందిన పశువులు	: 42
ఆర్అండ్‌బి రహదారులు	: 2,294 కి.మీ
పంచాయతీ రాజ్ రోడ్లు	: 380 కి.మీలు
కూలిన చెట్లు	: 297
శిబిరాలకు చేరిన ప్రజలు	: 1.16 లక్షలు

ప్రజా సంక్షేమమే పరమావధిగా

కేరళ ముందడుగు

- ఇప్పటికే అతి పేదరిక రహిత తొలి రాష్ట్రంగా రికార్డు
- తాజాగా సామాజిక పింఛన్లు, అంగన్‌వాడీల, ఆశ వర్కర్ల వేతనాలు పెంపు
- మహిళలు, యువతకు నెలకు రూ.1000 ఆర్థిక సాయం
- కేంద్ర ఆర్థిక నిర్బంధాన్ని అధిగమించి ప్రజలకు అభివృద్ధి ఫలాలు

తిరువనంతపురం : కేరళలోని వామపక్ష ప్రజాతంత్ర ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) ప్రజలకు ఇచ్చిన హామీలన్నిటినీ ఒక్కొటొక్కటిగా నిలబెట్టుకుంటూ ప్రజా సంక్షేమమే పరమావధిగా దేశానికే ఆదర్శనీయమైన పాలన అందిస్తోంది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆర్థికంగా అనేక అడ్డంకులు సృష్టించినా...నిధులు కేటాయించకుండా వివక్ష చూపినా..ఆ ఇబ్బందులన్నిటినీ అధిగమిస్తూ కేరళ ప్రభుత్వం ముందడుగేస్తోంది. 2021లో అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి మంత్రివర్గ సమావేశంలోనే రాష్ట్రంలో అత్యంత పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించాలని నిర్ణయించింది. ఇప్పుడు ఆ లక్ష్యాన్ని పూర్తి చేసి ..దేశంలోనే మొట్టమొదటి అతి పేదరిక రహిత రాష్ట్రంగా కేరళను నిలిపింది. కేంద్ర ప్రభుత్వం నిధులు నిరాకరించి ఆర్థిక ఇబ్బందులు సృష్టించడమే గాకుండా బిజెపి, ఆర్ఎస్ఎస్ మూకలు తప్పుడు కథనాలు వల్లిస్తూ దుష్ప్రచారానికి ఒడిగడుతున్నాయి. ఆ అవరోధాలన్నిటినీ దిగ్విజయంగా జయించి ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ ముందుకెళ్తోంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సంక్షేమ పెన్షన్లు పెంపు, రబ్బరు రైతులకు రాయితీలు, ఆశా వర్కర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, ఫ్రంట్ లైన్ కార్మికులకు వేతనాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అనంతరం కేబినెట్ నిర్ణయాలను విజయన్ మీడియాకు వెల్లడించారు. నవంబర్ 1న కేరళ ఆవిర్భావ దినోత్సవ నేపథ్యంలో ప్రజలందరికీ సంక్షేమ వరాలు కురిపించారు. సామాజిక పింఛన్లను రూ. 1600 నుంచి రూ 2 వేలకు పెంచారు. దీని కోసం ప్రభుత్వం రూ.13 వేల కోట్లను ఖర్చుచేయనుంది.



అణగారిన ప్రజలకు అండగా నిలిచిన ఎల్‌డిఎఫ్ ప్రభుత్వానికి అభినందనలు చెబుతున్న మహిళ

అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు గౌరవ వేతనాన్ని రూ 1000 పెంచారు. దీంతో వారు గౌరవ వేతనం రూ॥13000లు అందుకోనున్నారు. గెస్ట్ లెక్చరర్లకు నెలకు గరిష్టంగా 2 వేలు రూపాయిల మేరకు జీతం పెరుగుతోంది. కనెక్ట్ టు వర్క్ పథకం ద్వారా 18-35 వయస్సు ఉన్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆర్థిక సహాయాన్ని అందించనుంది. రైతు కుటుంబాలకు రూ॥19,470 సబ్సిడీని ప్రకటించింది. మద్దతు ధరను రూ॥30 వరకూ పెంచారు. అలాగే, ఆశా వర్కర్ల గౌరవ వేతనాన్ని రూ 1000 పెంచారు. మహిళలకు, యువతకు నెలకు రూ 1000 ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. వెనుకబడిన కుటుంబాలకు చెందిన 35 నుంచి 60 ఏళ్ల మహిళలకు నెలకు రూ 1000 ఆర్థిక సాయం చేయనున్నారు. రేషన్‌కార్డును దీనికి అర్హతగా నిర్ణయించారు. అదేవిధంగా కుటుంబ ఆదాయం రూ 1 లక్ష కంటే తక్కువగా ఉన్న యువతకు నెలకు రూ. 1000 అందిచనున్నారు. ఇంటర్ లేదా ఐటిఐ, డిప్లొమో, డిగ్రి కోర్సుల మిగతా 7లో

మరో గిరిజన జిల్లా ఏర్పాటు చేయండి

- సరిహద్దుల మార్పుపై ప్రజాభిప్రాయంతో సమగ్ర నివేదిక
- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మరో గిరిజన జిల్లాను ఏర్పాటు చేయాలని, సరిహద్దుల మార్పుపై ప్రజాభిప్రాయాన్ని తీసుకుని సమగ్ర నివేదిక ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాలనా సౌలభ్యం, ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని చింతూరు, రంపచోడవరం, పోలవరం డివిజన్లలను కలిపి ప్రత్యేక గిరిజన జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న ఈ ప్రాంతాలను తూర్పుగోదావరి జిల్లాలో కలపాలనుకోవడం సరైంది కాదన్నారు. . జిల్లాలు, మండలాల సరిహద్దులు పునర్విభజన కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం కొత్తగా రెండు జిల్లాలను(మదనపల్లె, మార్కాపురం) ప్రతిపాదించినట్లు మీడియాలో వార్తలు వచ్చాయని, గత ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు చింతూరు. రంపచోడవరం, పోలవరం ప్రాంతాలతో ప్రత్యేక జిల్లా ఏర్పాటు ప్రస్తావన లేకపోవడం ఆశ్చర్యం కలిగించిందని వివరించారు. పైగా చింతూరు, రంపచోడవరం రెవెన్యూ డివిజన్లలను తూర్పుగోదావరిలో కలపాలని ముఖ్యమంత్రి ఉపసంఘంతో చెప్పినట్లు వార్తలు వచ్చాయని, ఈ రెండు డివిజన్లతోపాటు పోలవరం నియోజకవర్గాన్ని కూడా కలిపి ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలనేది అక్కడ గిరిజనుల వాంఛగా ఉందని పేర్కొన్నారు. మంత్రివర్గ ఉపసంఘం రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించి ప్రజల నుండి వినతులు స్వీకరించకుండానే అక్కడికక్కడే కొంతమంది అభిప్రాయాలు తీసుకుని పాక్షిక అభిప్రాయాలకు వచ్చినట్లు కనిపిస్తోందని పేర్కొన్నారు. మరోసారి బహిరంగంగా ప్రజల అభిప్రాయాలు తీసుకుని సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆయన కోరారు.

జిల్లాల పునర్విభజనపై ప్రజాభిప్రాయం సేకరించాక నిర్ణయం

- వారంలో మళ్లీ ఉపసంఘం సమావేశం

7

ఎల్ఐసిలో అమ్మకానికి 6.5 శాతం వాటాలు

- రూ.13 వేల కోట్ల షేర్ల ఉపసంహరణ
- కేంద్రం కసరత్తు
- త్వరలో రోడ్‌షోలు ఏర్పాటు



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని దిగ్గజ జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి)లో మరోమారు భారీగా వాటాలను ఉపసంహరించుకోవాలని మోడీ సర్కార్ నిర్ణయించింది. ఇందుకోసం కసరత్తును వేగవంతం చేసినట్లు రిపోర్టులు వస్తోన్నాయి. అంతక్రితంతో పోల్చితే రెట్టింపు వాటాలను మార్కెట్ శక్తులకు విక్రయించడానికి వీలుగా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ ఏడాది ముగింపు లోపే 6.5 శాతం వాటాలను విక్రయించడానికి కేంద్రం ఏర్పాటు చేస్తోందని ఎకనామిక్ టైమ్స్ ఓ కథనంలో వెల్లడించింది. ఈ వాటాల ఉపసంహరణ ద్వారా కేంద్రం రూ.8,800 కోట్ల నుంచి రూ.13,200 కోట్లు తన ఖజానాలో వేసుకోవాలని భావిస్తోంది. ఇందుకోసం ఆ మొత్తం విలువ చేసే షేర్లను ప్రయివేటు శక్తులకు కట్టబెట్టనుంది. వాటాల విక్రయం కోసం వచ్చే కొద్ది వారాల్లోనే రోడ్‌షోలను నిర్వహించనుంది.

2022లో ఎల్ఐసి ఐపిఒకు వచ్చిన సమయంలో 3.5 శాతం వాటాకు సమానమైన 22.13 కోట్ల షేర్లను విక్రయించింది. దీంతో రూ.20,557 కోట్ల నిధులను కేంద్రం తమ ఖజానాలో వేసుకుంది. ప్రభుత్వానికి ప్రస్తుతం ఎల్ఐసిలో 96.5 శాతం వాటా ఉంది. కాగా.. 2027 నాటికి ఇందులో కనీసం 10 శాతం వాటాను ప్రయివేటు శక్తులకు కట్టబెట్టాలని బిజెపి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం సెబీ నిబంధనలను సాకుగా చూపుతోంది. 2027 మే నాటికి ఎల్ఐసిలో కనీసం 10 శాతం వాటాలను విక్రయించాలని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) ఆదేశాలున్నాయని పదేపదే గుర్తు చేస్తోంది. ఈ వాటాలను చిన్న విడతలుగా.. మార్కెట్ పరిస్థితులకు అనుకూలంగా క్రమంగా వాటాలను విక్రయించాలనేది ప్రభుత్వ వ్యూహం.

2027 నాటికి 10 శాతం వాటాలను విక్రయించడం ద్వారా మొత్తంగా రూ.37వేల కోట్లు పైగా సమీకరించాలని మోడీ ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. అయితే ఇన్వెస్టర్లు, మార్కెట్‌పై ఒత్తిడి రాకుండా ఈ షేర్లను క్రమంగా, భాగాలుగా విక్రయించేందుకు ప్రభుత్వం ప్లాన్ చేసింది. ఇలా చేయడం ద్వారా ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్ల విలువను కాపాడాలని భావిస్తోంది. 'ప్రస్తుత త్రైమాసికం ముగింపులోపే మరోమారు ఎల్ఐసిలో వాటాల విక్రయం జరగొచ్చు' అని ఓ మర్చంట్ బ్యాంకర్ తెలిపారు. మంగళవారం ఎల్ఐసి షేర్ ధర రూ.911.50 వద్ద ముగిసింది. దీంతో ఆ సంస్థ మార్కెట్ కాపిటలైజేషన్ దాదాపు రూ.5.75 లక్షల కోట్లకు చేరింది.

ఎల్ఐసి వాటాల విక్రయ ప్రక్రియను డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపమ్) నడిపిస్తోంది. తదుపరి విక్రయం గడువు, వాటా ఉపసంహరణ మొత్తాన్ని ఖరారు చేయడానికి చర్చలు వేగవంతంగా జరుగుతున్నాయని తెలుస్తోంది. వాటాల ఉపసంహరణ క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపి) ద్వారా జరగాలా, లేక ఆఫర్ ఫర్ సేల్ (ఒఎఫ్ఎస్) ద్వారా ముందుకు తీసుకెళ్లాలా అనేది త్వరలో జరిగే రోడ్‌షోలలో పెట్టుబడిదారుల డిమాండ్ ఆధారంగా నిర్ణయించనున్నట్లు ఓ అధికారి తెలిపారు. ఇందుకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయన్నారు.



గుహలను తలపించేలా హాస్టళ్లు

- పెచ్చులూడుతున్న స్లాబులు
- చిన్నపాటి వర్షానికే కారుతున్న వైనం
- శిథిలావస్థలో పోరుమామిళ్ల ఎస్‌టి, రాజంపేట ఎస్‌సి హాస్టళ్లు

3

ట్రంప్ అంటే మోడీకి భయం

- బీహార్‌లో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన రాహుల్‌గాంధీ

పాట్నా : ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి అమెరికా అధ్యక్షులు ట్రంప్ అంటే భయమని కాంగ్రెస్ నాయకులు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బుధవారం నుంచి రాహుల్‌గాంధీ తన ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా దర్భంగాలో ఎన్నికల ర్యాలీలో రాహుల్ ప్రసంగించారు. ప్రధాని మోడీపై ఒత్తిడి తీసుకొచ్చి ఆపరేషన్ సిందూర్‌ను ఆపినట్లు ట్రంప్ 50 సార్లు చెప్పుకున్నారని, కానీ, మోడీ దీన్ని ఒక్కసారి కూడా ఖండించలేదని విమర్శించారు. ట్రంప్ అంటే మోడీకి భయమని, ధైర్యం లేనివారు బీహార్‌ను అభివృద్ధి చేయలేరని రాహుల్ అన్నారు. మోడీ స్పందించే ధైర్యాన్ని కూడగట్టుకోవాలని, ఈసారి మోడీ బీహార్‌కు వచ్చినప్పుడు ట్రంప్ అబద్ధం చెబుతున్నారని చెప్పాలని రాహుల్ సవాల్ చేశారు. 'ట్రంప్ ప్రతిరోజూ వివిధ దేశాలలో మోడీని అవమానిస్తున్నారు. మోడీకి ధైర్యం లేదని, మోడీ తనను తన ముందు వంగి నమస్కారం చేస్తారని ట్రంప్ చెబుతున్నారు. అయితే ట్రంప్ అర్థంలేని మాటలు మాట్లాడుతున్నారని, అబద్ధాలు చెబుతున్నారని మోడీ ఎప్పుడూ అనలేదు' అని



బీహార్‌లోని గంగా భగత్ మెమోరియల్ స్టేడియంలో అభివాదం చేస్తున్న రాహుల్ గాంధీ, తేజస్వీ యాదవ్ తదితరులు

రాహుల్ చెప్పారు. అలాగే, ముజఫర్‌పూర్‌లోని సక్రాలో జరిగిన బహిరంగ సభలోనూ రాహుల్ ప్రసంగించారు. నీతీశ్ కుమార్‌ను ఎదురుగా పెట్టి బీహార్‌లో బిజెపి రిమోట్ కంట్రోల్ ప్రభుత్వాన్ని నడుపుతుందని విమర్శించారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సామాజిక న్యాయానికి వ్యతిరేకమని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు పట్టుబట్టడం వల్లే మోడీ ప్రభుత్వం కుల గణనకు అంగీకరించిందన్నారు. మహారాష్ట్ర, హర్యానాల్లో ఓట్ల చోరీ జరిగిందని, బీహార్‌లోనూ ఇది పునరావృతమవుతుందని వివమర్శించారు. అలాగే, 'దేశసంపద కొంతమంది సంపన్నుల చేతుల్లోకి వెళ్లిపోతోంది. బీహార్ వంటి ప్రాంతాలు పేదరికంలో కూరుకుపోవడానికి ఇదే కారణం. నోట్ల రద్దు వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు జరిగిన నష్టంపై మోడీ మౌనంగా ఉన్నారు. ఛాత్ పూజ సందర్భంగా ఢిల్లీలో యమునా నది ఘాట్ వద్ద పూజలు చేయనున్నట్లు ప్రకటించిన మోడీ, ఆ తర్వాత అది కృత్రిమంగా నిర్మించిందని తెలుసుకుని వెనకడుగు వేశారు' అని రాహుల్ విమర్శించారు. ఓట్ల కోసం ప్రధాని మోడీ ఎంతకైనా వెళ్తారంటూ విమర్శించారు. ఇండియా బ్లాక్ రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉందని రాహుల్ చెప్పారు.



రాఫేల్ యుద్ధ విమానంలో రాష్ట్రపతి ప్రయాణం

7

దెబ్బతిన్న పంటలకు తక్షణమే పరిహారం

- ఏపి రైతు, కౌలు రైతు సంఘాల డిమాండ్

2

గాజాపై అర్ధరాత్రి అరాచకం

- ఇజ్రాయిల్ దాడుల్లో 100 మందికి పైగా మృతి

గాజా: ఇజ్రాయిల్ మంగళవారం అర్ధరాత్రి చేసిన మెరుపు దాడులతో గాజా మరోసారి వణికిపోయింది. డ్రోన్లు, యుద్ధ, నిఘా విమానాలతో ఇజ్రాయిల్ సైన్యం విరుచుకుపడింది. అర్ధరాత్రి నుంచి బుధవారం రాత్రి వరకూ జరిగిన దాడుల్లో 100 మందికిపైగా మరణించారు. అనేక మంది గాయపడ్డారు. వీరిలో చిన్నారులు, మహిళలే అధిక సంఖ్యలో ఉన్నారు. ఈ వివరాలను పాలస్తీనా వైద్య అధికారులు వెల్లడించారు. ఒక్క షిఫా ఆసుపత్రికే 60 మృతదేహాలు వచ్చాయని ఆ ఆసుపత్రి డైరెక్టర్ మొహమ్మద్ అబు సెల్మియా తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 45 మంది క్షతగాత్రుల్లో 20 మంది పిల్లల పరిస్థితి విషమంగా ఉందని, కాబట్టి మరణాల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని ఆయన అన్నారు. కాల్పుల విరమణ తిరిగి అమల్లోకి వచ్చిందని ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించిన కొన్ని గంటలకే ఈ దాడులు జరిగాయి. ఈ దాడులను ఇజ్రాయిల్ కూడా ధ్రువీకరించింది. ప్రధానమంత్రి నెతన్యాహు ఆదేశాలతో ఈ దాడులు జరిగాయని ఆ దేశ రక్షణ మంత్రి కట్జ్ తెలిపారు. హమాస్ వద్ద బందీలుగా ఉండి చనిపోయిన వారి మృతదేహాల అప్పగింతలో జాప్యం జరుగుతోందని అందుకే ఈ దాడులకు ప్రధానమంత్రి ఆదేశించారని చెప్పారు.

ఈ నెల 10న ఇజ్రాయిల్ - హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. తరువాత పలుసార్లు ఇజ్రాయిల్ ఒప్పందం ఉల్లంఘనకు పాల్పడింది. మంగళవారం రాత్రి జరిపిన దాడి ఇందులో అతిపెద్దదాడి. ఇజ్రాయిల్ సైన్యం ఉల్లంఘనలకు ప్పాలుడుతున్నా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆ దేశానికే మద్దతుగా నిలిచారు. హమాస్ ముందుగా ఉల్లంఘనలకు పాల్పడిందని, అందుకే ఇజ్రాయిల్ ఎదురుదాడి చేయొచ్చని అన్నారు. అయినప్పటికీ గాజాలో శాంతిని ఎవరూ అస్థిరపర్చలేరని చెప్పారు.

గాజాలో కాల్పుల విరమణకు హామీ ఇవ్వండి

- సిపిఎం పొలిట్‌బ్యూరో

7

ముంచెత్తిన మొంథా


ఒంగోలు మంగమ్మ కాలేజీ వద్ద జలమయమైన జాతీయ రహదారి

తీరం దాటినా గుంటూరు, నెల్లూరులో భారీ వర్షం
ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, గెడ్డలు
శ్రీశైలం- కర్నూలు మధ్య రాకపోకలు నిలిపివేత
నేలవాలిన భారీ వృక్షాలు - విరిగిన విద్యుత్తు స్తంభాలు


పర్చూరులో ప్రార్థనలకు వెళ్లి చిక్కుకున్న వారిని రక్షించిన అధికారులు

ప్రజాశక్తి - యంత్రాంగం

మొంథా తుపాను నిండా ముంచెత్తింది. బలమైన ఈదురుగాలులకు వరి, ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. భారీ వృక్షాలు రహదారిపై నేలవాలడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. విద్యుత్ స్తంభాలు నేలవాలడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. బుధవారం ఉమ్మడి గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో భారీ వర్షాలు పడ్డాయి.

నెల్లూరు జిల్లాలోని కోవూరు, కావలి, జలదంకి, అనంతసాగరం, ఎఎస్‌పేట, తదితర మండలాల్లో ఎడతెరపిలేని వర్షాలు పడ్డాయి. కావలిలో టిడ్కో ఇళ్ల చుట్టూ వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. విడవలూరులో ముంపు గ్రామ వాసులను సురక్షిత ప్రాతాలకు తరలించారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కుండపోతగా వర్షం కురిసింది. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో 200 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. గుంటూరు జిల్లా కాకుమానులో 116 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. చిలకలూరిపేట వద్ద కప్పగంజి వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. కోటేళ్ల వాగు పొంగి ప్రవహించడంతో అమరావతికి రాకపోకలు నిలిచిపోయాయి. చిలకలూరిపేట, యడ్లపాడు, నాదెండ్ల, వినుకొండ, నర్సరావుపేట పట్టణాల్లోకి నీరు చేరి ప్రజలు ఇబ్బంది పడ్డారు.

ఒంగోలు పట్టణంలో పోతురాజుకాలువకు ఇరువైపులా ఉన్న సుమారు పాతిక కాలనీల్లోకి నీళ్లు చేరాయి. మంగమ్మ కాలేజీ జంక్షన్, ఎంఎస్‌ఆర్ కాలేజీ ఎదురు రోడ్డులో నీళ్లు భారీగా చేరి.. చెరువును తలపించాయి. నగరంలోని ఓ రహదారిపై చిన్నారులు చేపలు పట్టారు. ఒంగోలులోని లోతట్టు కాలనీల్లో మోకాల్లోతు నీళ్లు చేరాయి. పట్టణంలోని జవహర్ నవోదయ పాఠశాలలోకి నీరు చేరడంతో విద్యార్థులు రాత్రంతా నీళ్లలోనే గడిపారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ 14 గేట్లు ఎత్తేశారు. ఒంగోలు, పెళ్లూరు సమీపంలోని చెరువు పొంగడంతో జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. శ్రీశైలం, కర్నూలు జిల్లా వైపు రాకపోకలు నిలిచిపోయాయి. నల్లమలలోనూ భారీ వర్షం కురవడంతో కంభం చెరువు నిండింది. చీమకుర్తి క్వారీల్లో పెద్దఎత్తున నీరు నిలిచిపోవడంతో పనులకు ఆటంకం ఏర్పడింది.

విశాఖపట్నం భీమిలి మండలం చిప్పాడ గ్రామానికి వెళ్లే రహదారి నీటమునగడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జివిఎంసి 2వ వార్డు పరిధి చిల్లపేట, జీరుపేట గ్రామాల్లో మురుగునీరు ఇళ్లల్లోకి చొరబడడంతో దుర్వాసనతో ప్రజలు అల్లాడుతున్నారు. విజయనగరం నుంచి సింహాచలం రహదారిలో పద్మనాభం మండలం మద్దివద్ద పల్లిగెడ్డ ఉప్పొంగి రోడ్డుపై ప్రవహిస్తోంది. బి.తాళ్లవలసలో వరద నీరు ముంచెత్తడంతో బూరెల చెరువు, కూనగెడ్డ చెరువులకు వేసిన వలలు కొట్టుకుపోయి చేపలన్నీ వెళ్లిపోవడంతో తీవ్ర నష్టం జరిగిందని పెంపకందారులు వాపోతున్నారు. విశాఖ జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ మార్గంలోనూ, పందిమెట్ట, సింగ్ హోటల్ జంక్షన్, టౌన్ కొత్తరోడ్డులో చెట్లు కూలిపోయాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం రాయిగెడ్డ కాజ్‌వే ఉధృతంగా ప్రవహిస్తోంది. మోదపుట్టు, అడ్డుమండ మధ్య వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అరకులోయ మండలం ఇగరాయిలో పాఠశాల భవనం కూలిపోయింది.జి.మాడుగల మండలం వనబంగిలో వంటపాకపై చెట్టు కూలింది. రాజవొమ్మంగి మండలంలోని లబ్బర్తి, దూసరపాము, కింద్రరోడ్ వయ్యాడు తదితర ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మండలంలో 12 గంటలుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఒట్టిగడ్డ, గింజర్తి, నెల్లిమెట్ల, మాతంగి, లబ్బత్తి, అనంతగిరిలో వాగులు పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నంద్యాలలో కుంటలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. శ్రీశైలం డ్యాం ప్రధాన రహదారిపై, పవర్ హౌస్ వద్ద, పాతాళగంగ మెట్ల సమీపంలో కొండ చరియలు విరిగి పడ్డాయి. సున్నిపెంటలోని పలు ప్రాంతాలల్లో ఇళ్లలోకి నీరు చేరింది. సంజామలలో రెండు మట్టిమిద్దెలు, బేతంచర్ల పట్టణంలోని దుర్గాపేట కాలనీలో రెండు మట్టి మిద్దెలు, బనగానపల్లె పట్టణంలోని ఈద్గా నగర్ కాలనీలో ఒక మట్టి మిద్దె కూలిపోయింది. బనగానపల్లె మండలం నందవరం గ్రామంలో అధిక వర్షాలకు 60 గొర్రె, మేక పిల్లలు మృత్యువాత పడ్డాయి.


అనకాపల్లి నూకాలమ్మ గుడి ఆర్చి జాతీయ రహదారిలో కూలిన వృక్షాన్ని తొలగిస్తున్న సిబ్బంది

కెకెలైన్‌లో విరిగిన కొండచరియలు

అనంతగిరి మండలం కెకె లైన్ బొర్రా-చిమిడిపల్లి 65/5 మైలురాయి వద్ద మంగళవారం రాత్రి కొండచరియలు విరిగిపడ్డాయి. బుధవారం ఉదయం అధికారులు పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు గల్లంతు

శ్రీకాకుళం జిల్లాలో పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిశాయి. కవిటి మండలం రాజపురంలో అత్యధికంగా 21.75 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. పలాస మండలం దానగోరకు చెందిన సవర లావణ్య (లెబున్) కంబిరిగాం కూడలి వరహాల గెడ్డలో చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతయ్యారు. అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు.

కాకినాడలో గల్లంతైన యువకుడు కోసం గాలింపు

కాకినాడ నగరం దుమ్ములపేటకు చెందిన గద్దేపల్లి సాయిరామ్ అనే యువకుడు మంగళవారం సాయంత్రం కుంభాభిషేకం రేవు వద్ద నిలుపుదల చేసిన బోట్లను తాళ్లతో కట్టేందుకు వెళ్లిన తరుణంలో సముద్రంలో గల్లంతయ్యాడు. ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

వెలిగొండ సొరంగంలో చిక్కుకున్న కార్మికులు

వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్‌పై వాగులు ఉధృతంగా ప్రవహించడంతో కోతకు గురై వెలిగొండ ఫీడర్ కెనాల్‌లోకి నీరు భారీగా ప్రవహిస్తోంది. దీంతో సొరంగం మార్గాలు పూర్తిగా మునిగిపోయాయి. లోపల లైనింగ్ వర్క్ చేస్తున్న సుమారు 250 మంది కార్మికులలో 200 మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మిగిలిన వారిని అక్కడే సురక్షిత ప్రాంతంలో ఉంచారు. చీకటి పడడంతో సహాయక చర్యలు నిలుపుదల చేశారు. కొండేపి మండలం, చోడవరం దగ్గర ముసి వాగు ఉధృతికి వాగుకు అవతలి వైపు 80 మంది కూలీలు, స్థానికులు చిక్కుకున్నారు. కూలీలను బయటకు తీసుకువచ్చేందుకు ఎస్‌డిఆర్ఎఫ్, పోలీసులు చర్యలు తీసుకున్నారు

ప్రార్థనా మందిరంలో చిక్కుకున్న 15 మంది

బాపట్ల జిల్లా, పర్చూరులో పర్చూరు వాగు సమీపంలోని ఒక ప్రార్థనా మందిరం చుట్టూ వరద నీరు చేరడంతో 15 మంది ప్రార్థన మందిరంలో చిక్కుకున్నారు. అతికష్టం మీద అధికారులు వారిని బయటకు తీసుకువచ్చారు.

వేట లేక పూట గడవక

కాకినాడలో సుమారు 1,230 మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. తుపాను ప్రభావంతో వారం రోజుల నుంచి వారు సముద్రంలో వేటకు వెళ్లడం లేదు. పునరావాస కేంద్రాల్లో అరకొరగానే ఏర్పాట్లు చేయడంతో బుధవారం ఉదయమే పలువురు ఇళ్లకు వెళ్లిపోయారు. యు.కొత్తపల్లి మండలంలో సముద్ర కోతకు గురైన వారి పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఇళ్లను కోల్పోయిన వారు పరాయి పంచన తలదాచుకుంటున్నారు. మరికొందరు పునరావాస కేంద్రంలోనే ఉన్నారు.

ఉధృతంగా నదులు

ప్రజాశక్తి - యంత్రాంగం

మొంథా తుపాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పలు నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. నదుల్లోకి ఎవ్వరూ దిగరాదని, చేపట వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. నంద్యాల జిల్లాలో కుందూనదికి వరద ప్రవాహం పెరిగింది. సంత జూటూరు ఆనకట్ట వద్ద 25 వేల క్యూసెక్కుల ప్రవాహం ఉండగా సాయంకాలానికి 15 వేల క్యూసెక్కులకు తగ్గింది. ఉదయం నుండి కుందూకు వరద ప్రవాహం అధికంగా ఉండడంతో పరివాహక లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. విజయనగరం జిల్లాలోని తాటిపూడి రిజర్వాయర్ నీటిమట్టం పెరిగింది. జలాశయం గరిష్ట నీటిమట్టం 297 అడుగులు కాగా, మంగళవారం రాత్రికి 294.30 అడుగులకు చేరుకుంది. దీంతో మూడు గేట్లను ఎత్తివేశారు. వంగర మండలంలోని మడ్డువలస రిజర్వాయర్‌లో గరిష్ట నీటిమట్టం 65 మీటర్లు కాగా ప్రస్తుతం 63.53 మీటర్లకు చేరుకుంది. రిజర్వాయర్‌లోకి 24,500 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా, అవుట్‌ఫ్లో 21,600 క్యూసెక్కులుగా ఉంది. వంశధారలో 36,500 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. బాహుదాలో ప్రస్తుతం 42 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. ఈ నది మధ్యలో ఉన్న శివుని భారీ విగ్రహం చేతిలోని త్రిశూలం మంగళవారం కొట్టుకుపోయింది. బుధవారం యధాస్థితికి చేరుకుంది. నాగావళిలో ప్రస్తుతం 30 వేల క్యూసెక్కుల వరదనీరు ప్రవహిస్తోంది. అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు శారదా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. రైవాడ, పెద్దేరు జలాశయాల నుంచి అధిక మొత్తంలో నీటిని విడుదల చేస్తున్నందున శారదా నది ప్రవాహం పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. వరద సమాచారాన్ని లోతట్టు గ్రామస్తులకు దండోరా, మైకుల ద్వారా తెలియజేస్తున్నారు.


అనకాపల్లి వల్ల ఉధృతంగా ప్రవహిస్తున్న శారదా నది

పంట నష్టం అంచనాలు రూపొందించండి: లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వర్షాలకు దెబ్బతిన్న వివిధ పంటలను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవడంతోపాటు పంట నష్టం అంచనాలను రూపొందించాలని జిల్లాల కలెక్టర్లను విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. మొంథా తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో సచివాలయం నుంచి బుధవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను వల్ల కలిగిన నష్టంపై ప్రాథమిక అంచనాలు త్వరితగతిన రూపొందించాలని ఆదేశించారు. తుపాను ప్రభావంతో జరిగిన ప్రాణనష్టం, దెబ్బతిన్న నిర్మాణాలను నివేదించాలని చెప్పారు. వచ్చే 48 గంటల పాటు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ముంపు ప్రాంతాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా తగిన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టడంతోపాటు పాముకాటుకు ఉపయోగించే యాంటీ వీనం ఔషధాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణతోపాటు ముంపు ప్రాంతాల్లో ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మత్స్యకారులు, తుపాను ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు అవసరమైన నిత్యావసర సరుకులను పంపిణీ చేసి, అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో హోంమంత్రి వంగలపూడి అనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.


కూలిన బ్రహ్మంగారు నివాసం ఉన్న దక్షిణ వైపు గోడ

కూలిన వీరబ్రహ్మేంద్రస్వామి గృహం

ప్రజాశక్తి-బ్రహ్మంగారిమఠం

భారీ వర్షాలకు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నివాస గృహం మంగళవారం రాత్రి కుప్పకూలింది. కడప జిల్లా కందిమల్లయ్యపల్లె గ్రామంలో ఉన్న ఆయన ఇల్లు దక్షిణ వైపు గోడ కూలిపోయింది. 1979, 1982లో ముగ్గురు యాత్రికులు పాత ఇంటి స్థానంలో గదులు, వరండాను రాతి కట్టడంతో నిర్మించారు. గోడ కూలిపోవడానికి మఠం అధికారుల నిర్లక్ష్యమే కారణమని యాత్రికులు విమర్శిస్తున్నారు. టోకెన్ రూపంలో యాత్రికుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారే తప్ప కనీసం మరమ్మతులు కూడా చేయించకపోవడం బాధకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఐఎంఎస్‌తో సరికొత్త విధానానికి నాంది : పల్లా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన రియల్ టైమ్ ఇన్సిడెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఐఎంఎస్) రాష్ట్ర పాలనలో కొత్త యుగానికి నాంది పలుకుతుందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం, సమన్వయం, పారదర్శకత తీసుకురావడమే సాంకేతికత అసలైన అర్థం అని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో కొత్త దిశగా అడుగులు వేస్తూ పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం (పిజిఆర్ఎస్)ను ఆధునీకరించి ఐఎంఎస్ రూపంలో ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని పేర్కొన్నారు.

ప్రతి రైతునూ ఆదుకుంటాం : నాదెండ్ల

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

తుపాన్ వల్ల నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటామని, ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తుపాన్ సహాయక చర్యలపై ఏలూరు కలెక్టరేట్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. గత సంవత్సరంలో 34 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, ప్రస్తుత సీజన్‌లో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. తడిసిన ధాన్యం కొనుగోలుపై రైస్‌మిల్లర్లతో చర్చించామని, పంట నష్టాలపై 30వ తేదీలోగా నివేదికలు అందించాలని అధికారులను ఆదేశించామన్నారు.


జివిఎంసి 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లో విద్యుత్ స్తంభం పునరుద్ధరణలో సహకరించిన సిపిఎం, డివైఎఫ్ఐ నాయకులు, చిత్రంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఉన్నారు.


అనకాపల్లి జిల్లాలో నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ముంపు ప్రాంతాల్లో సిపిఎం నేతల పర్యటన

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్రంలో తుపాను ప్రభావిత గ్రామాల్లో నీట మునిగిన పంటలు, పునరావాస కేంద్రాలను సిపిఎం ప్రతినిధి బృందాలు బుధవారం పరిశీలించాయి. తుపాను ప్రభావం కారణంగా నష్టపోయిన రైతులను, ప్రజలను అన్ని విధాలా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు.

తాడేపల్లి పట్టణంలోని ముగ్గురు రోడ్డు, పుష్కర కాలనీ, బోటు యార్డు తదితర పునరావాస శిబిరాలను, తుపాన్ ప్రభావిత ప్రాంతాలను సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి, తాడేపల్లి పట్టణ నాయకులతో కలిసి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు సందర్శించారు. వర్షాల కారణంగా తాము ఉంటున్న ఇళ్లలోకి నీరు వచ్చి నివాసానికి అనుకూలంగా లేవని తుపాను బాధితులు వాపోయారు. బాబూరావు మాట్లాడుతూ... పునరావాస శిబిరాలలో తలదాచుకుంటున్న వారితోపాటు శిబిరాలలోకి రాలేకపోయిన కుటుంబాలకు మూడు వేల రూపాయలు చొప్పున ఆర్థిక పరిహారం, నిత్యావసర సరుకులు వెంటనే అందించాలని కోరారు. అనకాపల్లి జిల్లాలోని గ్రామంలో నీట మునిగిన వరి పంటలను, దేవరాపల్లి మండలం చింతలపూడి సచివాలయంలోని పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. శ్రీకాకుళం జిల్లా సొంపేట మండలంలోని పైడిగాంలో పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. విజయనగరం రామభద్రపురం మండల కేంద్రం, ఇట్లా మామిడిపల్లి, సోంపురం గ్రామంలో తుపాను కారణంగా నేలకొరిగిన పత్తి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడి నష్టం వివరాల అడిగి తెలుసుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం మామిడిపల్లిలో, కొమరాడ మండలంలో పంట నష్టాలను పరిశీలించి బాధిత రైతలతో మాట్లాడారు. నెల్లూరు జిల్లాలో నీళ్లతో నిండిన టిడ్కో ఇళ్లను పరిశీలించారు. ఏలూరు జిల్లా కస్తూరిబా హైస్కూల్, తంగెళ్లమూడి మసీదు, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం మండం, చింతలపూడి పట్టణం ఉన్న పునరావాస కేంద్రాలను సందర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలంలో నల్లిక్రీక్‌పై చినమైనవానిలంక గ్రామంలో పాడైపోయిన వంతెన, రోడ్డు కోతకు గురైన ప్రాంతాన్ని సందర్శించారు. పెనుగొండ మండలం సిద్దాంతం, బాధితులకు సిపిఎం ఆధ్వర్యాన బిస్కెట్ ప్యాకెట్లు, రస్కుల ప్యాకెట్లు, వేరుశనగ ఉండలు పంపిణీ చేశారు.


తాడేపల్లిలోని పునరావాస శిబిరంలోని వారితో మాట్లాడుతున్న సిహెచ్ బాబూరావు

తుపాను అనంతర చర్యలపై దృష్టి

- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మొంథా తుపాను అనంతర చర్యలను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సమస్య ఎదురయ్యే అవకాశం ఉన్నందున ఎక్కడా ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయం నుంచి జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను బుధవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తుపాను ప్రభావం తీవ్రంగా ఉన్న గ్రామాల్లో క్లోరినేషన్, సూపర్ శానిటేషన్ కార్యక్రమాలు ప్రారంభించాలన్నారు. పాడైన రోడ్లను ప్రాధాన్యతతో పునరుద్ధరించాలని సూచించారు. తుపాను కారణంగా 1,583 గ్రామాలు తీవ్రంగా ప్రభావితమైనట్లు ఉప ముఖ్యమంత్రి దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. 38 చోట్ల రోడ్లు దెబ్బతినగా, మరో 125 చోట్ల రహదారులకు గుంతలు ఏర్పడ్డాయని తెలిపారు. రక్షిత తాగునీటి పథకాల్లో క్లోరినేషన్ ప్రక్రియ చేస్తున్నట్లు చెప్పారు. తాగునీటిని అందించే పథకాలకు, నీటి సరఫరాకు ఏవైనా ఇబ్బందులుంటే ప్రత్యామ్నాయం చూడాలన్నారు. గ్రామాల్లో మొబైల్ శానిటేషన్ బృందాలను సిద్ధం చేయాలని, 21,055 మంది పారిశుధ్య సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేసి పారిశుధ్య మెరుగుదలకు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వాన నీరు నిలిచిన ప్రాంతాల్లో నీటిని బయటకు పంపాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా, వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమల వల్ల వచ్చే వ్యాధులు పెరుగుతాయని, వైద్యారోగ్యశాఖతో సమన్వయం చేసుకుని గ్రామాల్లో వ్యాధులు రాకుండా అరికట్టాలన్నారు. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకూ గ్రామాల్లో నిరంతరం పారిశుధ్య చర్యలు తీసుకోవాలని, ఎక్కడా లోటుపాట్లకు తావు లేకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణతేజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణపై మంత్రి గొట్టిపాటి సమీక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మొంథా తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సమస్యపై ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమీక్ష నిర్వహించారు. మూడు డిస్కమ్‌ల సిఎమ్‌డిలతో కలిసి బుధవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. నిరంతరాయ విద్యుత్ సరఫరాకు అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగులంతా పునరుద్ధరణ చర్యల్లో అప్రమత్తంగా వ్యవహరించి ప్రమాదాలను అరికట్టేలా చూడాలని కోరారు. తుపాన్ ధాటికి గాలులు వేగంగా వీయడంతో కొన్ని ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు మంత్రికి అధికారులు వివరించారు. పోల్ టూ పోల్ పెట్రోలింగ్ చేస్తూ సమస్య లేని చోట పునరుద్ధరణ చేయాలని మంత్రి ఆదేశించారు. ఎస్‌పిడిసిఎల్ నుంచి తీసుకొచ్చిన అదనపు సిబ్బందితో క్షేత్రస్థాయిలో పునరుద్ధరణ పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో వర్షం పడుతున్న కారణంగా పునరుద్ధరణకు సమయం పడుతుందని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో మూడు డిస్కంల సిఎమ్‌డిలు ఐ పృథ్వీతేజ్, శివశంకర్, పి పుల్లారెడ్డి పాల్గొన్నారు. కాగా విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్.. మంత్రి గొట్టిపాటికి ఫోన్ చేసి విద్యుత్ పునరుద్ధరణ చర్యలపై ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని సూచించారు.

దెబ్బతిన్న పంటలకు తక్షణమే పరిహారం

- ఎపి రైతు, కౌలు రైతు సంఘాల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మొంథా తుపాను ప్రభావంతో దెబ్బతిన్న ఆహార, వాణిజ్య పంటలకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలు రైతు సంఘాల రాష్ట్ర కమిటీలు డిమాండ్ చేశాయి. తుపాను ప్రభావంతో గోదావరి, కృష్ణా డెల్టా ప్రాంతంలో వరి పంట భారీగా దెబ్బతిన్నాయని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిఆర్ అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కృష్ణా, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో వరి, పత్తి, అరటి, మినుములు తదితర ఆహార, వాణిజ్య, ఉద్యాన పంటలు పెద్దయెత్తున దెబ్బతిన్నాయని, ఇవే కాకుండా ప్రకాశం, నంద్యాల, కర్నూలు జిల్లాల్లో అధిక వర్షాల కారణంగా పత్తి, వరి, మొక్కజొన్న, శనగ, మిర్చి వంటి పంటలు దెబ్బతిన్నాయని వెల్లడించారు.

ప్రాథమిక అంచనా ప్రకారం సుమారు 6 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని తెలుస్తోందన్నారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట, వెన్ను దశలో ఉన్న పంట నేలకొరిగి కంకులు నీటిలో నానుతున్నాయని తెలిపారు. ఫలితంగా దిగుబడి తగ్గడంతోపాటు ఖర్చులు పెరుగుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం తుపాను గురించి సకాలంలో హెచ్చరికలు చేయడం, అధికారులను, ప్రజలను అప్రమత్తం చేయటంతో ప్రాణ నష్టం జరగకుండా కాపాడగలిగిందన్నారు. పెనుగాలుల కారణంగా పంటలు భారీగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. తక్షణమే పంట నష్టం గురించి అంచనా వేసేందుకు వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ శాఖల అధికారులతో బృందాలను వేసి, పంటలు నష్టపోయిన రైతులను గుర్తించి జాబితాను రూపొందించాలని కోరారు.

పరిశీలన బృందాల్లో అధికారులు, సిబ్బందితోపాటు రైతు సంఘం, కౌలు రైతు సంఘాల ప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. ఎకరాకు వరికి రూ.25 వేలు, అరటి, పత్తి వంటి వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50 వేలు పంట నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలని కోరారు.

వ్యవసాయ కార్మికులకు నిత్యావసరాలు : ఎపి వ్యకాస డిమాండ్

గత నెల రోజులుగా పడుతున్న వర్షాలు, తాజా మొంథా తుపాను కారణంగా వ్యవసాయ కార్మికులు పనుల్లేక అవస్థలు పడుతున్నందున ప్రతి కుటుంబానికి రూ.20 వేల నగదు, 25 కిలోల బియ్యం, కందిపప్పు, మంచినూనె, నిత్యావసర సరుకులు, ఉచిత గ్యాస్ సిలిండర్ అదించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. వ్యవసాయ కార్మికులు ప్రతినెలా చెల్లించాల్సిన డ్వాక్రా రుణాల వాయిదాలను ఆరు నెలల పాటు వాయిదా వేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారీ వర్షాలు, తుపాను కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో తీవ్రమైన విష జ్వరాలు సంభవించే అవకాశం ఉన్నందున ప్రతి గ్రామంలో సురక్షితమైన మంచినీరు, ప్రతి కుటుంబానికి దోమతెరలు పంపిణీ చేయాలన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలని కోరారు.

గండ్లకు వెంటనే మరమ్మతులు

- మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భారీ వర్షాల వల్ల చెరువులకు గండ్లు పడినచోట వెంటనే మరమ్మతులు చేయాలని, దీనికోసం కలెక్టర్ల అనుమతులతో నిధులు వెచ్చించాలని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. వరదల నేపథ్యంలో బుధవారం జలవనరులశాఖ అధికారులతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వెలిగొండ టన్నెల్‌లో తొమ్మిది కిలోమీటర్ల దూరం నీరు రావడంపై ఆందోళన వ్యక్తం చేశారు. టన్నెల్ ఫీడర్ కెనాల్‌కు గండిపడి ఎగ్జిట్ ప్రాంతంలోకి నీరు వచ్చిందని, సిబ్బంది 250 మందిని తరలించామని తెలిపారు. అక్కడ డీవాటరింగ్ పనులు వెంటనే చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. గుండ్లకమ్మ పరీవాహక ప్రాంతం అధికవర్షాలతో అవుట్‌ఫ్లో 70 వేల క్యూసెక్కుల నుండి లక్ష క్యూసెక్కులకు విడుదల చేస్తున్నామని తెలిపారు. బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో దిగువ గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఒడిషా రాష్ట్రంలో వరదలను దృష్టిలో పెట్టుకుని బహుదా పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువుల, కాలువగట్లు కోతకు గురైతే తక్షణం మరమ్మతులు చేపట్టాలని పేర్కొన్నారు. విజయవాడ సమీపంలో బుడమేరు డైవర్షన్ ఛానల్‌పై నిరంతరం నిఘా ఉండాలన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

జిఓల గోప్యతపై పిల్

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్ర ప్రభుత్వం పలు జిఓలను బహిరంగపర్చకుండా గోప్యంగా ఉంచుతోందంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. జిఓలను ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయాలనే పిల్‌ను విచారించిన ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశించింది.

జిఓలను వెబ్‌సైట్‌లో ప్రభుత్వం అప్లోడ్ చేయడం లేదని, జిఒఐఆర్ వెబ్‌సైట్‌లో పలు జిఓలను అప్‌లోడ్ చేయడం లేదంటూ సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ ప్రాపర్టీ అండ్ ఎన్విరాన్మెంట్ రైట్స్ సంస్థ పిల్ తరపున న్యాయవాది జడా శ్రవణ్ కుమార్ వాదించారు.

గోద్రేజ్ అగ్రోవెట్ నుంచి 'అషితాక' కలుపు నివారి

గుంటూరు : ప్రముఖ విభిన్న వ్యవసాయ వ్యాపారాలలో ఒకటైన గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ మొక్కజొన్న పంట కోసం ప్రత్యేకంగా రూపొందించిన కొత్త కలుపు నివారిణిని ప్రారంభించినట్లు ప్రకటించింది. ఐఎస్‌కె జపాన్‌తో కలిసి అభివృద్ధి చేసిన 'అషితాక' భారత్‌లోని మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అయిన గడ్డి, వెడల్పు ఆకుల కలుపు మొక్కలపై సమర్థవంతమైన నియంత్రణను అందించే ఒక వినూత్న పరిష్కారమని గోద్రెజ్ ఆగ్రోవెట్ క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్ సిఇఒ రాజవేలు ఎన్‌కె తెలిపారు. అషితాకను 2 నుండి 4 ఆకుల కలుపు దశలో పిచికారీ చేయడం ద్వారా కలుపును చక్కగా నియంత్రించవచ్చన్నారు.

సత్యసాయి బాబా జయంతిపై ప్రభుత్వ నిర్ణయం సమర్థనీయమే

- హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

శ్రీసత్యసాయి బాబా వందో జయంతిని రాష్ట్ర వేడుకగా నిర్వహించాలన్న ప్రభుత్వ ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌పై హైకోర్టు స్పందించింది. సత్యసాయి బాబా ట్రస్ట్ మూడు జిల్లాల ప్రజల దాహార్తిని తీరుస్తోందని, పలు విద్యా సంస్థలు, ఆస్పత్రులను నిర్మించి ప్రజలకు సేవ చేస్తోందని గుర్తు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సమర్థనీయమేనని చెప్పింది. పిల్‌ను ఉపసంహరించుకోవాలని, లేకపోతే భారీ ఖర్చులు విధించి కొట్టేస్తామంది. దీంతో పిల్‌ను ప్రకాశం జిల్లాకు చెందిన భారత హేతువాద సంఘం అధ్యక్షులు వెంకట సుబ్బయ్య వాపస్ తీసుకున్నారు.

గుహలను తలపించేలా హాస్టళ్లు

- పెచ్చులూడుతున్న స్లాబులు
- చిన్నపాటి వర్షానికే కారుతున్న వైనం
- శిథిలావస్థలో పోరుమామిళ్ల ఎస్‌టి, రాజంపేట ఎస్‌సి హాస్టళ్లు



కూలేందుకు సిద్ధంగా ఉన్న రాజంపేట ఎస్‌సి హాస్టల్ వెనుక భాగం



పెచ్చులూడుతున్న రాజంపేట ఎస్‌సి హాస్టల్ పైకప్పు

ఎం.నూర్‌బాషా, కడప ప్రతినిధి

సమాజంలోని అట్టడుగు వర్గాలకు చెందిన నిరుపేద విద్యార్థులకు ఆవాసాలైన సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి దయనీయంగా ఉంది. ఉమ్మడి కడప జిల్లాలోని పోరుమామిళ్ల ఎస్‌టి రెసిడెన్షియల్ హాస్టల్, రాజంపేట ఎస్‌సి హాస్టల్ శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ రెండు హాస్టళ్లతోపాటు ఒంటిమిట్ట ఎస్‌టి హాస్టల్ కూడా చిన్నపాటి వర్షానికే కారిపోతోంది. రాజంపేట హాస్టల్ గాంఢాంధకారంతో కూడిన గుహలను తలపిస్తోంది. ఫ్లోరింగ్ అధ్వానంగా ఉంది. స్లాబులు, గోడలు పెచ్చులూడుతున్నాయి. స్లాబు నుంచి ఎర్రటి ఛారలు కలిగిన సహస్ర పాదపురుగులు కిందపడుతున్నాయి. మరుగుదొడ్లు దుర్వాసన వస్తున్నాయి. కిటికీల మెష్‌లు పాడైపోయి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. వెరసి క్షణం కూడా ఉండలేని పరిస్థితి. పలు హాస్టళ్లను 'ప్రజాశక్తి' బృందం పరిశీలించింది. ఉమ్మడి జిల్లాలో 66 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, 11 ఎస్‌టి హాస్టళ్లు, ఎనిమిది ఎస్‌టి హాస్టళ్లు, 24 గురుకుల హాస్టళ్లు, 17 కెజిబివి హాస్టళ్లు ఉన్నాయి. 42,752 మంది విద్యార్థులు వీటిలో ఉంటున్నారు. పోరుమామిళ్ల హాస్టల్‌లో 65 మంది, ఒంటిమిట్ట హాస్టల్‌లో 42 మంది, రాజంపేట హాస్టల్‌లో 43 మంది ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. రాజంపేట హాస్టల్ తలుపులు విరిగిపోయాయి. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. పైకప్పుకు వేసిన రేకులు కొన్ని చోట్ల విరిగిపోయాయి. స్నానపు కుళాయిలు పనిచేయడం లేదు.

పాఠశాలల్లో తలదాచుకుంటున్న హాస్టల్ విద్యార్థులు

పోరుమామిళ్ల, రాజంపేట హాస్టళ్లు శిథిలావస్థకు చేరాయి. గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఈ భవనాలు కూలిపోతాయేమోననే భయం నెలకొంది. పోరుమామిళ్ల రెసిడెన్షియల్ హాస్టల్ విద్యార్థులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పైఅంతస్తులో తలదాచుకుంటున్నారు. రాజంపేట హాస్టల్ విద్యార్థులు ఇళ్లకు వెళ్లి వస్తున్నారు. హాస్టల్ పరిసరాల్లో వర్షపు నీరు నిల్చిపోవడం, చిత్తడితో కూడిన రొచ్చు వల్ల దోమల బెడద అధికంగా ఉంది. 2005లో నిర్మితమైన ఒంటిమిట్ట హాస్టల్ భవనం గోడలనుంచి వర్షపు నీటి లీక్ అవుతుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నందలూరు ఎస్‌సి హాస్టల్‌లోని ఆర్ఒ ప్లాంట్ మరమ్మతులకు గురికావడంతో క్యాన్ల ద్వారా తాగునీరు తెప్పించడంతో పరిమితులు విధిస్తున్నారు. బెడ్‌షీట్లు లేకపోవడంతో ఇంటి దగ్గర నుంచి తెచ్చి వాడుకుంటున్నామని విద్యార్థులు తెలిపారు.

హామీలకే హాస్టళ్ల నిర్మాణం పరిమితం

పోరుమామిళ్ల, రాజంపేట హాస్టళ్ల భవన నిర్మాణానికి రూ.62 లక్షల చొప్పున కేటాయిస్తున్నామని అధికారులు ఏడాది కిందటి నుంచి చెప్తున్నా ఆచరణకు నోచుకోలేదు. తాజాగా కేంద్రం నుంచి పిఎం అజయ్ స్కీమ్ కింద రూ.మూడు కోట్ల వరకు మంజూరయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇప్పటికైనా ఈ హాస్టళ్లకు కొత్త భవన నిర్మాణాలు నిర్మించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

త్వరలోనే భవన నిర్మాణం చేపడతాం

రాజంపేట హాస్టల్ భవన నిర్మాణానికి రూ.62 లక్షలు మంజూరయ్యాయి. పాలనాపరమైన ఆమోదం లభించింది. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.

- హైమావతి, ఎఎస్‌డబ్ల్యూఒ, రాజంపేట

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై కౌంటర్ దాఖలు చేయండి

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



ప్రజాశక్తి-అమరావతి

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. అయితే విధానపర నిర్ణయాల్లో కోర్టుల జోక్యానికి ఆస్కారం తక్కువని పేర్కొంది. విచారణను నవంబరు 19కు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశించింది. రాష్ట్రంలో 10 వైద్య కళాశాలలను పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) విధానంలో అభివృద్ధికి ప్రభుత్వం జిఓ 590 జారీ చేయడం రాజ్యాంగ విరుద్ధమంటూ గుంటూరు జిల్లా, తాడేపల్లికి చెందిన సామాజిక కార్యకర్త డాక్టర్ కె వసుంధర పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరపున సీనియర్ అడ్వకేట్ ఎస్ శ్రీరామ్ వాదిస్తూ, ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు ఉచిత, నామమాత్రపు ధరలకే వైద్యం అందాలన్నారు. ప్రైవేటీకరణ వల్ల కార్పొరేట్ ఆస్పత్రుల్లో మాదిరిగా భారీ ఫీజులు ఉంటాయన్నారు. భారత్ అల్యూమినియం కంపెనీ మాదిరిగా కాకుండా చేయాలంటే జోక్యం చేసుకోవాలని ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు.

రాజధానిలో పెండింగ్ రిజిస్ట్రేషన్లు పూర్తి

- మంత్రి నారాయణ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని ప్రాంతంలో వేర్వేరు కారణాలతో రిజిస్ట్రేషన్లు పెండింగ్‌లో ఉన్నాయని, రైతులతో మాట్లాడి వాటిని పూర్తి చేస్తున్నామని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ తెలిపారు. బుధవారం సాయంత్రం వెలగపూడి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ తుది దశకు చేరుకుందన్నారు. 2,501 మందికి 8,441 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందని అన్నారు. ప్రతిరోజూ 60 నుంచి 90 ప్లాట్లు రిజిస్ట్రేషన్ అవుతున్నాయని వివరించారు. రాబోయే నెలల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ దాదాపు పూర్తి చేస్తామని వివరించారు. రైతులను తప్పుదోవ పట్టించేందుకు కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. భూ సమీకరణ కోసం 30,635 మంది రైతుల నుండి 34,911.23 ఎకరాలు తీసుకోవాలని నిర్ణయించామని, ఇప్పటి వరకూ 29,644 మంది నుండి 34,192.19 ఎకరాలు తీసుకున్నామని, వారికి ప్లాట్ల కేటాయింపు పూర్తయిందని తెలిపారు. ఇంకా 991 మంది రైతులకు సంబంధించి 719 ఎకరాలకు ప్లాట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. అలాగే ఉండవల్లిలో లేఅవుట్ ఫైనల్ కాకపోవడం, లంక భూములు, కోర్టు కేసులు, పిఒటి కేసులు, 12 సెంట్ల లోపు భూములు వంటివి ఉన్నాయని పేర్కొన్నారు. 29,233 మంది రైతులకు 69,421 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకూ 26,732 మంది రైతులకు 60,980 ప్లాట్లు రిజిస్ట్రేషన్ పూర్తయిందని వివరించారు. వీటిల్లో 70 మంది రైతులకు సంబంధించి 312 కోర్టు కేసుల్లో ఉన్నాయని చెప్పారు. భూసేకరణ అంశంలో 1,170 ప్లాట్లు పెండింగులో ఉన్నాయని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 231.03 కోట్ల నగదు చెల్లించగా, మరో 484 మంది రైతులకు 3.15 కోట్లు సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రెండు ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి 319 మంది రైతులకు రూ.1.03 కోట్లు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. కోర్టు కేసులతోపాటు చనిపోయిన వారికి సంబంధించిన వివాదాలతో ఇవి పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి వివరించారు.

రూ.188 కోట్లతో విద్యుత్ ట్రాక్షన్ వ్యవస్థ అభివృద్ధి

- రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గుంటూరు - పగిడిపల్లి, మోటమర్రి - విష్ణుపురం సెక్షన్ల మధ్య విద్యుత్ ట్రాక్షన్ వ్యవస్థను మెరుగుపరచడానికి రూపొందించిన ప్రతిపాదనను రైల్వే మంత్రిత్వశాఖ ఆమోదించిందని దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. ఈ ప్రాజెక్టు వ్యయం రూ.188.31 కోట్లుగా ఉందని బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రతిపాదనల్లో సెక్షన్ల మధ్య సర్క్యూట్ బ్రేకర్ల మార్పు, స్విచ్చింగ్ స్టేషన్లు, ప్రస్తుత వ్యవస్థలో అదనపు కండక్టర్లను స్థాపించడం వంటి పనులు ఉన్నాయని పేర్కొంది. వచ్చే మూడేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు రైల్వే మంత్రిత్వశాఖ నిర్ణయించినట్లు తెలిపింది.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పరిధిలోకి ఈ ప్రాజెక్టు వస్తుందని వెల్లడించింది. ఈ వ్యవస్థ పాసింజర్, గూడ్స్ రైళ్ల రాకపోకలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు సహాయపడుతుందని పేర్కొంది.

హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సుభేందు బాధ్యతలు స్వీకరణ



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సుభేందు సామంత బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టులోని మొదటి కోర్టు హాల్లో సభేందుతో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ బుధవారం ప్రమాణ స్వీకారం చేయించారు. సుభేందు కోల్‌కతా హైకోర్టు నుంచి రాష్ట్ర హైకోర్టుకు న్యాయమూర్తిగా బదిలీపై వచ్చారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, అడిషనల్ సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె చిదంబరం, ఎపి బార్ కౌన్సిల్ అధ్యక్షులు ఎన్ ద్వారకానాథ్ రెడ్డి, అదనపు అడ్వకేట్ జనరల్ ఇ సాంబశివ ప్రతాప్, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పొన్నారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం లక్ష్మీనారాయణ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జివిఎలో రాష్ట్రం వాటా 7.79 శాతం

- టాప్‌లో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర
- ప్రాథమిక రంగంపై నీతిఅయోగ్ తాజా నివేదిక

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి


జాతీయ జివిఏ (స్థూల విలువ జోడింపు)లో రాష్ట్ర వాటా 7.79 శాతంగా నమోదైంది. ఇతర దక్షిణాది రాష్ట్రాల్లో కన్నా ఆంధ్రప్రదేశ్ మెరుగైన స్థానంలో ఉండడం విశేషం. ప్రాథమిక రంగానికి సంబంధించి తాజాగా నీతి అయోగ్ ప్రకటించిన నివేదికలో దేశంలోని అనేక రాష్ట్రాల జివిఏ వాటాలను వెల్లడించారు. ఈ జాబితాలో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానం గా నిలిచింది. అత్యల్ప వాటాను మిజోరామ్ నమోదుచేయగా, ఢిల్లీ కూడా అతి తక్కువగా జాతీయ జివిఏలో వాటా నమోదుచేసినట్లు నీతి అయోగ్ వెల్లడించింది.

తాజా నివేదికలో ఉత్తర ప్రదేశ్ 11.36 శాతం వాటా కలిగి ఉండగా, మహారాష్ట్ర 10.41 శాతం, రాజస్థాన్ 8.02 శాతం మధ్యప్రదేశ్ 7.82 శాతం వాటాలను కలిగి ఉన్నాయి. దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించి ఎపి 7.79 శాతం వాటా కలిగి ఉండగా, తమిళనాడు 5.39 శాతం, కర్నాటక 4.54 శాతం, కేరళ 1.66 శాతం, పాండిచ్చేరి 0.05 శాతం వాటాని జాతీయ జివిఏలో సాధించాయి. అయితే కేంద్ర పాలిత ప్రాంతం, దేశ రాజధాని ఢిల్లీ కేవలం 0.2 శాతం జివిఏ వాటాతో మాత్రమే ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. మిజోరమ్ 0.1 శాతంతో అట్టడుగు స్థానంలో కొనసాగుతోంది.

ఇక సేవారంగం విభాగంలో జాతీయ జివిఏలో మహారాష్ట్ర వాటా ఏకంగా 15.52 శాతంగా ఉండగా, కర్నాటక 10.47 శాతంగా, తమిళనాడు 8.72 శాతం వాటాతో కొనసాగుతున్నాయి. ఈ విభాగంలో ఆంధ్రప్రదేశ్ కేవలం 3.66 శాతం వాటాను కలిగి ఉండగా, కేరళ 4.44 శాతం వాటాను సాధించింది. మరో తెలుగు రాష్ట్రమైన తెలంగాణ 5.22 శాతం, పాండిచ్చేరి 0.14 శాతం జివిఏ వాటా కలిగి ఉన్నాయి. అత్యల్పంగా మిజోరామ్ 0.2 శాతం వాటా కలిగి ఉండగా, దేశ రాజధాని ఢిల్లీ 6.05 శాతం వాటాను సాధించింది.

జివిఏ వాటా తక్కువగా ఉన్న రాష్ట్రాలు వ్యవసాయం, పరిశ్రమలు వంటి రంగాలపై మరింతగా దృష్టి సారించాలని నీతి అయోగ్ సూచనలు చేసింది. కొన్ని రాష్ట్రాల్లో గతంకన్నా జివిఏ వాటాలు తగ్గిపోతున్నాయని, ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగాలని పేర్కొంది. మేఘాలయ, మణిపూర్, నాగాలాండ్ వంటి కొన్ని నార్త్ ఈస్ట్ రాష్ట్రాలు జివిఏ వాటాలో మెరుగవుతున్న విషయాన్ని కూడా ప్రస్తావిస్తూ వాటిని ఇతర రాష్ట్రాలు అధ్యయనం చేయాలని సూచించింది.

భారత్‌లో అమెజాన్ 1000 మందిపై వేటు



న్యూఢిల్లీ: దిగ్గజ ఇ-కామర్స్ కంపెనీ అమెజాన్ భారత్‌లో 800-1000 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలకనుందని తెలుస్తోంది. తన కార్పొరేట్ విభాగంలో ప్రపంచ వ్యాప్తంగా 14,000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు మంగళవారం ప్రకటించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఇండియాలోనూ తొలగింపులు చేపట్టే పనిలో ఉంది. ముఖ్యంగా ఫైనాన్స్, మార్కెటింగ్, మానవ వనరులు, టెక్ విభాగంలో ఈ ఉద్వాసనలు ఉండొచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. కృత్రిమ మేధాపై భారీగా వ్యయాలు పెంచుతోన్న నేపథ్యంలో సిబ్బందిపై వ్యయాలను పెంచుకోవడం ద్వారా పొదుపు చర్యలకు దిగాలని నిర్ణయించుకుంది. తొలగించిన ఉద్యోగులకు కంపెనీలోనే కొత్త ఉద్యోగావకాశాన్ని వెతుక్కునేందుకు మూడు నెలల సమయం ఇస్తామని వెల్లడించింది. అమెజాన్ కార్పొరేట్ విభాగంలో 3.50 లక్షల మంది పనిచేస్తున్నారు. ఇందులో సుమారు 4 శాతం మందిని తొలగించడానికి కార్యాచరణ రూపొందించింది.



ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌లో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్

- రక్తదాన శిబిరం ఏర్పాటు

గుంటూరు : ప్రభుత్వ యాజమాన్యంలోని షెడ్యూల్డ్ బ్యాంక్ అయిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సమన్వయంతో 2025 విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ వేడుకలో భాగంగా గుంటూరులోని తన ప్రధాన కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపింది. ఈ కార్యక్రమాన్ని విజిలెన్స్ ఇన్‌ఛార్జ్ షిన్ హర్ష్ బేతా, ఒఎస్‌డిలు శంకర్ రావు, ఎం. అరుణ్ కుమార్, ఇతర జనరల్ మేనేజర్ల సమక్షంలో బ్యాంక్ చైర్మన్ కె ప్రమోద్ కుమార్ రెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. స్వయంగా రక్తదానం చేసిన తర్వాత చైర్మన్, రక్తదానం అనేది ఒక సేవా కార్యమని, సేవా స్ఫూర్తి ఉన్న చోట అవినీతికి చోటు లేదని నొక్కి చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలు మెరుగైన సమాజాన్ని బలోపేతం చేయడానికి దోహదపడతాయని, విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ లక్ష్యంతో సమానంగా ఉన్నాయన్నారు. ఈ గొప్ప పనిలో ఉత్సాహంగా పాల్గొన్నందుకు బ్యాంక్ యాజమాన్యం, సిబ్బందిని రెడ్ క్రాస్ సొసైటీకి చెందిన రాజు అభినందించారు. హెడ్ ఆఫీస్, ప్రాంతీయ కార్యాలయం, బ్యాంకు స్థానిక శాఖల నుండి 100 మందికి పైగా సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

ఎడి కార్యాలయాల వద్ద 7న చేనేతల ధర్నా

- జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ పిలుపు

ప్రజాశక్తి -మంగళగిరి (గుంటూరు జిల్లా)

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నవంబర్ 7న రాష్ట్ర వ్యాప్తంగా ఎడి కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత కరెంటు అమలు చేస్తామని చెప్పి 14 నెలలైందని, చేనేత కార్మికులకు సంవత్సరాలనికి రూ.25 వేలు ఇస్తామని ప్రకటించారని, వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. యారన్ సబ్సిడీ, పావలా వడ్డీ, రిబేటు కింద ఇవ్వాల్సిన రూ.176 కోట్లు విడుదల చేయాలని, సహకార సంఘాల దగ్గర ఆప్కో కొనుగోలు చేసిన వస్త్రాలకు డబ్బులు విడుదల చేయాలని కోరారు. ఆప్కో ఇవ్వవలసిన బకాయిలు సహకార సంఘాలకు సకాలంలో ఇవ్వడం లేదని, దీంతో చేనేత కార్మికులు, సహకార సంఘాలు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులలో తీసుకున్న అప్పులు చెల్లించలేక, వడ్డీలు కాస్తా చక్రవడ్డీలు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో సహకార సంఘాలలో చేనేత కార్మికులకు పనులు లేక వీధులు పాలయ్యారని అన్నారు. చేనేత రక్షణకు 11 రకాల రిజర్వేషన్లు అమలు చేయాలని, అవి ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. చేనేతపై జిఎస్‌టి పూర్తిగా రద్దు చేయాలని, చేనేత కార్మికులకు, సహకార సంఘాలలో పనిచేస్తున్న వారికి ఇవ్వవలసిన త్రిఫ్ట్‌ఫండ్ రూ.27 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మొంథాన్ తుపాను వల్ల జీవనం కోల్పోయిన చేనేత కార్మికులను వెంటనే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ధర్నా కార్యక్రమాల్లో చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆప్టిమో క్యాపిటల్ రూ.150 కోట్ల నిధుల సమీకరణ

హైదరాబాద్ : డిజిటల్ 'లోన్ ఎగైనెస్ట్ ప్రాపర్టీ' (ఎల్‌ఎపి) ఫిన్‌టెక్ సంస్థ అయినా ఆప్టిమో క్యాపిటల్ తాజాగా రూ.150 కోట్ల (17.5 మిలియన్ డాలర్లు) నిధులు సమీకరించినట్లు వెల్లడించింది. ఈ మొత్తాన్ని సిరీస్ ఏ రౌండ్‌లో అందుకున్నట్లు పేర్కొంది. ఈ రౌండ్‌కు సంస్థ వ్యవస్థాపకుడు ప్రశాంత్ పిట్టి నేతృత్వం వహించగా ఇప్పటికే ఉన్న ఇన్వెస్టర్లు బ్లూమ్ వెంచర్స్, ఓమ్నివోర్‌లు కూడా ఇందులో పాల్గొన్నాయి. ఎంఎస్‌ఎంఇ పారిశ్రామికవేత్తల ఆస్తిని పూచీకత్తుగా ఉపయోగించుకుని తక్కువ వడ్డీకే రుణాలు జారీ చేస్తోన్నట్లు ఆ సంస్థ పేర్కొంది. కేవలం 18 నెలల్లోనే ఆప్టిమో రూ.350 కోట్ల లోన్ బుక్‌ను చేరిందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు, ఎండి ప్రశాంత్ పిట్టి తెలిపారు.

సామ్‌సంగ్ వాలెట్‌లో 'డిజిటల్ కార్ కీ'

గూర్‌గావ్ : భారత్‌లో మహీంద్రా ఎలక్ట్రిక్ ఆరిజిన్ ఎస్‌యువిల కోసం సామ్‌సంగ్ వాలెట్‌లో డిజిటల్ కార్ కీ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు ఆ కంపెనీ తెలిపింది. మహీంద్రా ఇ-ఎస్‌యువిలను నడిపే వినియోగదారులు గెలాక్సీ స్మార్ట్‌ఫోన్లతో ఇప్పుడు 'డిజిటల్ కార్ కీ'ని ఉపయోగించి నేరుగా వాహనాలను యాక్సెస్ చేసే సులభమైన పరిష్కారాన్ని పొందవచ్చని తెలిపింది. భౌతికమైన కీ (ఫిజికల్ కీ) అవసరం లేకుండానే జత చేసిన వాహనాన్ని లాక్, అన్‌లాక్, స్టార్ట్ చేయడానికి వినియోగదారులను అనుమతిస్తుందని సామ్‌సంగ్ ఇండియా సర్వీసెస్ అండ్ యాప్స్ బిజినెస్ సీనియర్ డైరెక్టర్ మధుర్ చతుర్వేది అన్నారు.

బజాజ్ ఫిన్ ఎంఎఫ్‌లో పది లక్షల ఫోలియోలు

ముంబయి : బజాజ్ ఫిన్‌సర్వ్ మ్యూచువల్ ఫండ్ ఇటీవల 10 లక్షల ఫోలియోలను దాటినట్లు వెల్లడించింది. మ్యూచువల్ ఫండ్‌లలో ఒక్కో ఇన్వెస్టర్‌కు ఒక్కో ఖాతాను ఫోలియో అంటారు. 2023లో సంస్థను స్థాపించినప్పటి నుంచి 2025 సెప్టెంబర్ 30 నాటికి ఈ మైలురాయిని చేరినట్లు పేర్కొంది. సంస్థ మొత్తం ఆస్తులు (ఎయుఎం) రూ.28,814.16 కోట్లుగా నమోదయ్యిందని వెల్లడించింది. మొత్తం ఎయుఎంలో ఈక్విటీ స్కీములు రూ.12,727 కోట్లు, డెట్ రూ.11.520 కోట్లు, హైబ్రిడ్ రూ.3,339 కోట్లు, ప్యాసివ్ ఫండ్‌లు రూ.1,228 కోట్ల చొప్పున వాటా కలిగి ఉన్నాయని వెల్లడించింది.



కాగ్నిజెంట్ లాభాల్లో 7.3 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : యుఎస్ కేంద్రంగా పని చేస్తోన్న ఐటి దిగ్గజం కాగ్నిజెంట్ ప్రస్తుత ఏడాది సెప్టెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 7.3 శాతం వృద్ధితో 5.415 బిలియన్ డాలర్ల నికర లాభాలను సాధించినట్లు తెలిపింది. కంపెనీ రెవెన్యూ 7.4 శాతం పెరిగి 5.42 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. ఫైనాన్సీయల్ సర్వీసెస్ రెవెన్యూ 6.2 శాతం వృద్ధితో 1.58 బిలియన్లుగా చోటు చేసుకుంది. నాస్‌డాక్‌లో లిస్టింగ్ అయినా ఈ కంపెనీ ఈ ఏడాదికి 21.05-21.10 బిలియన్ డాలర్ల రెవెన్యూ అంచనా వేసింది.

గడిచిన మూడో త్రైమాసికంలో కొత్తగా 100 మిలియన్ డాలర్ల చొప్పున విలువ చేసే ఆరు ఒప్పందాలను కుదుర్చుకున్నట్లు పేర్కొంది. కొత్తగా 6వేల ఉద్యోగులు చేరడంతో మొత్తం సిబ్బంది సంఖ్య 3,49,800కి చేరిందని తెలిపింది.

సంపాదకీయం

సత్వర సాయం

కొద్ది రోజులుగా రాష్ట్రాన్ని భయోత్పాతానికి గురిచేసిన మొంథా తుపాన్ ఎట్టకేలకు తీరం దాటింది. మచిలీపట్నం-కళింగపట్నం మధ్య కాకినాడకు దక్షిణంగా నరసాపురానికి సమీపంలో మొంథా మంగళవారం అర్ధరాత్రి తీరం దాటినట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. ముందుగానే అంచనా వేసినట్లు తీవ్ర తుపాన్‌గానే తీరం దాటిన మొంథా కోస్తా జిల్లాల్లో అల్లకల్లోలం సృష్టించింది. తీరం దాటే సమయంలో 90 నుండి 110 కి.మీ వేగంతో వీచిన పెనుగాలులు, ఉవ్వెత్తున ఎగిసిన సముద్రపు అలలు భయానక పరిస్థితిని సృష్టించాయి. వందలాది చెట్లు నేలకూలాయి, విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయి, అనేక ప్రాంతాల్లో అంధకారం అలముకుంది. కోస్తా జిల్లాలన్నింటి మీద తుపాన్ తీవ్ర ప్రభావం చూపినప్పటికీ, కోనసీమ, కాకినాడ, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో భారీ నష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు. నష్టానికి సంబంధించిన పూర్తి స్థాయి నివేదికలను ప్రభుత్వం రూపొందించాల్సి ఉంది. తుపాన్ కారణంగా ప్రాణ నష్టాన్ని గణనీయంగా నివారించడం ఒక సానుకూల పరిణామం. రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల మంది తుపాన్ బాధితులుగా మారినట్లు, 76 వేల మందికి పైగా పునరావాస శిబిరాలకు తరలించినట్లు, తుపాన్ కారణంగా ముగ్గురు మృతి చెందినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

గతంతో పోలిస్తే అధికార యంత్రాంగం ఈ సారి మరింత అప్రమత్తంగా వ్యవహరించింది. పెనుగాలుల హెచ్చరికల నేపథ్యంలో జాతీయ రహదారిపై భారీ వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేయడం దీనికో ఉదాహరణ! ముఖ్యమంత్రి నుండి మంత్రుల వరకు మారథాన్ సమీక్షలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేశారు. రెవిన్యూ, విద్యుత్‌తో పాటు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, ఆశా, అంగన్‌వాడీ, పారామెడికల్ సిబ్బంది ప్రశంసనీయమైన కృషి చేశారు. కొందరు ఎంఎల్‌ఏలు, ప్రధాన ప్రతిపక్ష పార్టీకి చెందిన నేతలు కూడా బాధిత ప్రజల వద్దకు వెళ్లడం, వారి కష్ట నష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేయడం మంచిదే. సిపిఎంతో పాటు ప్రజాసంఘాల కార్యకర్తలు తొలి రోజు నుండి సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. హెచ్చరికల తీవ్రత దృష్ట్యా తమ కార్యాలయాలను పునరావాస కేంద్రాలుగా మార్చడానికి సంసిద్ధత వ్యక్తం చేయడం, ఆ మేరకు కొన్ని చోట్ల శిబిరాలు ఏర్పాటు చేయడం ప్రత్యేకత! క్లిష్ట సమయంలో రాజకీయ పార్టీలు వ్యవహరించాల్సిన తీరుకు ఇదో ఉదాహరణ. కరోనా సమయంలోనూ సిపిఎం, ప్రజాసంఘాలు ఇదే విధంగా స్పందించడం గమనార్హం.

ప్రకృతి విపత్తులు చోటుచేసుకున్నప్పుడు బాధితులను అన్ని విధాల ఆదుకోవడమే అత్యంత కీలకం! తాజా తుపాన్ కారణంగా వ్యవసాయం ముఖ్యంగా వరి, పత్తి తదితర పంటలకు పెద్ద ఎత్తున నష్టం జరిగింది. కోస్తా జిల్లాల్లో ఎక్కడ చూసినా నీట మునిగిన పైర్లు కనపడుతున్నాయి. గింజ పాలుపోసుకునే దశలో చోటుచేసుకున్న ఈ విపత్తుతో రైతాంగం దిక్కుతోచని స్థితిలో పడింది. ఏ గ్రామానికి వెళ్లినా నిండా మునిగిపోయిన తమను ఆదుకోవాలంటూ కన్నీటితో విజ్ఞప్తులు చేస్తున్న అన్నదాతలే కనిపిస్తున్నారు. కొబ్బరి, అరటి తోటలు కూడా విస్తృతంగా దెబ్బతిన్నాయి. ఈ సంవత్సరం పంటల బీమా పథకం కూడా రాష్ట్రంలో అమలులో లేకపోవడం గమనార్హం. ప్రభుత్వం తన వాటా కట్టకపోవడంతో ఈ పథకం ఆగిపోయింది. అలాగే మత్స్యకారులు! తుపాన్ వల్ల దాదాపు వారం రోజులుగా వేట ఆగిపోయింది. ఉవ్వెత్తున ఎగిసిన అలల కారణంగా తీరంలో కట్టిఉంచిన బోట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల సముద్రపు ఉధృతికి కొట్టుకుపోయినట్లు వార్తలు వస్తున్నాయి. రొయ్యల రైతులు కూడా భారీగా నష్టపోయారు. సహాయ శిబిరాల్లో చేతిలో పెట్టే కొద్దిపాటి మొత్తం బాధితుల కన్నీరు తుడవడానికి ఏమాత్రం చాలదు. బాధితులకు సత్వర సాయం అందించాలి. ఈ మేరకు అవసరమైన ఎన్యూమరేషన్‌ను వెంటనే ప్రారంభించాలి. కేంద్రం నుండి ప్రకృతి విపత్తు సాయం ఇతోధికంగా అందేట్లు చూడాలి. ప్రధాని, ముఖ్యమంత్రితో ఫోన్‌లో మాట్లాడితే చాలదు. నిధులు మంజూరు చేయాలి. హుద్‌హుద్ వంటి పెనుతుపానులు విరుచుకుపడ్డప్పుడు కూడా కేంద్ర ప్రభుత్వ స్పందన అంతంతమాత్రమే! సాయం కోసం ఏళ్లతరబడి ఎదురుచూడాల్సి వచ్చింది. ఈ సారి కూడా వట్టిమాటలతో సరిపెట్టకుండా పూర్తిసాయాన్ని తక్షణమే విడుదల చేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే!

మహనీయుల మాట



చరిత్ర నిర్మించేది
రాజులూ, సైనిక జనరల్సూ కాదు.
ప్రజలే.
- నెల్సన్ మండేలా,
దక్షిణాఫ్రికా జాతిపిత.

ఆర్‌ఎస్‌ఎస్ గుప్పిట్లోకి విద్యా వ్యవస్థ

సవేరా

2014లో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది మాసాల్లోనే అప్పటి విద్యామంత్రి స్మృతి ఇరానీ...ఆర్‌ఎస్‌ఎస్ లోపాయికారీ అనుబంధ సంస్థల నాయకులతో జనాంతికంగా సమావేశాలు జరుపుతున్నట్టు వార్తలు వచ్చాయి. మోడీ సర్కారు వచ్చాక మొదటి ఆరు నెలల కాలంలో ఆరు సమావేశాలు జరిగినట్టు 2014 నవంబర్ 23న 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' వెల్లడించింది. ఇలాంటి ఒక సమావేశంలోనే పాల్గొన్న ఒక వ్యక్తి చెప్పిన సంగతి ఆ పత్రిక పేర్కొంది. తన పేరు వెల్లడించలేదు. ఎన్‌డిఎ 1 (అంటే 1999-2004 మధ్య వాజ్‌పేయి ప్రభుత్వం) హయాంలో ప్రచారం చాలా ఎక్కువ జరిగింది గానీ పని తక్కువని ఆర్‌ఎస్‌ఎస్ సర్‌కార్యవాహ్ సురేష్ సోనీ ఆ సమావేశాలలో మాట్లాడుతూ చెప్పారట. 'ఈసారి మనం చాలా పని చేయాలి గనక మీరు దయచేసి పెద్దగా ప్రచారం చేయకండి' అని సోనీ కోరారట.

ఇంతకూ విద్యామంత్రి కలుసుకుంటున్న ఈ సంస్థలేవి? విద్యా విధానంపై ఆర్‌ఎస్‌ఎస్ ఆసక్తి ఏమిటి, ఎందుకు? గత పదకొండేళ్ల బిజెపి పాలనలో ఈ ప్రశ్నలు కొన్నింటికి స్పష్టమైన సమాధానాలు దొరికాయి. అప్పటి నుంచి ఇప్పటికి అనేకమంది కేంద్ర విద్యామంత్రులు వచ్చారు, పోయారు. అనేక కుదుపులు, మలుపులతో ఒక నూతన విద్యావిధానం (ఎన్ఇపి) రూపొందించబడింది. అది చాలా స్పష్టంగా ఆర్‌ఎస్‌ఎస్ హిందుత్వ ముద్రతో తయారైంది. ప్రాచీన నాగరికతా విలువలు, సాంస్కృతిక ఏకత, దేశభక్తి, నైతిక మూలాల వంటి ఉదాత్త పదజాలం ముసుగులో అది రూపొందింది. ఈ విధానంలో కార్పొరేట్లతో కరచాలనానికి చోటు కల్పించిన తీరు మాత్రం పవిత్రంగా ఏమీ లేదు. ఏ ప్రభుత్వమైనా ప్రజలకు విద్యగరపడం ఒక ప్రధాన బాధ్యతగా వుంటుంది గానీ ఇందులో ఆ పని అక్రమ ప్రైవేటు బేహారులకు అప్పగించబడింది.

ఆమూలాగ్రం వీరే!

అయితే దేశమంతటా అనుమానం వున్నప్పటికి అంత బాగా తెలియని విషయం ప్రాథమిక దశ నుంచి పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాల వరకూ మొత్తంగా హస్తగతం చేసుకున్న తీరు. ఆర్‌ఎస్‌ఎస్, దాని అనుబంధ సంస్థలకు సంబంధించిన సభ్యులను నియమించడం ద్వారా ఇది జరిగింది. స్కూల్ టీచర్ల నుంచి వైస్ ఛాన్సలర్ల వరకూ విద్యా పరిశోధనా సంస్థల డైరెక్టర్ల నుంచి స్వయం పాలక సంస్థల అధిపతుల వరకూ విద్యాసంస్థలను గుండుగుత్తగా కబళించడం పచ్చిగా జరిగిపోయింది. అధ్యయనాలు, పరిశోధనల దారి మరల్చేందుకు ఈ నియామకాలు దారితీశాయి. పరస్పర ప్రాపకం, ఆశ్రిత పక్షపాతంతో విద్యావ్యవస్థను విషపూరితం కావడానికి కారణమైంది.

విద్యా వ్యవస్థ దారి మళ్లింపులో మరో అంశం ఎన్‌సిఇఆర్‌టి, సిబిఎస్ఇ, వివిధ రాష్ట్రాల విద్యా బోర్డుల వంటి సంస్థలు చేపట్టిన పాఠ్యాంశాలను తిరగదోడడం. ఈ మార్పునకు ప్రాథమిక లక్ష్యం చరిత్ర విభాగమే. మొఘలుల యుగం, స్వాతంత్ర్య పోరాటం రెండూ మొత్తంగా కత్తిరింపులకు గురైనాయి. స్కూళ్ల పాఠ్యపుస్తకాలలోనూ ఉన్నత విద్యా సిలబస్‌లోనూ వాటిని మళ్లీ రూపొందిస్తున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ చెప్పే ముస్లిం వ్యతిరేక వైఖరికి అనుగుణంగానూ ఇతర హిందుత్వ అనుకూలతలను చరిత్రలో జొప్పించే విధంగానూ ఇది జరుగుతున్నది. వాస్తవానికి ఈ పరిణామాల చరిత్రలో వారి పాత్ర చాలా అప్రధానమైంది.

విద్యావ్యవస్థను ఆర్‌ఎస్‌ఎస్ కైవసం చేసుకునే క్రమంలో- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్‌ఎస్‌ఎస్ ప్రేరిత సంస్థలు చురుగ్గా చేయడానికి ఆర్థిక మద్దతు అందించడం అనే అంశం అతి తక్కువగానే దృష్టిలోకి వచ్చింది. ఇది చాలా విధాలుగా జరుగుతుంది. వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు స్పాన్సర్ చేయడం, తమకు అవసరమైన అంశాలపై స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం నుంచి ఆర్‌ఎస్‌ఎస్ ప్రేరిత సంస్థలు తయారుచేసిన పుస్తకాలను పాఠ్యగ్రంథాలుగా నిర్ణయించడం వరకూ జరుగుతున్నది. ఈ ప్రక్రియలో రెండు ప్రయోజనాలున్నాయి. అది ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థలకు డబ్బు సమకూరుస్తుంది. మరోవైపు విషతుల్యమైన వారి సైద్ధాంతిక భావజాలాన్ని వ్యాపింపచేస్తుంది. అనేక సంస్థలు ఈ కోవలోకి వస్తాయి. అవేంటో ఓ సారి చూద్దాం.

ఆర్‌ఎస్‌ఎస్ ప్రేరిత సంస్థలు

ఆర్‌ఎస్‌ఎస్ 32 సంస్థలకు ఆ విధమైన గుర్తింపునిచ్చింది. అంటే వాటి ప్రతినిధులు 'అఖిల భారత ప్రతినిధి సభ' అనే ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ వేదికలో వుంటారు. ఈ సంస్థల అగ్రపదాధికారులు ఏడాదికో సారి సమన్వయ బైఠక్ జరుపుతారు. అత్యున్నత నేత సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్, ఆయన కార్యనిర్వాహక సహాయకుడు దత్తాత్రేయ హోసబ్లే తదితరులతో సహ దీనికి అధ్యక్షత వహించి నడిపిస్తారు. ఈ ఏడాది సెప్టెంబరు మొదట్లో రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో జరిగిన సమావేశం ఇదే. గత ఏడాది కేరళలోని పాలక్కాడ్‌లో జరిగింది. విశేషమేమంటే ఈ 32 సంస్థల్లో బిజెపి కూడా ఒకటిగా పరిగణించబడుతుంది. బిజెపి అధ్యక్షుడు జె.పి నడ్డా సైతం పైన పేర్కొన్న సమావేశాలకు హాజరైనారు.

మోడీ ప్రభుత్వం పగ్గాలు చేపట్టాక ఆ 32 అనుబంధ సంఘాలను ఆరు విభాగాలుగా చేయడం మంచిదని ఆర్‌ఎస్‌ఎస్ భావించింది. అవే సమూహాలు. అవి పని చేసే రంగాలూ, క్షేత్రాలను బట్టి ఈ విభజన. ఆర్థిక, సేవా, శిక్ష (విద్య), సురక్ష, జన, విచార (ఆలోచన) అన్నవే ఆ ఆరు. ఈ విభాగాలు సంబంధిత మంత్రిత్వ శాఖలతో సమన్వయం చేసుకుని సూచనలు చేస్తాయనేది ఇక్కడ ఆలోచన. ఇందులోని విద్యావిభాగం మంత్రులు అధికారులు ఇంకా ఈ విషయంలో ప్రమేయం గలవారితో వరుసగా సమావేశాలు జరపడానికి నేపథ్యమిదే.

విద్యా విభాగం

ఈ విద్యా బృందంలో ఎవరెవరున్నారు? మీడియా నివేదికలను బట్టి 10 లేదా 11 సంఘాలున్నాయి. అవేంటో చూడ్డం అవగాహనకు దోహదకారి అవుతుంది.

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి): ఇది ఆర్‌ఎస్‌ఎస్ విద్యార్థి విభాగం. 1948లో ఏర్పడింది.



ప్రధానంగా ఉన్నత విద్యాకేంద్రాలలో పని చేస్తుంది. 24 మంది ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్‌లు దీంట్లో పనిచేస్తారు. మోడీ సర్కారు వచ్చాక ఆర్‌ఎస్‌ఎస్ తరపున 'దుమార సమూహం'గా దీని పాత్ర పెరిగింది. విద్యార్థులు, అధ్యాపకులు, ప్రిన్సిపాళ్ల విశ్వవిద్యాలయాలోని ఇతర అధికారులపై దాడులలో పాల్గొంది (జెఎన్‌యులో చూసిందదే.). ఆర్‌ఎస్‌ఎస్ ను వ్యతిరేకించేవారి కార్యక్రమాలను విచ్ఛిన్నం చేస్తుంది.

విద్యా భారతి: దీన్ని భారతీయ శిక్షా సంస్థాన్ అని కూడా అంటారు. అధికారికంగా గుర్తింపు పొందిన 15 వేల పాఠశాలలు నిర్వహిస్తున్నది. అంతేగాక గిరిజన ప్రాంతాల్లో 4000 ఏకల్ శిక్షా కేంద్రాలు (స్నేహపూరక ఏకోపాధ్యాయ పాఠశాలలు) పట్టణ పేదల ఆవాసాల్లో 5000 సంస్కార కేంద్రాలు నడిపిస్తుంది. ఈ రెండు తరహా సంస్థల్లోనూ 'నైతిక సాంస్కృతిక' విద్యాబోధన అంటుంది. 60 సాంకేతిక సంస్థలు కాలేజీలను కూడా విద్యా భారతి (వి.బి) నిర్వహిస్తుంది. 1977లో ప్రారంభమైన వి.బి లో 50 మందికి పైగా ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్‌లు పనిచేస్తుంటారని సమాచారం. పాఠశాలల ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ భావజాల వ్యాప్తికి సాధనంగా ఇది వుంటుంది. "హిందుత్వకు నిబద్ధమై, దేశభక్తి భావంతో ప్రేరణ పొందిన యువతరాన్ని తీర్చిదిద్దేలా జాతీయ విద్యా వ్యవస్థను పెంపొందించడం" తన లక్ష్యంగా వి.బి ప్రకటించుకున్నది. కురుక్షేత్ర (హర్యానా)లో విద్యాభారతి సంస్కృత శిక్షా సంస్థాన్ ద్వారా భారతీయ (హిందూ) సంస్కృతిని పెంపొందిస్తున్నట్టు కూడా వి.బి చెబుతుంది. బడిపిల్లల కోసం వివిధ భాషల్లో పుస్తకాలు ముద్రించే ప్రధాన బాధ్యత కూడా దీనిదే. దేశం కోసం తాము దేశంలోని 127 సరిహద్దు జిల్లాల్లో 323 తాలూకాల్లోనూ 167 చోట్ల 211 స్కూళ్లను నిర్వహిస్తున్నట్టు వి.బి ప్రకటించుకుంది. సైనిక్ స్కూళ్లను ఎన్‌జివో లకు ప్రైవేటు సంస్థలకు అప్పగించాలన్న మోడీ ప్రభుత్వ పథకం కింద వి.బి కి ఏడు సైనిక పాఠశాలల నిర్వహణకు అవకాశం లభించింది. అనేక విధాలైన పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్‌లను కూడా అది నడిపిస్తోంది.

అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్: 1988లో స్థాపించబడింది. 35 రాష్ట్ర స్థాయి, 50 విశ్వ విద్యాలయాల స్థాయి ఉపాధ్యాయ సంఘాల సమాఖ్యగా వుంది. ఇందులో ప్రాథమిక టీచర్ల నుంచి యూనివర్సిటీ అధ్యాపకుల దాకా వున్నారు. విద్యారంగంలో సమాజంలో సాంస్కృతిక జాతీయత భావనను ప్రచారం చేయడం లక్ష్యంగా ప్రకటించుకుంది.

అఖిల భారతీయ ఇతిహాసిక్ సంకలన్ యోజన: భారత దేశ చరిత్రను తిరగరాయడంలో నిమగ్నమైన సంస్థ. 1994లో ఏర్పడిన ఈ సంస్థ భారత దేశ అసలైన చరిత్రను కూర్చడం, ప్రస్తుత చరిత్ర రచనలో నిర్మాణంలో తేడాలు, తప్పులుగా తాము చెప్పేవాటిని సరిదిద్దడం, 'ఆర్య జాతి ఆక్రమణ సిద్ధాంతం' వంటి వాటిని మార్చడం పనిగా పెట్టుకుంది. వేదాలలోని సరస్వతి నదిపై పరిశోధన, పుణ్యక్షేత్రాల చరిత్ర కూర్పు, పురాణాల నుంచి చరిత్ర వంటి పరిశోధనలు చేస్తుంటుంది. అనేక పుస్తకాలు ప్రచురించింది. చరిత్ర పాఠాల బోధకులు, ఇతర మేధావులు ఇందులో సభ్యులుగా వున్నారు. భారత ప్రభుత్వ సంస్థగా వున్న 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రిసెర్చి' (ఐసిహెచ్ఆర్) ఇందుకు సంబంధించిన ప్రాజెక్టులకు సహాయం చేస్తున్నట్టు చెబుతారు.

శిక్షా సంస్కృతి ఉత్థాన్ న్యాస్: శిక్షా బచావో ఆందోళన నుంచి పుట్టిన ఈ సంస్థ భారత విద్యా వ్యవస్థలోని తప్పులను, వక్రాలను సరిచేస్తానంటుంది. విద్య ద్వారా భారతీయ విలువలను, విద్యార్థుల శీలాన్ని పెంపొందించి వారిలో ప్రాచీన సాంస్కృతిక వారసత్వాన్ని నింపడం లక్ష్యంగా చెబుతుంది. వేదగణితం నుంచి విద్య పర్యావరణ సంప్రదాయాల వంటి వాటిపై పుస్తకాలు ప్రచురిస్తుంది.

అఖిల భారతీయ సాహిత్య పరిషత్: 1966లో ఏర్పడింది. భారతీయ సాహిత్య భాషల సముద్ధరణ కోసం 22 రాష్ట్రాలలో శాఖలతో పని చేస్తున్నట్టు చెప్పుకుంటుంది. జాతీయ వాదం, ఉత్తమ సాహిత్యం ప్రోత్సహించం కోసం డజన్ల పుస్తకాలు తీసుకొచ్చింది.

విజ్ఞాన్ భారతి: 1991లో ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ శాస్త్రజ్ఞులు దీన్ని ప్రారంభించారు. భౌతిక ఆధ్యాత్మిక శాస్త్రాల మధ్య సమ్మిళితం చేయడం, భారతీయ స్ఫూర్తి తీసుకురావడం, సైన్స్ ఉద్యమంలో స్వదేశీ భావనను, పురాతన భారతీయ శాస్త్ర పరిజ్ఞానాన్ని పునరుద్ధరించడం దీని లక్ష్యాలుగా చెబుతుంది. అంతర్జాతీయ వేద విజ్ఞానం, ఆయుర్వేద మహాసభ, స్వదేశీ సైన్స్ కాంగ్రెస్‌లను నిర్వహించింది.

సంస్కృతి భారతి: సంస్కృతం మాట్లాడటాన్ని ప్రోత్సహించే ఉద్యమంగా 1991లో ఈరూపం తీసుకుంది. సంస్కృతం అన్ని భాషలకు తల్లి అంటుంది. ఈ భాష మాట్లాడేందుకు వేలమందిని ప్రోత్సహించినట్టు చెప్పుకునే ఈ సంస్థ అనేక పుస్తకాలు ప్రచురించింది.

భారతీయ శిక్షణ్ మండల్: సనాతన నీతి ప్రాతిపదికగా భాంతీయ విద్యావవస్థను పెంపొందించడం లక్ష్యంగా 1969లో స్థాపితమైంది. విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాలనాధికారులు అందరినీ కలుపుకొని పనిచేస్తుంది.

సంస్కార్ భారతి: భారతీయ సంస్కృతి వారసత్వాన్ని, లోతుగా తీసుకువెళ్లేందుకు, వివిధ రూపాల్లో కళా వికాసాన్ని సాధించేందుకు పని చేస్తానంటుంది. 1981లో ఏర్పడిన ఈ సంస్థ ఎగ్జిబిషన్లు, ఉత్సవాలు, శిక్షణా తరగుతులు నిర్వహిస్తుంది.

> విద్యావ్యవస్థను ఆర్‌ఎస్‌ఎస్ కైవసం చేసుకునే క్రమంలో- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్‌ఎస్‌ఎస్ ప్రేరిత సంస్థలు చురుగ్గా చేయడానికి ఆర్థిక మద్దతు అందించడం అనే అంశం అతి తక్కువగానే దృష్టిలోకి వచ్చింది. ఇది చాలా విధాలుగా జరుగుతుంది. వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు స్పాన్సర్ చేయడం, తమకు అవసరమైన అంశాలపై స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం నుంచి ఆర్‌ఎస్‌ఎస్ ప్రేరిత సంస్థలు తయారుచేసిన పుస్తకాలను పాఠ్యగ్రంథాలుగా నిర్ణయించడం వరకూ జరుగుతున్నది. ఈ ప్రక్రియలో రెండు ప్రయోజనాలున్నాయి. అది ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థలకు డబ్బు సమకూరుస్తుంది. మరోవైపు విషతుల్యమైన వారి సైద్ధాంతిక భావజాలాన్ని వ్యాపింపచేస్తుంది.

ప్రక్షాళనకు ప్రాధాన్యత

ఈ రంగంలో సంఘాలకు సంబంధించిన కొన్ని వివరాలివి. వాటి లక్ష్యాలలో పునరావృతి కూడా వుంటుంది. 1960 తర్వాత ఏర్పడిన ఈ సంస్థలన్నీ భావజాల వ్యాప్తికీ, ప్రచారానికి సాధనాలే. ఆర్‌ఎస్‌ఎస్ పూర్తికాలపు కార్యకర్తలు వాటిలో పని చేస్తూ తీర్చిదిద్దారు. ఎబివిపి వంటివి కొంత భిన్నమైనవి. ముందే ఏర్పడిన ప్రజాసంఘాలు. ఆ లక్షణాలతో పాటు జాతి నిర్మాణం వంటి సాధారణ అంశాలు కూడా చెబుతాయి. వీటిలో బాగా విస్తృతమైంది విద్యాభారతి. 1950లో యు.పి లో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు ప్రారంభించిన పాఠశాలలతో ఇది మొదలైంది. మహాత్మా గాంధీ హత్యలో పాత్ర కారణంగా ఆర్‌ఎస్‌ఎస్ కళంకం పాలైన కాలమది. తర్వాత ఆ తరహా పాఠశాలలనే ఇతర చోట్ల కూడా అనుసరించారు. తర్వాత కాలంలో అదే సమన్వయ కేంద్రంగా మారింది. శైక్షిక్ మహాసంఘ్ ఉపాధ్యాయుల సంఘంలా పనిచేస్తుంది. మిగిలినవన్నీ పరిమితమైనవి. కానీ మోడీ పాలనలో కొత్త ఊపిరి పోసుకున్నాయి. ఇప్పుడు వీటి పాత్ర, ప్రభావం, సలహాలు, ఆర్థిక సహాయం పొందే రీతులు అన్నీ విస్తరించాయి. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో పాటు మోడీ ప్రభుత్వ ప్రచారక పాత్ర కూడా పోషిస్తున్నాయి. ఇవన్నీ ఇప్పుడు ఎన్ఇపి భజనలో మునిగితేలుతున్నాయి. దీంతోపాటే ప్రైవేటు పెట్టుబడి పట్టు పెరుగుతున్నది. లౌకిక ప్రజాస్వామిక వ్యవస్థకు, వైజ్ఞానిక దృష్టికీ నూతన ఆలోచనకూ ఇదే ముప్పు అవుతున్నది. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ లను భవిష్యత్‌లో అధికారం నుంచి తొలగించబడిన వెంటనే ఈ వ్యవస్థలపై సమగ్ర ప్రక్షాళనకు ప్రాధాన్యత ఇవ్వాల్సి వుంటుంది. ★

తిరోగమన జాతీయ కార్మిక విధానం



పి.అజయ కుమార్



కేంద్ర మోడీ ప్రభుత్వం జాతీయ కార్మిక, ఉపాధి విధానం ముసాయిదాను ప్రకటించింది. దీనిని భాగస్వాముల కోసం చర్చకు, స్పందనకు పెట్టింది. ఈ విధానాన్ని సిఐటియు వ్యతిరేకిస్తూ కేంద్ర కార్మిక మంత్రికి లేఖ రాసింది. జాతీయ కార్మిక, ఉపాధి విధానం ఖరారు కావడానికి ముందుగా వెంటనే భారత కార్మిక మహాసభను సమావేశపరిచి, త్రైపాక్షిక యంత్రాంగంగా ఉన్న ఆ మహాసభలో చర్చించి ఏకాభిప్రాయానికి రావాలని కోరింది. ఇతర కార్మిక సంఘాలతో కలిసి ఐక్యంగా కూడా ఈ డిమాండ్‌ను లేవనెత్తే అవకాశం ఉంది.

జాతీయ కార్మిక విధానం అమల్లోకి వస్తే వివిధ సంస్థల రూపురేఖలే మారిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఇందులో ముఖ్యంగా కార్మిక ఉపాధి మంత్రిత్వశాఖ ఇకనుండి నియంత్రణ, తనిఖీల నుండి జాతీయ ఉపాధి సహాయకునిగా మారుతుంది. భారత కార్మిక మహాసభ స్థానంలో మంత్రిత్వ శాఖలు, రాష్ట్రాలు, పారిశ్రామిక మరియు కార్మిక సంఘాలను సంవత్సరానికోసారి ఒకే వేదికల మీదకు తీసుకువచ్చే సమావేశాలు జరుగుతాయి. పరిశ్రమలు, ప్రభుత్వాలు, కార్మికుల గ్రూపులకు సమాన ప్రాతినిధ్యం విస్మరించబడుతుంది. కార్మిక వ్యతిరేక పక్షపాతం చూపించబడుతుంది.

లేబర్ మార్కెట్ సంస్కరణలు ఏవైతే ఇప్పుడు అమలులోకి వచ్చాయో లేదా రాబోతున్నాయో వాటికి అవసరమైన సంస్థాగత ఏర్పాటును జాతీయ కార్మిక విధానం రూపొందించింది. దేశ స్థాయిలో జాతీయ కార్మిక, ఉపాధి విధాన అమలు కౌన్సిల్ ఏర్పడుతుంది. పని అనుసంధానానికి మంత్రిత్వ శాఖల గ్రూపులు ఏర్పడతాయి. రాష్ట్ర స్థాయిలో కార్మిక ఉపాధి మిషన్, జిల్లా స్థాయిలో కార్మిక వనరుల కేంద్రాలు ఉంటాయి. దేశస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు కూడా పరిశ్రమలకు కావలసిన కార్మికులను సమకూర్చే కేంద్రాలుగా ఇవి ఉంటాయి మినహా కార్మిక చట్టాలను అమలు చేసే కేంద్రాలుగా ఇవి పనిచేయవు.

పురాతన ధర్మశాస్త్రాలకు ప్రతిరూపమైన మనుస్మృతిని జాతీయ కార్మిక విధానం ఆదర్శంగా తీసుకుంది. పురాతన కాలంలో శూద్రులుగా ఉన్న శ్రామికులను దోపిడీ చేయడానికి, అణచిపెట్టడానికి మనుస్మృతి ఏ విధంగా తోడ్పడిందో అదే విధంగా ప్రస్తుత కాలంలో జాతీయ కార్మిక విధానం ఎటువంటి ఆటంకాలు లేకుండా కార్మిక శ్రమకు ఎటువంటి రక్షణ లేకుండా చేసి చౌకగా కొల్లగొట్టే ఏర్పాట్లు చేసింది. కానీ అదే సమయంలో తేనె పూసిన మాటలు కొన్ని చెప్పింది. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులైన సమానత్వ హక్కు, వివక్షత లేని సమాన అవకాశాలు, అసోసియేషన్లు, యూనియన్లు పెట్టుకునే స్వేచ్ఛ గురించి మాట్లాడింది. శ్రమకు గౌరవం, మానవత్వంతో కూడిన పని పరిస్థితులు, ఇంకా ముఖ్యంగా ఉన్నత దశలో ఉన్న జీవన వేతనం గ్యారంటీని పేర్కొంది.

కానీ జాతీయ కార్మిక విధానం ఎక్కడా కూడా కార్మికులు ఎదుర్కొంటున్న అమానవీయ పరిస్థితులను సమీక్షించలేదు అనడం కంటే సమీక్షించదలుచుకోలేదు అనడం మంచిది. కార్మిక చట్టాలను అమలు చేయించేందుకు అవసరమైన తనిఖీలను పాలకులు నిలిపివేశారు. యూనియన్లు పెట్టుకుంటే కార్మికులను, నాయకులను తొలగిస్తున్నారు. చట్ట ప్రకారం సమ్మె చేసినా కార్మికులకు యజమానులు ఉద్వాసన చెబుతున్నారు. చట్ట ప్రకారం 8 గంటలు పని చేయాల్సి ఉన్నా, కార్మికులతో బలవంతంగా 10, 12 గంటల పాటు పని చేయించుకుంటున్నా కూడా, వారిని రక్షించే పనిలో కార్మిక శాఖ లేదు.

జాతీయ కార్మిక విధానం లేబర్ కోడ్స్‌ను సమర్థించింది. మెజార్టీ కార్మికులను కార్మిక చట్టాల పరిధి నుండి తొలగించిన లేబర్ కోడ్స్‌ను ఒకపక్క సమర్థిస్తూ, మరోపక్క సార్వత్రికంగా కార్మికులందరినీ కలుపుకు పోతామని బొంకింది. ఎటువంటి కార్మిక హక్కులను పొందేందుకు సాహసించలేని నిర్ధారిత కాల ఉద్యోగాలను ప్రవేశపెట్టిన, కార్మికులను అతి తేలిగ్గా తొలగించే అధికారాలు ఇచ్చిన లేబర్ కోడ్స్‌ను సమర్థిస్తూ, మరోపక్క మానవీయతతో కూడిన పని పరిస్థితుల గురించి మాట్లాడి మభ్యపెట్టింది.

> యజమానులు తమంతట తామే స్వచ్ఛందంగా ప్రమాణాలను పాటించే విధానాన్ని జాతీయ కార్మిక విధానం ప్రతిపాదించింది. లేబర్ మార్కెట్ సంస్కరణలు కోరుకునేది ఇదే. మధ్యలో చట్టాలు, తనిఖీలు, ఆటంకాలు లేకుండా చేసి మార్కెట్ మీదికి కార్మికులను నెట్టివేసే విధానమే లేబర్ మార్కెట్ సంస్కరణల సారాంశం. పని చేయకుండా పొట్ట గడుపుకోవడానికి మార్గం లేని కార్మికులు తమ శ్రమను చౌకగా అమ్ముకునే పరిస్థితికి జాతీయ కార్మిక విధానం తీసుకొస్తుంది.

ఇప్పటికే తనిఖీలు లేకుండా చేసిన విధానాన్ని జాతీయ కార్మిక విధానం సమర్థించింది. ఫిర్యాదుల ఆధారంగా చట్టాల అమలు స్థానంలో, ఫలితాల ఆధారిత అమలును ప్రతిపాదించింది. అంటే, ఉదాహరణకి ఫార్మా లేదా రసాయనిక పరిశ్రమల్లో ప్రమాదం జరిగితే అక్కడ అప్పుడు నియమాలను పాటించకపోవడంపై తనిఖీ ఉంటుంది మినహా, ముందుగా తనిఖీలు ఉండబోవనే ఈ విధానం పరోక్షంగా స్పష్టం చేసింది.

సామాజిక భద్రతా పథకాల విలీనాన్ని జాతీయ కార్మిక విధానం ప్రతిపాదించింది. ఇ.పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ, ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన, జాతీయ ఉపాధి కల్పన సర్వీసులు (ఎన్.సి.ఎస్), ఈ-శ్రమ పథకాలను మిళితం చేస్తుంది. మిళితం కాబడిన సామాజిక భద్రతా పథకానికి కార్మికుల నుండే నిధులు సమకూరుతాయి. పథకాలకు బడ్జెట్ నుండి ప్రభుత్వం నిధులు కేటాయించదు. కొత్త పెన్షన్ పథకం మాదిరిగానే మొత్తం సామాజిక భద్రత మారిపోతుంది. కొత్త పెన్షన్ పథకం (న్యూ పెన్షన్ స్కీం)లోకి ఏ విధంగా సిపిఎస్ తదితర రూపాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, బ్యాంకు-ఇన్సూరెన్స్ ఉద్యోగులు, అసంఘటిత కార్మికులు తాము చెల్లించే నిధులతో ఏకం చేయబడ్డారో...కార్మిక, ఉద్యోగ వర్గాలు తాము చెల్లించే నిధులతోనే సామాజిక భద్రతా పథకంలో ఏకం చేయబడతారు. ప్రభుత్వాలకు, యాజమాన్యాలకు బాధ్యత లేకుండా పోతుంది.

మోడీ ప్రభుత్వం జాతీయ కార్మిక విధానంలో జీవన వేతనం ప్రస్తావన చేసింది. స్కీం కార్మికులకు, అసంఘటిత కార్మికులకు కనీస వేతనం ఇవ్వడానికే సిద్ధం కాని మోడీ ప్రభుత్వం, వేతన ఉన్నత స్థాయి రూపమైన జీవన వేతన ప్రస్తావన చేసి మభ్యపెట్టింది. తను వేసిన కమిటీ జాతీయ కనీస వేతనాన్ని రోజుకు 375 రూపాయలుగా నిర్ధారించాలని సిఫార్సు చేసింది. అది కూడా అతి తక్కువ వేతనం. దాన్ని కూడా అంగీకరించకుండా కేవలం రోజుకు రూ.178 మాత్రమే అంతిమంగా ఖరారు చేసింది. దీనిని బట్టి జాతీయ కార్మిక విధానం రూపురేఖలు ఏ విధంగా కార్మిక వ్యతిరేకంగా ఉంటాయో ముందుగానే అంచనా కట్టవచ్చు.

యజమానులు తమంతట తామే స్వచ్ఛందంగా ప్రమాణాలను పాటించే విధానాన్ని జాతీయ కార్మిక విధానం ప్రతిపాదించింది. లేబర్ మార్కెట్ సంస్కరణలు కోరుకునేది ఇదే. మధ్యలో చట్టాలు, తనిఖీలు, ఆటంకాలు లేకుండా చేసి మార్కెట్ మీదికి కార్మికులను నెట్టివేసే విధానమే లేబర్ మార్కెట్ సంస్కరణల సారాంశం. పని చేయకుండా పొట్ట గడుపుకోవడానికి మార్గం లేని కార్మికులు తమ శ్రమను చౌకగా అమ్ముకునే పరిస్థితికి జాతీయ కార్మిక విధానం తీసుకొస్తుంది.


కార్మిక, ఉపాధి విధానాన్ని మూల్యాంకనం చేసే సూచిక (ఇండెక్స్)ను ప్రవేశపెడతారు. ఎలాగైతే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (తేలికగా వ్యాపారాలు చేసుకోగలగడం) అమలుపై రాష్ట్రాలకు ర్యాంకులు ఇస్తున్నారో, జాతీయ కార్మిక ఉపాధి విధానం అమలుపై కూడా ర్యాంకులు ఇస్తారు. ఇక నుండి రాష్ట్రాలు పోటీలు పడి ర్యాంకుల సాధనలో నిమగ్నమై కార్మిక హక్కులకు, గౌరవంగా పనిచేసుకునే పరిస్థితులకు పాతర వేస్తాయి.

లేబర్ సంస్కరణల అమలు కోసం నిధులను సమీకరిస్తారు. కేంద్రం, రాష్ట్రాలు, ప్రైవేట్ సంస్థల నుండి వనరులను సమీకరించి లేబర్ సంస్కరణల యంత్రాంగాన్ని రూపొందిస్తారు. వెంటనే కార్మిక, ఉద్యోగ సంఘాలన్నీ ఏకమై జాతీయ కార్మిక ఉపాధి విధానాన్ని తిప్పి కొట్టడం మినహా మరో మార్గం లేదు.

/ వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు /

కవిత్వం

అప్పన్నా!



అప్పన్నా తనామనా
అందరికీ దండాలన్నా
అదానీ గూగులికి...
అప్పనంగా
భూములన్నా!?
అప్పన్నా తనామనా..
పంచ గ్రామాలోళ్లు
పట్టాలు అడిగితే
ఏళ్లు గడిచినా గాని
ఏలినోళ్లు తేల్చరు!
అడిగిందే తడవు
అడుగులకు
మడుగులొత్తి
రాసిచ్చేస్తారు అదానీకి
కొండలు!
అప్పన్నా తనామనా..
గండమని తెలిసినా
కొండలపై ఎగబాకి
పూరిపాక వేసుకుంటే
పీకి పారేస్తారు!
కంబాల కొండమీద
ఉయ్యాలలూగుతాడు
అభయారణ్యంలో బాబు
తోడు అదానోడు!
అప్పన్నా తనామనా..
పరవాడని ఇప్పటికే పర
వాడను చేశారు
అనందపురం దాటి
అమ్మేసుకున్నారు!
అమ్మకాలు, కొనుగోలు
అనకాపల్లి వరకు
అడవులు, కొండలకు
ఎగబాకుతున్నారు!
అప్పన్నా తనామనా..
కన్నెర్ర చేయలేదు
సిమ్మాద్రి రప్పన్న!
కన్నులు తెరవలేదు
కనకమాలచ్చుమ్మ!
కైలాసగిరి మీద
శివతాండవం లేదు!
రుషి కొండపై మునులు
పెదవి విప్పడం లేదు!
అప్పన్నా తనామనా ..
పలచటి ప్రశ్నలన్ని
చిక్కబడక తప్పదన్నా!
లేకపోతే మన విశాఖ
లేనోడికి దక్కదన్నా!
అప్పన్నా తనామనా
అందరికీ దండాలన్నా!

- నల్లి ధర్మారావు
సెల్ : 76609 67313

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుచానూరుకు చెందిన దాక్షాయిని (30) బుధవారం ఉదయం హోటల్లో ఓ రూమును అద్దెకి తీసుకొని, ఇంజన్ ఆయిల్ పోసుకుని నిప్పంటించుకుంది. విషయం తెలుసుకున్న హోటల్ యాజమాన్యం ఈస్ట్ పోలీసులకు సమాచారం. ఎనభై శాతం దేహం కాలిపోవడంతో చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సాయంత్రం 6 గంటల ప్రాంతంలో మృతి చెందారు.. మృతదేహన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం రూయా మార్చురీకి తరలించారు.

తుపాను వేళ దొంగలు హల్‌చల్

- ఐదు దుకాణాల్లో చోరీ



ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీమ్

ప్రజాశక్తి- పలాస (శ్రీకాకుళం జిల్లా)

ప్రజలు, అధికారులు, పోలీసులంతా తుపాను హడావిడిలో ఎవరి విధుల్లో వారు ఉన్నారు. దొంగలు మాత్రం అర్ధరాత్రి వేళ తాళాలు వేసిన నాలుగు షాపుల్లో చోరీకి పాల్పడ్డారు. నిత్యం రద్దీగా ఉండే శ్రీనివాస లాడ్జి కూడలి, పాత జాతీయ రహదారి, కాశీబుగ్గ పెట్రోలు బంకు సమీపంలో ఉన్న మొత్తం మూడు ఔషధ దుకాణాలు, ఒక ట్రావెల్, ఇంటర్నెట్ సెంటరులో చోరీకి పాల్పడ్డారు. మొత్తం రూ.4.11 లక్షల నగదు అపహరించినట్టు షాపు యజమానులు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన క్లూస్ టీమ్ సభ్యుల బృందం దొంగల వేలిముద్రలు సేకరించి వారిని గుర్తించే పనిలో ఉంది. బాధితుల కథనం ప్రకారం... శ్రీనివాస లాడ్జి కూడలిలో తంగుడు సాంబమూర్తి మెడికల్ స్టోర్ తాళాలు పగల కొట్టి దొంగలు లోపలకు ప్రవేశించారు. బ్యాగులో దాచి ఉంచిన రూ.3.65 లక్షల నగదు అపహరించారని యజమాని సురేష్ కుమార్ తెలిపారు. తాము రాత్రి 10.30 గంటల వరకూ షాపును తెరిచి ఉంచామని, బుధవారం ఉదయం బ్యాంకులో జమ చేయడానికి దాచిన డబ్బంతా దోచుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు కురవడంతో నగదు బ్యాంకులో వేయలేకపోయామని, ఏజెంట్లందరికీ ఇవ్వడానికి ఉంచిన డబ్బంతా పోవడంతో వారికి ఏమి సమాధానం చెప్పగలమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే ప్రాంతంలో ఉన్న రామకృష్ణ మెడికల్ స్టోర్‌లోనూ దొంగలు చొరబడ్డారు. షాపులో రూ.40 వేల నగదు బ్యాగులో ఉంచడంతో దాన్ని దొంగిలించారు. అనంతరం పాత జాతీయ రహదారి కాశీబుగ్గ పెట్రోలు బంకు సమీపంలో ఉన్న లక్ష్మి మెడికల్ స్టోర్స్ తాళాలు పగ కొట్టి నగదు, విలువైన సామగ్రి దొంగిలించారు. షాపు మేడపై ఉన్న ఇంటర్నెట్ సెంటరులోని డెస్క్‌లో దాచి ఉంచిన రూ.6 వేలు నగదుతో ఉడాయించారు. సంబంధిత షాపులకు సిసి కెమెరాలు ఉన్నా వర్షాలు కారణంగా అవి మొరాయించాయి. దీంతో ఎంత మంది దొంగలు వచ్చి దొంగతనానికి పాల్పడిందీ తెలియడం లేదు. జెడి రోడ్డు, పాత జాతీయ రహదారిపై ఉన్న పోలీసు నిఘా కెమెరాల్లో చోరీ వ్యవహారం నిక్షిప్తమై ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. శ్రీకాకుళం జిల్లా పోలీసు కేంద్రంలో ఉన్న కంట్రోల్ రూమ్‌లో దీన్ని పరిశీలించాల్సి ఉంది. సంఘటన స్థలానికి క్లూస్టీమ్ సభ్యులు వచ్చి దొంగల వేలిముద్రలు సేకరించారు. ఇదే ప్రాంతంలో రెండు నెలల క్రితం ఓ మొబైల్ స్టోర్‌లో రూ.1.20 లక్షల నగదు ఇదే తరహాలో చోరీకి గురైంది. ఎస్ఐ నరసింహమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మేయర్ జంట హత్య కేసులో తుది తీర్పు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

2015 నవంబర్ 17వ తేదీ నాటి నగర మేయర్ కఠారి అనురాధ, ఆమె భర్త కఠారి మోహన్‌ల జంట హత్యకేసు ఈనెల 16వ తేదీ విచారణ పూర్తి అయ్యింది.ఐదుగురు హత్య కేసులో ప్రత్యక్షంగా ప్రమేయం ఉన్నట్లు తొమ్మిదో అదనపు న్యాయమూర్తి శ్రీనివాసరావు తీర్పు ఇచ్చారు. జంట హత్యకేసులో ప్రమేయం ఉన్న నిందితులకు శిక్ష ఖరారు చేస్తారని భావించినా అక్టోబర్ 27వ తేదీకి శిక్ష తీర్పును మార్పు చేశారు. 27న హత్య కేసులో నిందితులుగా గుర్తించిన ఐదుగురు చంద్రశేఖర్ (చింటూ) వెంకటాచలపతి, వెంకటేష్, జయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్ విచారించిన తొమ్మిదో అదనపు న్యాయమూర్తి ఈనెల 30వ తేదీ గురువారానికి వాయిదా వేస్తూ రిమాండ్‌కు తరలించారు. ఈ హత్యకేసులో 16 మందికి నేరంలో పాత్రలేదని రుజువు కాలేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. దీంతో పోలీసు యంత్రాంగం చిత్తూరు జిల్లా ప్రధాన కోర్టు, గాంధీ సర్కుల్, గంగనపల్లి ప్రాంతాల్లో పోలీసు భద్రత ఏర్పాటు చేసింది.

యూఎస్ అటార్నీని పదవి నుంచి తప్పించిన కోర్టు

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌నకు అక్కడి కోర్టులో చుక్కెదురైంది. పలు క్రిమినల్ కేసులను పర్యవేక్షించడం కోసం ట్రంప్ నియమించిన యూఎస్ అటార్నీని కోర్టు పదవీ నుంచి తప్పించింది. యూఎస్ అటార్నీగా బిల్ ఎస్సైలీ పని చేస్తున్నారు. అయితే ఎస్సైలీ చట్టపరమైన కాలపరిమితి (120 రోజులు) దాటిన తర్వాత కూడా తాత్కాలిక హెూదాలో కొనసాగడం అన్యాయమని ఫెడరల్ జడ్జి అభిప్రాయపడ్డారు. యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి జె.మైఖేల్ సీబ్రైట్.. మూడు కేసుల్లో క్రిమినల్ ప్రాసిక్యూషన్ నుంచి బిల్ ఎస్సైలీని తప్పించాలని ఆదేశించారు.



బాలికను డోలీలో ఆస్పత్రికి తీసుకొచ్చి దృశ్యం

బాలికను డోలీలో తీసుకొచ్చి ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి- శృంగవరపుకోట (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం మూలబొడ్డవర పంచాయతీ శివారు చిట్టంపాడు గ్రామానికి చెందిన జర్నీ అంజలి అనే బాలికకు జ్వరం తీవ్రమైంది. దీంతో, డోలీలో వర్షంలోనే కొండ దిగువకు బుధవారం తీసుకొచ్చారు. అక్కడి నుంచి శృంగవరపుకోటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ గ్రామానికి రహదారి సౌకర్యం సరిగా లేకపోవడం, వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో డోలీలో తరలించాల్సి వచ్చింది.

తుపానుతో విద్యుత్‌శాఖకు రూ.17.83 కోట్ల నష్టం

- సిఎస్ విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మొంథా తుపాను వల్ల విద్యుత్ సంస్థలకు రూ.17.83 కోట్లు నష్టం వాటిల్లిందని ఇంధనశాఖ అంచనా వేసింది. ఎపిడిసిఎల్ పరిధిలో రూ.10.47 కోట్లు, సిపిడిసిఎల్ పరిధిలో రూ.6.51 కోట్లు, ఎస్‌పిడిసిఎల్ పరిధిలో రూ.85.25 లక్షలు చొప్పున నష్టం వాటిల్లిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ట్రాన్స్‌కోకు సంబంధించి 220 కెవి సబ్‌స్టేషన్లు 9, 400 కెవి సబ్‌స్టేషన్లు 3, 132 కెవి సబ్‌స్టేషన్లు 11 సమస్యలు తలెత్తాయని, వీటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకున్నామని తెలిపారు. మూడు డిస్కమ్‌ల పరిధిలో 2,871 సబ్‌స్టేషన్లు తుపాను వల్ల దెబ్బతిన్నాయని, 2,803 సబ్‌స్టేషన్లను పునరుద్ధరించామని పేర్కొన్నారు. సిపిడిసిఎల్ పరిధిలో 33/11కెవి సబ్‌స్టేషన్లు 2, 11కెవి ఫీడర్లు 55, ఇపిడిసిఎల్ పరిధిలో 11కెవి ఫీడర్లు 11ను పునరుద్ధరించాల్సి ఉందని వివరించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులకు అవరోధం ఉన్న ప్రాంతాల్లో సరఫరాకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి ప్రజలకు అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని, గురువారం నాటికి నూరుశాతం విద్యుత్ పునరుద్ధరణ పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో దాదాపు 1,100 మందికి పైగా వివిధ కేడర్ల సిబ్బందిని మోహరించి పకడ్బందీ ప్రణాళికతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టామని వివరించారు. పునరుద్ధరణ పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు అహర్నిశలు కృషి చేసిన డిస్కమ్‌ల సిఎమ్‌డిలు ఐ పృథ్వీతేజ్, ఎల్ శివశంకర్, పి పుల్లారెడ్డితోపాటు జెన్‌కో ఎమ్‌డి ఎస్ నాగలక్ష్మి, ట్రాన్స్‌కో జెఎమ్‌డి సూర్యసాయి ప్రవీణ్ చంద్‌లను, వారి ఆధ్వర్యాన పనిచేసిన సిబ్బందిని అభినందించారు.

ఇద్దరు సైబర్ నేరగాళ్లు అరెస్టు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మంత్రి నారా లోకేష్ పేరును దుర్వినియోగం చేస్తూ ప్రజలను మోసం చేసిన ఇద్దరు సైబర్ నేరగాళ్లను సిఐడి పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు కొండూరి రాజేష్, అతనికి సహకరించిన గుంటూరు జిల్లాకు చెందిన గుత్తికొండ సాయిశ్రీనాథ్, తెలంగాణలోని సంగారెడ్డి జిల్లాకు చెందిన సిహెచ్ సుమంత్.. మంత్రి లోకేష్ ఫొటోను వాట్సాప్ ప్రొఫైల్ పిక్‌గా పెట్టి, తాము టిడిపి ఎన్ఆర్ఐ విభాగానికి కన్వీనర్ అయిన సురేంద్రగా పరిచయం చేసుకొని ప్రజలను మోసం చేశారని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్యం కోసం డబ్బు సహాయంగా ఇప్పిస్తామని ఆశ చూపి ముందుగా 4 శాతం ఛార్జీలు చెల్లించాలంటూ బాధితుల వద్ద వసూలు చేశారని వెల్లడించారు. ట్విట్టర్‌లో వైద్య ఖర్చుల కోసం సాయం కోరిన వారిని లక్ష్యంగా చేసుకుని వీరు ఈ నేరాలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. విజయవాడ సమీపంలోని పోరంకికి చెందిన కాకర్ల లక్ష్మణ్ కుమార్ నుంచి రూ.2.32 లక్షలను నిందితులు వసూలు చేసినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 14 సైబర్ నేరాలకు వీరు పాల్పడ్డారని వెల్లడించారు.

రాయల్టీ ప్రయివేటుపరం... కార్మికులకు శాపం

- నిలిచిపోయిన నాపరాతి పనులు
- ఇబ్బందుల్లో కార్మికులు

ప్రజాశక్తి - తాడిపత్రి రూరల్

తాడిపత్రి అనేక పరిశ్రమలకు నెలవు. వ్యవసాయం తర్వాత నియోజకవర్గంలో నాపరాతి పరిశ్రమల ద్వారానే ఎన్నో వేల మంది కార్మికులు జీవనం సాగిస్తున్నారు. తాడిపత్రికి ఆనుకుని ఉన్న నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల, అవుకు తదితర ప్రాంతాల నుంచి రోజుకు ఎన్నో వందల ట్రాక్టర్లు, లారీలతో నాపరాతి గనుల నుంచి టన్నులకొద్దీ నల్లబండలు దిగుమతి అవుతుంటాయి. దీంతో నిత్యం నాపరాతి పరిశ్రమలు కలకలలాడుతూ ఉండేవి. అయితే ప్రభుత్వాలు రాయితీలు పెంచుతూ పన్నులు విధిస్తూ ఉండటంతో ఇక్కడ ఉన్న నాపరాతి పరిశ్రమలు డీలా పడుతున్నాయి. ప్రభుత్వాలకు రాయితీలు పన్నులు చెల్లించలేక రోజురోజుకు సన్నగిల్లిపోతున్నాయి ఈ పరిశ్రమలలో పనిచేసే వేలాదిమంది కార్మికులు జీవనోపాధిగా ఉన్న ఈ పనిని వదులుకోలేక అరకొరగానే పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు అయితే ఎన్నో ఆశలు పెట్టుకున్న టిడిపి కూటమి ప్రభుత్వం కూడా ప్రస్తుతం నాపరాతి పరిశ్రమలపై ఏమాత్రం దయ చూపడం లేదు. ఇటీవల ప్రభుత్వం నాపరాళ్ళు ఇతర ఖనిజాలు ఎగుమతి చేసేందుకు వసూలు చేసే సీనరేజ్ రాయల్టీని ప్రైవేటు సంస్థలకు అప్పగించడంతో కాస్త కూస్తో నడుస్తున్న నాపరాతి పరిశ్రమలు పూర్తిగా నిలిచిపోయాయి దీంతో పరిశ్రమలను నమ్ముకుని ఉన్న వేలాది కార్మికులు, వాటి ఆధారంగా ఉన్న ట్రాక్టర్లు, లారీలు, వాటి డ్రైవర్లకు ఉపాధి కరువైంది. కార్మికులు దిక్కుతోచని స్థితికి చేరుకున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని స్థితిలో ఉన్న కార్మికులను రాయల్టీని ప్రైవేటీకరించడం వల్ల మరింత కష్టాల్లోకి నెట్టేసినట్లయింది. రాయల్టీ ప్రైవేట్ పరం చేసుకున్న సంస్థలు ఈనెల 8 నుంచి రాయల్టీ వసూలు చేసేందుకు రంగంలోకి దిగాయి. నాపరాళ్లను రవాణా చేసేందుకు టన్నుకు రూ.222 చొప్పున వసూలు చేస్తున్నారు. దీంతో గనుల పరిశ్రమల యజమానులు ఎక్కడికక్కడే ట్రాక్టర్లను నిలిపేశారు. ప్రతిరోజు పక్కన ఉన్న నంద్యాల జిల్లా నుంచి దాదాపు 300 ట్రాక్టర్ల ద్వారా నాపరాళ్లు అనంతపురం, తాడిపత్రితో పాటు పలు ప్రాంతాలకు రవాణా జరిగేవి. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా రవాణా పూర్తిగా నిలిచిపోయింది. పది రోజులు దాటినా 20 ట్రాక్టర్లు కూడా రవాణా చేయకపోవడం గమనార్హం. పనులు లేక వేలాదిమంది కార్మికులు ఖాళీగా ఉన్నారు, పరిశ్రమలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వేలాదిమంది కార్మికులు వారి కుటుంబాలు ఎన్నో ఏళ్ల నుంచి ఈ పరిశ్రమలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నవారు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. గనుల్లో వెలికి తీసిన నాపరాళ్లు ఎగుమతి లేక నిలిచిపోయాయి. ఇక పాలిష్ ఫ్యాక్టరీలకు నాపరాళ్లు చేరకపోవడంతో కార్మికుల ఉపాధిపై ప్రభావం పడింది. వందలాదిమంది కార్మికులు రోజువారిగా లోడింగ్ అన్లోడింగ్ పనులు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారు. యజమానులు అప్పులు చేసి గనుల తవ్వకాలు చేస్తున్నారు. ట్రాక్టర్లు ప్రైవేటు ఫైనాన్స్‌లో రుణాలు తెచ్చుకొని వాయిదాల రూపంలో నెల నెల చెల్లించాల్సి ఉండగా ప్రస్తుతం రవాణాకు ఆటంకం కలగడంతో వచ్చే నెల వాయిదాలు ఎలా కట్టాలో ట్రాక్టర్ల యజమానులు ఆందోళన చెందుతున్నారు.



పేపర్‌బాయ్ టు ఎడిటర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ జి రాధారాణి, మాఢభూషి శ్రీధర్, కె శ్రీనివాసరెడ్డి, అల్లం నారాయణ, తెలకపల్లి రవి, పాశం యాదగిరి, పుస్తక రచయిత వినయకుమార్

వినయ్‌కుమార్ అందరికీ ఆదర్శనీయం

- కుటుంబ బాధ్యత, సామాజిక స్పృహతో మెలిగిన వ్యక్తి
- పేపర్ బాయ్ టు ఎడిటర్ పుస్తకావిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

సామాన్య కుటుంబంలో పుట్టిన ఎస్ వినయకుమార్ అసామాన్యుడిగా ఎదిగారని పలువురు వక్తలు కొనియాడారు. 'ప్రజాశక్తి' పేపర్‌బాయ్ నుంచి అదే పత్రికకు ఎడిటర్ స్థాయి వరకు ఎదిగిన తీరు అందరికీ ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. వివాద రహితుడిగా సమాజంలో ఆయన గుర్తింపు పొందారని, ఎంతో లౌక్యంగా వ్యవహరిస్తారని అన్నారు. వినయకుమార్ వ్యక్తిత్వం, పాటించిన విలువలు, నిబద్ధత, క్రమశిక్షణ అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. కుటుంబం పట్ల బాధ్యత, సామాజిక స్పృహతో ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటారన్నారు. 'పేపర్‌బాయ్ టు ఎడిటర్' పుస్తకాన్ని అందరూ చదవాలని, దీనివల్ల ఎన్నో విషయాలపై అవగాహన కలుగుతుందని పేర్కొన్నారు. 'పేపర్‌బాయ్ టు ఎడిటర్' పేరుతో ఆత్మకథ పుస్తకాన్ని ప్రజాశక్తి మాజీ సంపాదకులు, సీనియర్ జర్నలిస్ట్ ఎస్ వినయకుమార్ రాశారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ పుస్తకాన్ని హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ జి రాధారాణి ఆవిష్కరించారు. మహేంద్ర విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ లా మాఢభూషి శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాసరెడ్డి, నమస్తే తెలంగాణ మాజీ సంపాదకులు అల్లం నారాయణ, ప్రజాశక్తి మాజీ సంపాదకులు తెలకపల్లి రవి, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, వినయకుమార్ సతీమణి కె సుజావతి తదితరులు ప్రసంగించారు. సమన్వయకర్తగా కంబాలపల్లి కృష్ణ వ్యవహరించారు. వేదికపైకి వక్తలను మద్దాలి ఉజ్వల ఆహ్వానించారు. సదుర్ల సందీప్‌కుమార్ వందన సమర్పణ చేశారు.

నిజ జీవితాల గురించి తెలుసుకున్నా : జస్టిస్ రాధారాణి

ఈ పుస్తకం చదివి నిజ జీవితాల గురించి తెలుసుకున్నానని హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ జి రాధారాణి అన్నారు. కుటుంబ విలువల గురించి ఎన్నో విషయాలు అర్థమయ్యాయని తెలిపారు. చిన్న కుటుంబం నుంచి ఎడిటర్ స్థాయి వరకు, సామాన్యుడిగా జీవితం ప్రారంభించి అసామాన్యుడిగా ఎదిగిన తీరు ఎంతోమందిని ప్రభావితం చేస్తుందన్నారు.

ఈ పుస్తకం కథ కాదు వాస్తవం : మాఢభూషి శ్రీధర్

వినయకుమార్ రాసిన పుస్తకం కథ కాదని, వాస్తవమని మాఢభూషి శ్రీధర్ అన్నారు. జీవితంలో చూసిన, తెలుసుకున్న అనేక విషయాలను ప్రస్తావించారని గుర్తు చేశారు. జర్నలిజం గతంలో ఎలా ఉండేదో, ఇప్పుడు ఎలా ఉందో అందరికీ ఉపయోగపడేలా రాశారని వివరించారు. ఆయన రచన, రాసిన పద్ధతి అందరికీ అర్థమయ్యేలా ఉందన్నారు.

వినయ్ జీవితం ఆదర్శం : కె శ్రీనివాసరెడ్డి

వినయకుమార్ జీవితం ఆదర్శమని మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాసరెడ్డి అన్నారు. కష్టాలు, బాధలు అనుభవించిన వ్యక్తులు ఈ స్థాయికి ఎదగడం అరుదని పేర్కొన్నారు. ప్రస్తుతం జర్నలిజం పరిస్థితులు ఆందోళనకరంగా మారాయన్నారు. ప్రశ్నించే స్థాయికి పాఠకులు ఎదిగారని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా మీడియా ఉండాలని సూచించారు.

విలువలతో ఎదిగిన వినయ్ : అల్లం నారాయణ

వినయకుమార్ విలువలతో ఎదిగారని నమస్తే తెలంగాణ మాజీ సంపాదకులు అల్లం నారాయణ అన్నారు. నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. తెలంగాణలో కమ్యూనిస్టుల ప్రభావం ఎంతో ఉందని తెలిపారు. ప్రజాశక్తి పేపర్‌బాయ్ నుంచి అదే పత్రికకు ఎడిటర్‌గా ఎదగడానికి ఆయన తల్లిదండ్రులు, సొంత శ్రమ కారణమని అన్నారు.

వినయకుమార్ విప్లవకుమార్ : తెలకపల్లి రవి

వినయకుమార్ విప్లవ కుమార్, విలేకరి కుమార్, విజ్ఞాన కుమార్ అని ప్రజాశక్తి మాజీ సంపాదకులు తెలకపల్లి రవి పేర్కొన్నారు. కానీ, వివాద కుమార్ కాదన్నారు. వామపక్ష జర్నలిజమే ప్రధాన స్రవంతి జర్నలిజమని, వామపక్ష పత్రికలే లేకుంటే సామాన్యుల సమస్యలు, ఇబ్బందులు వెలుగులోకి వచ్చేవా? అని అన్నారు. వినయకుమార్ చతుర్భాష సంపన్నుడని తెలిపారు.

వినయ్ ఫ్యామిలీ మ్యాన్ : పాశం యాదగిరి

వినయకుమార్ ఫ్యామిలీ మ్యాన్ అని సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి అన్నారు. ఆయనకు వ్యక్తిగత నిజాయితీ, రాజకీయ నిజాయితీ ఉందన్నారు. ఏ తప్పు కూడా చేయలేదని వివరించారు. వినయకుమార్ వెంటనే సుజావతి ఉండడం వల్లే ఇది సాధ్యమైందన్నారు.

మా నాన్న వల్లే సాహిత్యంపై అభిరుచి : వినయకుమార్

మా నాన్న వల్లే నాకు సాహిత్యం పట్ల అభిరుచి కలిగిందని ప్రజాశక్తి మాజీ సంపాదకులు ఎస్ వినయకుమార్ అన్నారు. కమ్యూనిస్టు పార్టీ ప్రభావం తనపై అపారంగా ఉందని వివరించారు. ఈనాడు శిక్షణతో తేలిక పదాలను వాడాలని నేర్చుకున్నానన్నారు. సామాజిక దృష్టితో ప్రతి పదాన్నీ రాయాలని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి నిజంగానే గంగా జమునా తెహజీబ్ అని తెలిపారు. ప్రజాశక్తి జర్నలిజం స్కూల్ అన్ని మీడియా సంస్థల్లో పాత్రికేయుల కొరతను తీర్చిందన్నారు. వినయకుమార్ సతీమణి కె సుజావతి మాట్లాడుతూ వినయకుమార్‌లో ఎంతో నిబద్ధత ఉందన్నారు. ఆయనకు ప్రజాశక్తి సంస్థ ఇచ్చిన వాహనాన్ని కార్యాలయ అవసరాలకు తప్ప, కుటుంబ సభ్యుల కోసం వినియోగించే వారు కాదని గుర్తు చేశారు.

ఉపాధ్యాయులపై వేధింపులు!

- లేటు ముఖహాజరు నమోదైందంటూ టీచర్లకు నోటీసులు
- 24 గంటల్లో సంజాయిషీ ఇవ్వాలని డిఇఒ హుకుం
- ఎక్కడాలేని సంప్రదాయం మన్యం జిల్లాలో
- సాంకేతిక కారణాల వల్లేనన్న గురువులు
- భగ్గుమంటున్న ఉపాధ్యాయ సంఘాలు

ప్రజాశక్తి- పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లాలోని వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు జిల్లా విద్యా శాఖ నోటీసులు జారీ చేసింది. ఉపాధ్యాయులు ఉదయం 9.30 గంటల్లోగా ముఖ హాజరు (ఎఫ్ఆర్ఎస్) వేయాల్సి ఉంటుంది. అయితే, ఇంటర్నెట్ సిగ్నల్స్ సరిగ్గా లేకపోవడం వల్లనో, సర్వర్ బిజీగా ఉండడం వల్లనో కొంతమంది ఉపాధ్యాయుల హాజరు ఉదయం 9.30 తర్వాత నమోదైంది. వీరికి జిల్లా విద్యాశాఖాధికారి నోటీసులు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 700 మందికి అధికారులు నోటీసులు అందజేశారు. ముఖ హాజరు వెంటనే నమోదు కావాలంటే ఆ పాఠశాల పరిసర ప్రాంతాల్లో ఇంటర్నెట్ సిగ్నల్స్ సరిగ్గా ఉండాలి. సాంకేతిక కారణాల రీత్యా ముఖహాజరు ఆలస్యంగా నమోదైంది. ఉపాధ్యాయులు ఉద్దేశపూర్వకంగా ముఖహాజరు నమోదు చేస్తే దాన్ని తప్పుగా అధికారులు భావించాల్సి ఉంటుంది. అంతేకానీ, సాంకేతిక కారణాల వల్ల ముఖహాజరు నమోదు ఆలస్యమైతే ఉపాధ్యాయులకు నోటీసులు జారీ చేయడం వివాదాస్పదమవుతోంది. మండల విద్యాశాఖాధికారి, హెచ్‌ఎంల ద్వారా ఉపాధ్యాయులకు డిఇఒ నోటీసులు అందజేశారు. మారుమూల ప్రాంతాల్లో సరైన ఇంటర్నెట్ సిగ్నల్స్ లేకపోవడంతో ఉపాధ్యాయుల ముఖహాజరు నమోదులో జాప్యం జరుగుతున్నదనే వాస్తవాన్ని అధికారులు గుర్తించకుండా నోటీసులిచ్చి సంజాయిషీ కోరడంపై ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమంటున్నాయి. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఈ జిల్లాలో ఉపాధ్యాయులకు నోటీసులు జారీ చేయడాన్ని తప్పుపడుతున్నాయి. మొంథా తుపాను కారణంగా రాష్ట్ర ప్రభుత్వం గత మూడు రోజులుగా పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. ఉపాధ్యాయులు సెలవుల్లో ఉన్న సమయంలో ఆదరాబాదరాగా నోటీసులు జారీ చేయడం వెనుక ఆంతర్యమేమిటనే చర్చ జరుగుతోంది. గత కొంతకాలంగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో షాడో అధికారి పాలన నడుస్తోంది. జిల్లా ఏర్పడిన నాటినుంచి ఆయన హవా సాగుతోంది. గడచిన మూడున్నరేళ్లలో పని చేసిన ఇన్‌ఛార్జి డిఇఒలలో ఇప్పుడున్న అధికారి షాడో అధికారి చేతిలో కీలుబొమ్మలా మారారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో తాజాగా ఉపాధ్యాయులకు నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశమైంది. సెలవుల్లో ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేస్తోంది.

సాంకేతిక సమస్యలు పరిష్కరించండి

ఉపాధ్యాయుల ముఖ ఆధారిత హాజరు ఆలస్యంగా నమోదు చేస్తున్నారని, దానిపై సంజాయిషీ ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారి నోటీసులు జారీ చేయడం సరికాదు. తుపాను కారణంగా పాఠశాలకు సెలవులు ఇచ్చే సమయంలో సంజాయిషీ ఇవ్వాలని ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేయడం అన్యాయం. అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల ముఖఆధారిత హాజరు నమోదుకు సాంకేతిక సమస్యలు రాకుండా తగిన ఏర్పాట్లు చేయాలి. తక్షణమే ఆ ఉత్తర్వులను విరమించుకోవాలి.

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు

విద్యుదాఘాతంతో రైతు మృతి

యల్లనూరు : యల్లనూరు మండల పరిధిలోని తిమ్మంపల్లి గ్రామానికి చెందిన రైతు పత్తికొండ పెద్దన్న (72) బుధవారం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దన్న తనపొలంలో సాగు చేసిన వరి పైరుకు నీళ్ల పెట్టేందుకు భార్యతో కలిసి ఉదయం పొలానికి వెళ్లారు. ఈనేపథ్యంలో మోటారు వైరును తగిలించే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య చంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు.

ప్రభుత్వ బడిలో 'ప్రయివేట్' పార్కింగ్..!

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక పెద్ద ఆంజనేయస్వామి ఆలయం పక్కన ప్రభుత్వ పాఠశాల ఉంది. అందులో సుమారు 75 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాల ఆవరణలోనే అంగన్వాడీ కేంద్రం కూడా నిర్వహిస్తున్నారు. అయితే మండలంలోని వివిధ గ్రామాల నుంచి రొద్దంకు వచ్చే వ్యక్తులు, కియా పరిశ్రమ ఉద్యోగులు ప్రతి రోజూ వారి ద్విచక్ర వాహనాలను పాఠశాల ప్రాంగణంలో అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసి వెళుతున్నారు. దీంతో విరామ సమయంలో విద్యార్థులు ఆడుకోవాలంటే వాహనాలు అడ్డుగా ఉన్నాయి. దీనికి తోడు వారు ఎప్పుడుపడితే అప్పుడు రావడం బైక్ పెట్టడం, తీసుకెళ్లడంతో తరగతుల నిర్వహణ సమయంలో ఉపాధ్యాయలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయవద్దని పలుమార్లు సూచించినా వాహనదారులు ఏమాత్రం ఖాతరు చేయడం లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఇకనైనా విద్యాశాఖ, పోలీసు శాఖ అధికారులు స్పందించి ప్రయివేటు వ్యక్తులు పాఠశాల ఆవరణలో బైక్‌లు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- ఆభరణాలు, కారు, బైక్, ఫోన్లు స్వాధీనం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి సబ్ డివిజన్ పరిధిలో పలు కేసుల్లో నిందితులుగా ఉన్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను కొత్తచెరువు పోలీసులు అరెస్టు చేశారు. సిఐ మారుతి శంకర్‌తో కలిసి డిఎస్‌పి విజయ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ.. బుక్కపట్నం, కొత్తచెరువు, పుట్టపర్తి పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన చోరీ కేసులపై పోలీసులు విచారణ చేపట్టారన్నారు. ఈ క్రమంలో ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ సమీపంలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒక బాల నేరస్తుడిని గుర్తించారు. వారి నుంచి 10 తులాల బంగారం, 1250 గ్రాముల వెండి, కారు, బైక్, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై రాష్ట్ర వ్యాప్తంగా 11 కేసులు ఉన్నట్లు తెలిపారు. నిందితులు ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం గంగవరం గ్రామానికి చెందిన వేణుగోపాల్‌రెడ్డి, ఆదెమ్మ, చిన్నం సాయిగా గుర్తించినట్లు తెలిపారు.

కల్తీ మద్యం తాగి 15 మందికి అస్వస్థత

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం చౌళూరు గ్రామంలో కల్తీ కల్లు తాగి 15 మంది అస్వస్థతకు గురైన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. అస్వస్థతకు గురైన వారిని బంధువులు పట్టణంలోని ఓ ప్రవేటు అసుపత్రికి తరలించారు. వారిలో 60 సంవత్సరాల పైబడి ఉన్న లక్ష్మీదేవమ్మ, సంజీవరాయప్పల పరిస్థితి విషమంగా ఉండడంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. కల్తీకల్లు వల్లే వారికి అస్వస్థత కలిగిందని ఆరోపించారు. ఈ విషయంపై వైద్యురాలు శ్రీ దేవి మాట్లాడుతూ.. ప్రతి రోజు కల్లు తాగుతూ ఒక్కసారిగ మానేయడంతో అస్వస్థతకు గురయ్యారని తెలిపారు.

మైనింగ్ సరిహద్దుల ఏర్పాటుకు సర్వే

ప్రజాశక్తి - డి .హీరేహాల్

అనంతపురం జిల్లా డి.హీరేహాల్ మండలంలోని ఓబులాపురం గ్రామ పరిధిలో ఉన్న ఇనుపగనుల్లో లీజు సరిహద్దులు ఏర్పాటుకు సర్వే నిర్వహిస్తున్నట్లు మైన్స్ అండ్ జియాలజీ జెడి శ్రీనివాసరావు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రిటైర్డ్ సుప్రీం కోర్టు జడ్జి ఛైర్మన్‌గా ఒక కమిటీని ఏర్పాటు చేశారన్నారు. ఈ కమిటీ సెంట్రల్ సర్వే ఆఫ్ ల్యాండ్ అండ్ రికార్డ్స్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఎంఒయుఎఫ్ సభ్యులు, కేంద్ర సిఇసి సభ్యులు, మైన్స్ అండ్ జియాలజీ సభ్యులు, అటవీ శాఖ సభ్యులతో కలిసి గురువారం నుండి మైనింగ్ లీజుల సరిహద్దులు సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కమిటీ గురువారం మైనింగ్ ప్రాంతానికి వస్తుండడంతో ఈ ప్రాంతాన్ని పరిశీలించడానికి వచ్చినట్లు జెడి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎడి శ్రీనివాస్ చౌదరి, అటవీశాఖ అధికారులు రామచంద్రారెడ్డి, దామోదర్, మండల సర్వేయర్ రవితేజ, రెవెన్యూ, అటవీ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీహార్‌లో ప్రభుత్వ వ్యతిరేకత

తగ్గుతున్న నితీష్ ప్రభావం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీస్తున్న కొద్దీ రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకత స్పష్టంగా వ్యక్తమవుతోంది. ముఖ్యమంత్రి నితీష్ ప్రభావం క్షీణిస్తుండడం కూడా కనిపిస్తోంది. బీహార్‌లో 2014-15లో తొమ్మిది నెలల విరామం తప్ప, గత 20 ఏళ్లగా బీహార్‌కు నితీష్ కుమార్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ప్రస్తుతం ఎన్‌డిఎ ఫ్రంట్‌లో భాగమైనప్పటికీ, రెండుసార్లు మహా కూటమి ప్రభుత్వంలో కూడా భాగస్వామిగా ఉన్నారు. నితీష్ కుమార్ ఇట్టే భాగస్వామ్య పక్షాలను మర్చేస్తారు. ఎన్‌డిఎలో సిఎంగా ఉండి సాయంత్రం రాజీనామా చేసి, ప్రతిపక్ష పార్టీలతో చేరి, మరుసటి రోజు ఉదయం మళ్లీ సిఎం అయిపోతారు. అలాగే ఆర్‌జెడి, కాంగ్రెస్ పార్టీలతో కలిసి ప్రభుత్వంలో సిఎంగా ఉండి సాయంత్రం రాజీనామా చేసి, మరుసటి రోజు ఉదయమే మళ్లీ ఎన్‌డిఎ తరపున సిఎం అయిపోతారు. అందుకే ఆయనను కప్పగెంతుల సిఎం అంటారు. 2005 అసెంబ్లీ ఎన్నికల్లో నితీష్ నాయకత్వంలో ఎన్‌డిఎ అధికారంలోకి వచ్చింది. 2010 ఎన్నికలలో కూడా ఎన్‌డిఎ విజయం సాధించింది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి నాయకత్వం వహించడానికి నరేంద్ర మోడీని ప్రకటించడాన్ని నిరసిస్తూ ఎన్‌డిఎ నుంచి బయటకు వచ్చిన నితీష్ కుమార్, ఆర్‌జెడి మద్దతుతో ముఖ్యమంత్రిగా కొనసాగారు. లోక్‌సభ ఎన్నికల్లో జెడియు ఘోర పరాజయానికి బాధ్యత వహిస్తూ, 2014 మేలో ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. మహాదళిత వర్గానికి చెందిన జితన్ రామ్ మాంఝీ ముఖ్యమంత్రి అయ్యారు. 2015 అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్‌జెడి, జెడియు, కాంగ్రెస్‌లతో కూడిన మహా కూటమి 178 సీట్లు గెలుచుకుని అధికారంలోకి వచ్చింది. ఆర్‌జెడి ఏకైక అతిపెద్ద పార్టీ అయినప్పటికీ, నితీష్ కుమార్ ముఖ్యమంత్రి అయ్యారు. ఆర్‌జెడితో తెగతెంపులు చేసుకున్న తరువాత నితీష్, 2017లో ఎన్‌డిఎ శిబిరంలోకి తిరిగి వచ్చి ముఖ్యమంత్రిగా కొనసాగారు. 2020 ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో ఎన్‌డిఎ మళ్లీ అధికారంలోకి వచ్చింది. అయితే, జెడియు పోటీ చేసిన 115 సీట్లలో 43 సీట్లకే పరిమితమైంది. ఇది నితీష్‌కు పెద్ద ఎదురుదెబ్బ. 74 సీట్లు గెలుచుకున్న బిజెపి, నితీష్‌ను ముఖ్యమంత్రిగా కొనసాగించడానికి అనుమతించింది. 2022లో బిజెపితో తెగతెంపులు చేసుకున్న నితీష్, మహా కూటమి మద్దతుతో మళ్ళీ ముఖ్యమంత్రి అయ్యారు. ఆర్‌జెడికి చెందిన తేజస్వి యాదవ్ ఉప ముఖ్యమంత్రి అయ్యారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు బిజెపికి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీల దేశవ్యాప్తంగా కూటమిని ఏర్పాటు చేయడానికి నితీష్ చొరవ తీసుకున్నారు. జాతీయ స్థాయిలో ఇండియా బ్లాక్ ఏర్పడినప్పటికీ, నితీష్ మరోసారి నాటకీయంగా తన మార్గాన్ని మార్చుకున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీహార్‌లో ఇండియా బ్లాక్‌కి నితీష్ 'మోసం' దెబ్బ తగిలింది.

ప్రస్తుత ఎన్నికల్లో 20 ఏళ్ల నిరంతరం పాలించిన నితీష్ కుమార్ పతనం లేదా కొనసాగింపు ప్రశ్నను లేవనెత్తుతున్నాయి. బీహార్ ఇప్పటికీ దేశంలో అత్యంత వెనుకబడిన రాష్ట్రాలలో ఒకటిగా ఉంది. ఎన్నికలకు



ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని ప్రకటనలు చేసినప్పటికీ, బీహార్‌లో బలమైన ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోంది. బీహార్‌లో మైనారిటీ, వెనుకబడిన ఓట్లను వీలైనంత వరకు తొలగించే లక్ష్యంతో హడావిడిగా నిర్వహించిన ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా మహాకూటమి పార్టీలు నిర్వహించిన 'ఓటు అధికార్' మార్చ్‌కు ప్రజాదరణ పొందిన ఆదరణ, ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రతను వెల్లడించింది. ఎన్నికల కమిషన్ తీవ్రమైన స్పందన కూడా ప్రభుత్వ వ్యతిరేక భావనగా మారింది.

ఎన్‌డిఎలో లుకలుకలు

ఎన్‌డిఎ కూటమిలో సీట్ల పంపకాలు మొదలైనప్పటి నుండి లుకలుకలు మొదలైయ్యాయి. అక్కడ జెడియు, ఎల్‌జెపి బహిరంగ వార్ నడుస్తోంది. ఒకరిపై ఒకరు విమర్శలు ఎక్కుపెట్టుకున్నారు. అలాగే జెడియు, బిజెపి మధ్య అంతర్గత వార్ నడుస్తోంది. మరో రెండు ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలైన హెచ్‌ఎఎం, ఆర్‌ఎల్ఎంలు సీట్ల పంపకాలలో తమకు న్యాయం జరగలేదని పేర్కొన్నాయి. అయినప్పటికీ తాము సీట్ల పంపకాలను అంగీకరిస్తున్నామని ఆయా పార్టీల నేతలు ప్రకటించారు. అయితే దీని ప్రభావం ఎన్నికల్లో చూపే అవకాశం ఉంది. మరోవైపు రెబల్స్, నేతల రాజీనామాలతో ఎన్‌డిఎ కూటమి సతమతమవుతుంది. ఎన్‌డిఎలో పార్టీలకు రెబల్స్ బెడద పెరిగింది. దీంతో డజన్ల కొద్దీ నేతలను జెడియు, బిజెపిలు సస్పెండ్ చేస్తున్నాయి.

బీహార్ ఎన్‌డిఎలో ఎప్పుడూ ఎక్కువ స్థానాలకు పోటీ చేసే జెడియు, బిజెపితో సమానమైన స్థానాలకే పరిమితం కావడం ఇదే తొలిసారి. బీహార్ రాజకీయాల్లో నితీష్ ప్రభావం తగ్గుముఖం పడుతుందనడానికి ఇది నిదర్శనంగా చూడవచ్చు. ఈసారి ఎన్‌డిఎలో సీట్ల పంపకాల్లో బిజెపి ఆధిపత్యం ప్రదర్శించింది. జన్ సూరజ్ పార్టీ, ఎంఐఎం ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చుతాయని బిజెపి, ఎన్‌డిఎ ఆశిస్తున్నాయి. అయితే, మహా కూటమి తన సమస్యలను పరిష్కరించుకుని ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించడంతో గట్టి పోటీకి వేదిక అయింది. అంతేకాకుండా ఎన్‌డిఎ కూటమికి ముఖ్యమంత్రి అభ్యర్థిపై సవాల్ విసురుతోంది. రాష్ట్రంలో నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఓట్ల లెక్కింపు నవంబర్ 14న జరుగుతుంది.

ఇసుక అక్రమ తవ్వకాలపై విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

2019-2024 మధ్య ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఇసుక అక్రమ మైనింగ్‌పై విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది. జెపి వెంచర్స్ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్‌కె కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఇసుక మైనింగ్ అక్రమాలపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో న్యాయవాది దండా నాగేంద్రకుమార్ పిటిషన్లు దాఖలు చేశారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడినందుకు జెపి వెంచర్స్‌పై రూ.10 కోట్లు మధ్యంతర జరిమానాను ఎన్‌జిటి చెన్నై బెంచ్ విధించింది. జరిమానాపై జెపి వెంచర్స్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. జరిమానాపై తొలుత స్టే ఇచ్చిన సుప్రీంకోర్టు, గత నెల విచారణలో స్టే ఎత్తివేసి జరిమానా జమ చేయాలని జెపి వెంచర్స్‌ను ఆదేశించింది. అయితే ఈ సుప్రీంకోర్టు ఉత్తర్వులపై స్పష్టత కోరుతూ మరో పిటిషన్‌ను జెపి వెంచర్స్ దాఖలు చేసింది. మరోవైపు అప్పటి అక్రమాలపై సవివరంగా క్షేత్రస్థాయిలో చేపట్టిన తాజా నివేదికను కోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం అందించింది. జెపి వెంచర్స్ దాఖలు చేసిన పిటిషన్ విచారించిన జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్‌కె కోటీశ్వర్‌సింగ్‌ల ధర్మాసనం, తదుపరి విచారణను వచ్చే నెల 19కి వాయిదా వేసింది.

రాఫేల్ యుద్ధ విమానంలో రాష్ట్రపతి ప్రయాణం



న్యూఢిల్లీ : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాఫెల్ యుద్ధ విమానంలో ప్రయాణించారు. హర్యానాలోని అంబాలా వైమానిక స్థావరం నుండి ఆమె రాఫెల్‌లో బుధవారం విహరించారు. వాయు సేన చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ ప్రత్యక్షంగా వీక్షించారు. ఏప్రిల్ 22 పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో రాఫెల్ జెట్‌లను వినియోగించారు. ఫ్రాన్స్ ఏరోస్పేస్ మేజర్ డసాల్ట్ ఏవియేషన్ తయారు చేసిన రాఫెల్ యుద్ధ విమానాలను 2020 సెప్టెంబర్‌లో అంబాలాలోని వైమానిక దళ స్టేషన్‌లో అధికారికంగా భారతవైమానికదళంలోకి ప్రవేశపెట్టారు. మాజీ రాష్ట్రపతులు ఎపిజె.అబ్దుల్ కలాం మరియు ప్రతిభా పాటిల్‌లు సుఖోయ్-30 యుద్ధ విమానంలో ప్రయాణించారు. 2023 ఏప్రిల్ 8న భారత సాయుధ దళాల కమాండర్ ముర్ము, అస్సాంలోని తేజ్‌పూర్ వైమానిక దళ స్టేషన్‌లో సుఖోయ్-30 ఎంకెఐ యుద్ధ విమానంలో ప్రయాణించిన మూడవ రాష్ట్రపతి మరియు రెండవ మహిళా దేశాధినేత అయ్యారు.

'సర్'పై తమిళనాడు సిఎం మండిపాటు

- నవంబర్ 2న అఖిలపక్ష సమావేశానికి పిలుపు

చెన్నై : ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ (సర్) ద్వారా లక్షలాది ఓటర్లను తొలగించాలని బిజెపి కుట్ర పన్నుతోందని తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె అధ్యక్షులు ఎంకె స్టాలిన్ విమర్శించారు. దీనిపై తదుపరి కార్యాచరణను నిర్ణయించేందుకు నవంబర్ 2న అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తామని ప్రకటించారు. మామల్లపురంలో జరిగిన పార్టీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ కార్మికులు, ఎస్సీలు, మైనారిటీలు, మహిళలను లక్ష్యంగా చేసుకొని వారి ఓట్లను తొలగించడం ద్వారా ఎన్నికల్లో విజయం సాధించాలని బిజెపి, అన్నా డీఎంకే ప్రయత్నిస్తున్నాయని ధ్వజమెత్తారు. 'ప్రజల వద్దకు వెళ్లే ధైర్యం వారికి లేదు. మన పక్షాన నిలబడే వారి ఓట్లను తొలగించాలని వారి ఆలోచన. అయితే ఇందుకు తమిళనాడు అనుమతించదు' అని అన్నారు. ఇలాంటి ప్రక్రియను చేపట్టి బీహార్‌లో ఎన్నికల కమిషన్ 65 లక్షల మంది ఓటర్ల హక్కులను నిరాకరించిందని ఆయన గుర్తు చేశారు. రాబోయే శాసనసభ ఎన్నికలను సాటి లేని సమర్థ పాలనను అందిస్తున్న డీఎంకేకు, ఢిల్లీ ముందు మోకరిల్లిన బానిసలకు మధ్య జరుగుతున్న పోరుగా స్టాలిన్ అభివర్ణించారు. తమిళనాడు ఆత్మ గౌరవాన్ని, వ్యక్తిత్వాన్ని కాపాడేందుకు పోరు జరగబోతోందని చెప్పారు. రాష్ట్ర సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక నిర్మాణం దాడిని ఎదుర్కోబోతోందని హెచ్చరించారు. హిందీ, సంస్కృతం, జీఎస్టీ, గవర్నర్ రూపంలో తమను ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. వారిని ఓడించే సత్తా తమకు మాత్రమే ఉన్నదని, ఆర్‌ఎస్ఎస్ కుట్రలు ఇక్కడ సాగవని చెప్పారు. డీఎంకే బలమేమిటో బీజేపీకి తెలుసునని, అందుకే తమను ఇబ్బంది పెట్టడానికి కొత్త దారులు వెతుకుతోందని అన్నారు. 'ఎన్నికల కమిషన్ సర్‌ను ప్రకటించి దానితో మనల్ని బెదిరించాలని ప్రయత్నిస్తోంది. కానీ మేము తలవంచే ప్రసక్తే లేదు. శాసనసభ ఎన్నికలు బీజేపీ-అన్నా డీఎంకే కూటమి నుంచి రాష్ట్రాన్ని కాపాడతాయి' అని స్టాలిన్ చెప్పారు.

దక్షిణకొరియాలో ట్రంప్‌నకు నిరసన సెగ

బుసాన్: దక్షిణ కొరియాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు నిరసన సెగ తగిలింది. ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార (ఎపిఇసి) శిఖరాగ్ర సమావేశానికి హాజరయ్యేందుకు బుధవారం ట్రంప్ దక్షిణ కొరియాకు చేరుకున్నారు. ట్రంప్ రాకకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. ట్రంప్ సుంకాల భారం వల్ల దీర్ఘకాల మిత్రదేశానికి అన్యాయం జరుగుతోందని నిరసనకారులు ఆగ్రహం వ్యక్తంచేశారు. నిరసనల్లో భాగంగా.. ప్రదర్శనకారులు నాటక ప్రదర్శన నిర్వహించారు. ఒక నిరసనకారుడు సూట్ , ప్రకాశవంతమైన ఎరుపు నెక్‌టై ధరించి తాడుతో కట్టుకున్నాడు. మరికొందరు రెడ్ కార్డ్‌లు ఊపుతూ అమెరికా అధ్యక్షుడి టారిఫ్ విధానాలను ఖండిస్తూ నినాదాలు చేశారు.ఎపిఇసి శిఖరాగ్ర సమావేశ ప్రధాన వేదికకు దాదాపు ఐదు కిలోమీటర్ల దూరంలోనే ఈ నిరసనలు కొనసాగాయి. బుధవారం ఉదయం 11:40 గంటల ప్రాంతంలో బుసాన్‌లోని గిమ్హే అంతర్జాతీయ విమానాశ్రయానికి ట్రంప్ చేరుకున్నారు . మధ్యాహ్నం అధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇదే సమయంలో దేశంలో అతిపెద్ద అంబ్రెల్లా కార్మిక సంస్థ అయిన కొరియన్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (కేసీటీయూ) జియోంగ్జు రైల్వే స్టేషన్ సమీపంలో నిరసన ప్రదర్శన నిర్వహించింది. యూనియన్ సభ్యులు , ప్రగతిశీల పౌర కార్యకర్తలు "ట్రంప్ గో బ్యాక్ !" వంటి నినాదాలు చేస్తూ వీధుల గుండా కవాతు చేశారు. కాగా, చైనా అధ్యక్షులు జిన్‌పింగ్‌తో ట్రంప్ భేటీ కానున్నారు. ఈ సమావేశంలో అనేక సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉందని బుధవారం ట్రంప్ వ్యాఖ్యానించారు.



ట్రంప్‌నకు షాక్

- బ్రెజిల్‌పై టారిఫ్‌లు రద్దు చేసే బిల్లుకు అమెరికా సెనేట్ ఆమోదం
- మద్దతిచ్చిన ఐదుగురు రిపబ్లికన్లు

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌నకు అమెరికా సెనేట్‌లో ఊహించని పరిణామం ఎదురైంది. బ్రెజిల్‌పై ట్రంప్ విధించిన టారిఫ్‌లను రద్దు చేసే బిల్లును సెనేట్ ఆమోదించింది. ఈ బిల్లుకు అధికార రిపబ్లికన్‌కు చెందిన ఐదుగురు సెనేటర్లు కూడా మద్దతు ఇవ్వడం గమనార్హం. ట్రంప్ ఈ టారిఫ్‌లను ఈ ఏడాది జులైలో విధించాడు. బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారోపై కుట్ర కేసు నమోదు చేయడాన్ని వ్యతిరేకిస్తూ, ప్రతిస్పందనగా ట్రంప్ ఈ చర్యలకు దిగాడు. బోల్సోనారోపై కేసును అమెరికాకు వ్యతిరేక చర్యగా ట్రంప్ భావించాడు.

కాగా తాజా బిల్లు సెనేట్‌లో 52-48 ఓట్లతో ఆమోదం పొందింది. ఈ బిల్లుకు ఐదుగురు రిపబ్లికన్ సెనేటర్లు మిచ్ మెక్‌కానెల్, లిసా ముర్కోవ్‌స్కీ, సుసన్ కొల్లిన్స్, ర్యాండ్ పాల్, థామ్ టిల్లిస్‌లు కూడా మద్దతు ఇవ్వడం విశేషం. అయితే ఈ బిల్లు రిపబ్లికన్ల ఆధీనంలో ఉన్న హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌కి వెళ్తుంది. అయితే ఈ బిల్లుకు అక్కడ బ్రేక్ పడే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి బ్రెజిల్‌పై ట్రంప్ విధించిన ఈటారిఫ్‌లు కొనసాగే అవకాశాలే అధికంగా ఉండొచ్చని పరిశీలకులు చెప్తున్నారు. అయితే ఈ సెనేట్ ఓటింగ్ ట్రంప్ విధానానికి వ్యతిరేకంగా సాగిందనీ, డెమోక్రాట్లతో పాటు ఆయన సొంత పార్టీ సభ్యులే బిల్లుకు అనుకూలంగా వేయడమే దీనికి నిదర్శనమని విశ్లేషకులు చెప్తున్నారు. ట్రంప్ ప్రస్తుతం మలేషియా, జపాన్, దక్షిణ కొరియా పర్యటనలో ఉన్నారు. అలాగే చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో వాణిజ్య చర్చలు జరపనున్నారు. ఇలాంటి తరుణంలోనే తాజా పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం.

నేపథ్యం

బ్రెజిల్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై ట్రంప్ ఈ ఏడాది జులైలో 50 శాతం సుంకాలు వేశాడు. అలాగే బ్రెజిల్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై కూడా ఆంక్షలు విధించాడు. బ్రెజిల్.. ఆ దేశ మాజీ అధ్యక్షుడు బోల్సోనారరోను రాజకీయం వేధిస్తోందనీ, అది అమెరికా భద్రత, ఆర్థిక వ్యవస్థకు ప్రమాదమని ట్రంప్ వాదన. కానీ అమెరికాలోని ట్రంప్ రాజకీయ ప్రత్యర్థి వర్గం డెమోక్రాట్లు.. ఆయన చర్యలను తప్పుబడుతున్నారు. నకిలీ అత్యవసర పరిస్థితులు చూపిస్తూ ట్రంప్ టారిఫ్‌లు విధిస్తున్నారనీ, ఇలాంటి చర్యలతో అమెరికా ప్రజలకు వస్తువులు మరింత ఖరీదవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రెజిల్ మాజీ అధ్యక్షుడైన బోల్సోనారోపై ప్రజాస్వామ్యాన్ని కూల్చివేయడానికి ప్రయత్నించినట్టు, సాయుధ నేరంలో పాల్గొన్న ఆరోపణలున్నాయి.

భారత్‌తో త్వరలో వాణిజ్య ఒప్పందం..

- ఇండియా, పాక్ యుద్ధాన్ని ఆపానని ట్రంప్ పునరుద్ఘాటన

సియోల్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌తో త్వరలో వాణిజ్య ఒప్పందం ఉంటుందని ప్రకటించారు. ఆసియా, పసిఫిక్ ఆర్థిక సహకార సంస్థ కార్యక్రమంలో పాల్గోటానికి దక్షిణ కొరియా చేరుకున్న ట్రంప్ జియోంగ్జులో బుధవారం వివిధ కంపెనీల సిఇఒలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ భారత్‌తో త్వరలో వాణిజ్య ఒప్పందం ఉంటుందన్నారు.అయితే టారిఫ్‌లపై స్పష్టత ఇవ్వలేదు..మరోవైపు భారత ప్రధాని మోడీ మంచి స్నేహితుడని, మా ఇద్దరి మధ్య గొప్ప సంభందం ఉందంటూనే అతడు చాలా అందంగా కనిపించే వ్యక్తి, కానీ చాలా కఠినాత్ముడు, హంతకుడు అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.. అదే సమయంలో పాక్ ప్రధాని షరీఫ్ గొప్ప పోరాటయోధుడంటూ ప్రశంసించడం విశేషం. అలాగే భారత్, పాక్ మధ్య జరిగిన దాడులగురించి మరోసారి ప్రస్తావించారు. రెండు అణుదేశాల మధ్య యుద్ధాన్ని నేనే ఆపానని పునరుద్ఘాటియచారు. ఆ సమయంలో మోడీకి ఫోన్ చేసి దాడులు ఆపకపోతే మీతో వాణిజ్య ఒప్పందం చేసుకోనని చెప్పానన్నారు. అదే విషయాన్ని షరీఫ్‌కు చెప్పి ఇరు దేశాల మధ్య యుద్ధాన్ని జరగకుండా చేశానని ఇలా బైడెన్ చేయగలరా అంటూ ఆపరేషన్ సింధూర్ సమయంలో జరిగిన విషయాలను గుర్తుచేసుకున్నారు.. అయితే భారత్ అటువంటిది ఏదీ లేదని. అమెరికా మధ్యవర్తిత్వాన్ని ఖండించిన విషయం తెలిసిందే...ట్రంప్ తాజా వ్యాఖ్యలపై భారత విదేశాంగ శాఖ స్పందించలేదు.

ఫ్రీట్రేడ్ ఒప్పందానికి భారత్ అంగీకరించనుందా...?

రష్యా చమురును కొనుగోలు ఆపేయాలని అమెరికా ఒత్తిడి చేస్తున్నా భారత్ దిగుమతులను కొనసాగించింది. అయితే గత వారం భారత్ చమురును రష్యానుండి కొనుగోలు ఆపేయనుందని వైట్‌హౌస్ ప్రతినిధులు ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే భారత్ సంస్థలు రష్యా చమురు దిగుమతులను నిలిపేసాయి. మరోవైపు ట్రంప్ తాజా ప్రకటనతో అమెరికాతో వాణిజ్య ఒప్పందంలలో భాగంగా వ్యవసాయ దిగుమతులకు రంగం సిద్ధమైదనే సంకేతాలు బలపడుతున్నాయి. భారత వ్యవసాయ రంగం మార్కెట్‌లో అమెరికా ఉత్పత్తులు ప్రవేశిస్తే మెక్కజొన్న, విత్తనాలు, సోయాబిన్, పాలు వంటి పాడి దిగుమతులు భారీగా పెరిగిపోతాయి. దీంతోపాటు ఇథనాల్ పరిశ్రమలపై కుడా గణనీయమైన ప్రభావం పడనుంది. అయితే భారత్ యొక్క ప్రదాన శ్రతువు ఇతర దేశాలపై ఆధారపడటమేనని ఇటీవల ప్రధాని మోడీ ప్రకటించిన కొద్ది రోజుల్లోనూ అమెరికాతో ఒప్పదానికి సిద్ధపడటం గమనార్హం. ఈ ఒప్పందంతో కోట్లాది చిన్న రైతులు మరింత నష్టపోతారని వ్యవసాయ రంగ నిపుణులు భావిస్తున్నారు.

ప్రజా సంక్షేమమే పరమావధిగా కేరళ ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి చేసిన వారు, వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేస్తున్నవారు, పోటీ పరీక్షలకు సిద్ధ పడుతున్న అభ్యర్థులకు కూడా ఈ సాయం అందిస్తారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు నవంబర్ నుంచి 4 శాతం డిఎను పెంచారు. 13,327 మంది ఆహార సేవా కార్మికుల రోజువారీ వేతనాన్ని రూ 50 పెంచారు. రబ్బరు మద్దతు ధరను కిలోకు రూ 180 నుంచి రూ 200కు పెంచారు.కోవిడ్ కారణంగా ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తూ ప్రారంభించిన ఆహార పంపిణీని కొనసాగించింది. కేంద్ర ప్రభుత్వం నుండి ఆర్థిక సహాకారం అందకపోయినా ఒడిదుడుకులను తట్టుకుంటూ కేరళ ప్రభుత్వం సంక్షేమాన్ని కొనసాగిస్తుందని ఆర్థిక మంత్రి కె.బాలగోపాల్ తెలిపారు..

సిపిఎం ప్రధానకార్యదర్శి ఎంఎ బేబి అభినందనలు

కేరళ వామపక్ష ప్రభుత్వం సంక్షేమాన్ని పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి అభినందించారు.ప్రజా అనుకూల నిర్ణయం తీసుకోవడం ద్వారా సామాజిక సంక్షేమం పట్ల ప్రభుత్వం తన నిబద్ధతను తెలిపిందన్నారు. యువత, మహిళలు, పేద ప్రజల అభ్యున్నతకి దోహదపడుతుందని, భారతదేశంలో వామపక్ష ప్రత్యామ్నాయ స్ఫూర్తికి, ఓనత్యానికి నిదర్శనమని పేర్కొంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో బుదవారం పోస్ట్ చేశారు..

87 వేల హెక్టార్లలో పంట నష్టం

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి స్థాయి వివరాలు 5 రోజుల్లో సమర్పించాలని ఆదేశించారు. తుఫాను కారణంగా ఇప్పటి వరకూ రాష్ట్రంలో ముగ్గురు మృతి చెందారని, మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం అందించాలని అధికారులకు సూచించారు.

బాధిత కుటుంబాలకు 25 కేజీల బియ్యం

ప్రభావిత కుటుంబానికి 25 కేజీల బియ్యం (మత్స్యకారులకు 50 కేజీలు), కందిపప్పు కేజీ, పామాయిల్ ఒక లీటరు, ఉల్లిపాయలు కేజీ, బంగాళదుంపలు కేజీ, పంచదార కేజీను పౌరసరఫరాల శాఖ నుంచి అందజేయాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. పునరావాస కేంద్రాలకు తరలించిన బాధితుల కుటుంబాలకు రూ.3 వేలు చొప్పున ప్రత్యేక సాయాన్ని అందించాలని ప్రభుత్వం నిర్ణయిచింది. ఆయా కుటుంబాల్లో ఒక్కొక్కరికీ రూ.వెయ్యి చొప్పున, కుటుంబానికి రూ.3 వేలు మించకుండా సాయం అందించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశిస్తూ ఉత్తర్వుల్లో జారీ చేశారు.

గాజాలో కాల్పుల విరమణకు హామీ ఇవ్వండి : సిపిఎం పొలిట్‌బ్యూరో

న్యూఢిల్లీ : గాజాలో కాల్పుల విరమణకు హామీ ఇవ్వాలని, ఈ ఒప్పందాన్ని కుదర్చినట్లు ప్రగల్భాలకు పలుకుతున్న అమెరికాకు సిపిఎం పొలిట్‌బ్యూరో విజ్ఞప్తి చేసింది. గాజాపై ఇజ్రాయిల్ చేసిన తాజా దాడులను తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అమెరికా ప్రకటించిన, ఇజ్రాయిల్ ఆమోదించిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయిల్ పదే పదే ఉల్లంఘించడాన్ని పొలిట్ బ్యూరో ఈ ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. తాజా దాడి కాల్పుల విరమణ ఒప్పందం బలహీనతను, ఇజ్రాయిల్ దురాక్రమణను అరికట్టాల్సిన అవసరాన్ని మరోసారి వెల్లడించిందని తెలిపింది. కాల్పుల విరమణ ఒప్పందానికి గొప్పగా ప్రచారం చేస్తున్న అమెరికా, దాన్ని ఖచ్చితంగా అమలు చేయడానికి హామీ ఇవ్వాలని తెలిపింది. ఇజ్రాయిల్ దురాక్రమణ, విస్తరణ విధానాలను అరికట్టడం ద్వారా మాత్రమే దీనిని సాధించుకోవచ్చునని, అంతర్జాతీయ సమాజం కూడా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తీసుకునిరావాలని విజ్ఞప్తి చేసింది. అలాగే పాలస్తీనా దేశాన్ని గుర్తించడం ద్వారాను, అమెరికా, దాని మిత్రదేశాల నుండి ఇజ్రాయిల్‌కు సైనిక, రాజకీయ మద్దతును నిలిపివేయడం ద్వారానే గాజాలో శాశ్వత శాంతి సాధ్యమని పొలిట్‌బ్యూరో పునరుద్ఘాటించింది.

అణగారిన ప్రజలు ఓటుహక్కు కోల్పోతారు

- ఎస్ఐఆర్ విస్తరణపై సిపిఎం ఆందోళన

న్యూఢిల్లీ : ఎన్నికల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఆఆర్)ను పన్నెండు రాష్ట్రాలకు విస్తరించాలని కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) తీసుకున్న నిర్ణయాన్ని సిపిఎం పొలిట్ బ్యూరో తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఈ ప్రక్రియతో బీహార్‌లో జరిగినట్లుగానే సమాజంలోని బలహీన వర్గాలకు చెందిన ప్రజలు భారీగా ఓటు హక్కును కోల్పోతారని విమర్శించింది. పౌరసత్వాన్ని నిర్ణయించడంలో ఎన్నికల సంఘం అధికార పరిధిపై విచారణ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నప్పటికీ, ఇసిఐ ఈ ప్రక్రియను కొనసాగిస్తుండటం చాలా ఆందోళనకరమని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఓటర్ల నమోదుకు పౌరసత్వం ఒక ముందస్తు అవసరం అయినప్పటికీ, దానిపై నిర్ణయం ఎన్నికల సంఘం పరిధిలోకి రాదని రాజ్యాంగం స్పష్టంగా పేర్కొందని పొలిట్‌బ్యూరో గుర్తు చేసింది. 'బీహార్ అనుభవం నుండి నేర్చుకోవడానికి ఎన్నికల సంఘం నిరాకరిస్తుంది. నమోదు ఫారమ్‌లతో పాటు రుజువుగా అవసరమైన పదకొండు పత్రాలను సమర్పించాల్సిన అవసరం లేదని ఇసి అంగీకరించవలసి వచ్చింది. సుప్రీంకోర్టు జోక్యం తర్వాత మాత్రమే ఆధార్ కూడా నివాస రుజువుగా మాత్రమే పరిగణించబడింది. పేదలు, బలహీన వర్గాల వద్ద సాధారణంగా లేని పత్రాలపై పట్టుదల వీరి ఓటు హక్కును అసమానంగా కోల్పోతుంది' అని పొలిట్‌బ్యూరో తన ప్రకటనలో తెలిపింది. ఓటర్ల నమోదు భారాన్ని ఓటర్లపైనే మోపడాన్ని సిపిఎం వ్యతిరేకిస్తున్నట్లు పొలిట్‌బ్యూరో పునరుద్ఘాటించింది. ఓటర్ల నమోదు బాధ్యత ఇసిదేనని పొలిట్‌బ్యూరో స్పష్టం చేసింది. అలాగే, ఓటర్ల జాబితా తప్పులు లేకుండా, సవరణ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని సిపిఎం ధృఢంగా విశ్వసిస్తుందని, కానీ బిజెపి విభజన హిందూత్వ ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి పౌరసత్వాన్ని నిర్ణయించడానికి ఇసిని ఒక సాధనంగా ఉపయోగించలేమని పొలిట్‌బ్యూరో స్పష్టం చేసింది.

జిల్లాల పునర్విభజనపై ప్రజాభిప్రాయం సేకరించాక నిర్ణయం

- వారంలో మళ్లీ ఉపసంఘం సమావేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జిల్లాల పునర్విభజనపై రెండోరోజు సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం వారం రోజుల్లో మరోసారి చర్చించి సిఎం సూచనలపై తుది నిర్ణయానికి రావాలని నిర్ణయించారు. మంత్రివర్గ ఉపసంఘ సభ్యులు అనగాని సత్యప్రసాదు, పి.నారాయణ, ఎన్.మనోహర్, సత్యకుమార్‌యాదవ్, నిమ్మల రామానాయుడు బుధవారం సమావేశమయ్యారు. మంగళవారం నాటి సమావేశంలో సిఎం చేసిన పలు సూచనలపై సుదీర్ఘంగా చర్చించారు. చింతూరు, రంపచోడవరం డివిజన్లలను తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని, ప్రస్తుతం పోలవరం నియోజకవర్గం పరిధిలోకి వెళ్లిన పునరావాసులతోపాటు ప్రజల నుండి అభిప్రాయ సేకరణ అనంతరం వారిని ఏ జిల్లాలో ఉంచాలనే అంశంపై తుది నిర్ణయం తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. జిల్లాల పునర్విభజనపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ప్రాథమిక నివేదికను మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సమర్పించిన సంగతి తెలిసిందే. వాటిల్లో మార్కాపురం, మదనపల్లె కొత్త నియోజకవర్గాలతోపాటు పలు డివిజన్లకు సంబంధించి వారి భౌగోళిక స్వరూపం నేపథ్యంలో కొన్నిటిని జిల్లాలు మార్చాలని ప్రతిపాదించారు. అయితే అల్లూరి సీతారామరాజు జిల్లాలో రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్లను తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని ప్రతిపాదించారు. దీనిపై సిఎం పలు సూచనలు చేశారు. ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలకు పోలవరం నియోజకవర్గం పరిధిలో పునరావాసం కల్పించామని, వారి అభిప్రాయం తీసుకుని అవసరమైతే వారిని కూడా తూర్పుగోదావరిలో కలిపే అంశాన్ని పరిశీలించాలని నిర్ణయించారు. పోలవరం ప్రాజెక్టు రెండు జిల్లాల పరిధిలో ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం ద్వారా ఒక జిల్లాకు పరిమితం చేయాలనే ఆలోచన కూడా ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజల అభిప్రాయం తీసుకోవాలని సూచించారు. వీటిపై బుధవారం మరోసారి సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం ఇదే అంశంపై చర్చించింది. గుంటూరు జిల్లాలోని చుండూరును బాపట్లలో విజయవాడలో కలిసిపోయిన గన్నవరం, పెనుమలూరు నియోజకవర్గాలను కృష్ణాజిల్లాలో కలపడంపట్ల ఈ సమావేశంలో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అలాగే బాపట్ల జిల్లాలో ఉన్న అద్దంకి, నెల్లూరు జిల్లాలో ఉన్న కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపాలని మంత్రులు ప్రతిపాదించారు. బుధవారం సమావేశంలోనూ ఇదే అంశాన్ని పునరుద్ఘాటించారు. గూడూరు రెవెన్యూ డివిజన్‌ను నెల్లూరులో కలపాలని ప్రతిపాదించారు.

నియోజకవర్గం అంతా ఒకే డివిజన్లో ఉండాలి : సత్యప్రసాద్

గతంలో ఒక నియోజకవర్గంలోని మండలం పరిధిలో ఉన్న గ్రామం మరొక నియోజకవర్గంలోకి వెళ్లిందని, దీనివల్ల అభివృద్ధికి ఇబ్బందులు ఏర్పడ్డాయని భవిష్యత్‌లో అలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని నిర్ణయించినట్లు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంత్రివర్గ ఉపసంఘం అనంతరం బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో అశాస్త్రీయంగా జరిగిన విభజన వల్ల తలెత్తిన ఇబ్బందులపై చర్చించి సరిదిద్దాలని నిర్ణయించామని తెలిపారు. విభజన హామీలకు అనుగుణంగా జిల్లాల పునర్విభజనపై మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన నివేదికపై ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారని, వాటిపై చర్చించామని తెలిపారు. వచ్చేవారంలో మరోసారి సమావేశం అయిన తరువాత పూర్తిగా నివేదిక ఇస్తామని మంత్రి తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే జగనణనకు ముందే నివేదిక ఇస్తామని మరో మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

ఎపిపిసిబిని బలోపేతం చేయాలి

- ఉప ముఖ్యమంత్రికి ఇఎఎస్ శర్మ లేఖ

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

చట్టబద్ధమైన బాధ్యతలను నిర్వర్తించడంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఎపిపిసిబి) విఫలమవుతోందని, దీనిని స్వతంత్ర సంస్థగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని కోరుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఇఎఎస్.శర్మ లేఖ రాశారు. కాలుష్యాన్ని అరికట్టే ప్రాథమిక బాధ్యత ఎపిపిసిబికి ఉన్నప్పటికీ, గతంలో ఫార్మా యూనిట్ల కాలుష్యం విషయంలో, విశాఖ పోర్టు కాలుష్యం విషయంలో ఎపిపిసిబి సకాలంలో స్పందించకపోవడం వల్లే ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాల్సి వచ్చిందని ఈ లేఖలో పేర్కొన్నారు. విశాఖపట్నం గాలిలో కాఫర్, క్రోమియం, మోలిబ్డినం వంటి విషపదార్థాలు ఉన్నట్లు సిపిసిబి ఇటీవలి ధ్రువీకరించిన విషయాన్ని ప్రస్తావించారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పరిశ్రమల విషయంలో సిపిసిబి నిష్పక్షపాతంగా వ్యవహరించకుండా, ప్రభుత్వానికి దాసోహం పలకడం మానుకోవాలని కోరారు. గాజువాక సమీపం పెదగంట్యాడలో అదాని కంపెనీ ప్రతిపాదించిన సిమెంట్ ప్లాంట్ కోసం సిపిసిబి ప్రజల ముందు ఉంచిన పర్యావరణ అధ్యయన నివేదికలో తప్పుడు సమాచారం ఉందని తెలిపారు. ప్లాంట్‌కు నీటి వనరుగా చూపిన గంగవరం డీశాలినేషన్ ప్లాంట్ వాస్తవంగా లేదని పేర్కొన్నారు. ఈ ప్లాంట్ సింహాద్రి, హిందుజా పవర్ ప్లాంట్ల నుంచి వచ్చే బొగ్గు, బూడిద (ఫ్లైయాష్)ను ఉపయోగిస్తుందన్నారు. ఈ బూడిదలో మెర్క్యూరీ, లెడ్, అణుధార్మిక శక్తి ఉన్న యురేనియం, థోరియం ఐసోటోపులు ఉంటాయని, అవి గాలిలో కలిసిపోవడం వల్ల స్థానిక ప్రజలకు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. తప్పుడు సమాచారం ఆధారంగా రూపొందించిన సిమెంట్ ప్లాంట్ రిపోర్ట్‌ను తిరస్కరించాలని, త్వరలో ఏర్పాటు చేయదలచిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని రద్దుచేయాలని, ఎపిపిసిబిని స్వతంత్రంగా, నిష్పాక్షికంగా పనిచేసేలా బలోపేతం చేయాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ అంశాలను దృష్టిలో పెట్టుకుని తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.




మీకోసం

చలికాలంలో చర్మం పాడిబారకుండా ఉండడానికి గ్లిజరిన్ సబ్బులు వాడితే మంచిది.

జీవన సౌరభం

ధైర్యంగా వేసే ప్రతి అడుగులోనూ భయపెట్టే విమర్శలే వస్తుంటాయి. వింటూ ఆగిపోవడమా.. వినకుండా సాగిపోవడమా.. అనేది మనం వేసే అడుగులోనే ఉంటుంది.

పందెం



సింహపురి, సింహగిరి అనే ఈ రెండు రాజ్యాలు పక్కపక్కనే వుండేవి, సింహపురిని రుషికేశ పాలిస్తున్నాడు. సింహగిరిని కళింగ రాజు పరిపాలిస్తున్నాడు. ఒకసారి ఈ రెండు రాజ్యాల మధ్య యుద్ధం మొదలైంది. అప్పుడు రుషికేశ మహారాజు ఒక నిర్ణయం తీసుకున్నాడు.


'యుద్ధం వలన ప్రాణనష్టం జరుగుతుంది, ఎవరో ఒకరం గెలుస్తాం కానీ పోయిన ప్రాణాలను వెనక్కి తీసుకురాలేం. కాబట్టి నేను ఒక నిర్ణయానికి వచ్చాను' అన్నాడు రుషికేశు 'ఏంటో చెప్పండి' అన్నాడు కళింగ రాజు. 'ఇద్దరం కలిసి ఒక పందెం వేద్దాం. ఎవరైతే గెలుస్తారో ఈ రెండు రాజ్యాలు వారివే' అని పందెం ఏంటో చెప్పాడు రుషికేశ. పందేనికి కళింగ మహారాజు ఒప్పుకున్నాడు.

సైన్యాధికారి వచ్చి ఆ ఇద్దరు రాజులకు కళ్ళకు గంతలు కట్టి ఒక విశాలమైన ప్రదేశానికి తీసుకు వెళ్లాడు. ఆ ఇద్దరి చేతికి బాణాలు ఇచ్చి ఎదురుగా వున్న వృత్తాకారపు చెక్కపై గల మధ్య భాగాన్ని గురి చూసి కొట్టమన్నాడు. ముందుగా రుషికేశు మహారాజుకు అవకాశం ఇస్తాడు. తన గురి తప్పుతుంది. తర్వాత కళింగ మహారాజుకు బాణం సంధించే అవకాశం వచ్చింది. గురి చూసి ఒకే బాణంతో ఆ మధ్య భాగాన్ని కొట్టాడు.

'అంత సూటిగా ఎలా కొట్టగలిగారు మహారాజా' అని రుషికేశు, కళింగ మహారాజుని అడిగాడు. అప్పుడు, 'మహారాజా, మనిషికి మొదట తనపై తనకు నమ్మకం కుదరాలి. ఆత్మస్థైర్యంతో బాటు బుద్ధి బలం వుండాలి. వీటికి తోడు ధైర్యం పట్టుదల వుండాలి. ఇవి వుంటే మనిషి ఏదైనా సాధించగలడు. విజయం వరించగలడు. నాపై నాకు గల ఆత్మవిశ్వాసమే నా గురి తప్పనివ్వలేదు' అని అన్నాడు కళింగ మహారాజు. పందెం ప్రకారం రుషికేశుతన రాజ్యాన్ని కళింగ రాజుకి అప్పజెప్పేందుకు సిద్ధమయ్యాడు. అప్పుడు 'చూడండి మహారాజా మీరు యుద్ధం ఆపి ఇరుపక్షాల ప్రాణాలను కాపాడాలనుకున్నారు. మీ దయార్ద్ర హృదయానికి బహుమానంగా మీ రాజ్యం మీరే తీసుకోండి' అని కళింగ మహారాజు, రుషికేశ రాజ్యాన్ని తిరిగి ఇచ్చేశాడు.

- నరెద్దుల రాజారెడ్డి,
96660 16636.

నేను గీసిన బొమ్మ







గౌరవ్ శ్యామ్ సుఖ,
10వ తరగతి,
అరవింద హైస్కూలు,
కుంచనపల్లి.

సిహెచ్.సాన్విక,
8వ తరగతి,
అరవింద హైస్కూలు,
కుంచనపల్లి.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

యుద్ధం మిగిల్చిన ఆనవాళ్లు..

మనవళ్లు, మనవరాళ్లతో ఆడుకోవడం, వాళ్ల ముద్దు ముద్దు మాటలకు ముచ్చట పడిపోవడం నానమ్మ తాతయ్యకి భలే సరదా! కానీ గాజాలో ఉంటున్న బామ్మలు, తాతయ్యలకి మాత్రం అది అంతులేని విషాదం. రెండేళ్ల క్రితం ప్రారంభమైన ఇజ్రాయిల్ దాడుల్లో గాజాలో 39 వేల మంది చిన్నారులు తమ తల్లిదండ్రుల్లో ఒకరినో లేక ఇద్దరినీ పోగొట్టుకున్నారు. వారిలో 17 వేల మంది పిల్లలు తల్లిదండ్రు లిద్దరినీ కోల్పోయి అనాథలుగా మిగిలారని అధికార గణాంకాలు చెబు తున్నాయి. ఇప్పుడు ఈ పిల్లల బాధ్యత ఆ ఇంట్లో మిగిలి ఉన్న వృద్ధులపై పడింది. ఒక పక్క కన్నబిడ్డలని కోల్పోయి, మరోపక్క ఆ బిడ్డల వారసులను పెంచడం వాళ్లకి కత్తి మీద సాములా తయారైంది. అలాంటి వృద్ధ జంటల్లో రైదా అల్వి జంట కూడా ఉంది.



అరవై ఏళ్ల రైదా ఐదుగురు కొడుకులు, కోడళ్లు ఇజ్రాయిల్ బాంబు దాడుల్లో చని పోయారు. వాళ్ల పిల్లలు.. మొత్తం 36 మంది సంరక్షణ బాధ్యత ఇప్పుడు రైద జంటపైనే ఉంది. ఈ పరిస్థితి గురించి చెబుతున్న ప్పుడల్లా రైదా ఏడుస్తూనే ఉంటోంది. 'ఏడాదిన్నర పిల్లల దగ్గర నుండి 14 ఏళ్ల పిల్లల వరకు మేమిద్దరమే చూసుకోవడం చాలా కష్టంగా ఉంది. ఉదయం 3 గంటలకి నిద్రలేచి, పిల్లలకి అవసరమైనవి తయారు చేయాలి. అందరూ చిన్నపిల్లలే అయి పోయారు. అయినా వారిలో వారే ఆడుకుంటున్నారు. మూడేళ్ల వయసు వాడు కూడా ఏడాది వయసున్న చెల్లిని ఆడిస్తూ అన్నం పెడుతున్నాడు. ఇక కాస్త ఊహ వచ్చిన పిల్లలైతే తమ తల్లిదండ్రులని గుర్తుచేసుకుని అదేపనిగా ఏడుస్తున్నారు. బిడ్డలు దూరమైన దు:ఖాన్ని దిగమింగు కుంటూనే వారిని ఓదార్చాల్సి వస్తోంది' అని రైదా చెబుతున్నప్పుడు ఆమె చెంపలపై అదే పనిగా కన్నీళ్ల కారుతున్నాయి.

ప్రస్తుతం గాజాలో నెలకొన్న పరిస్థితుల్లో రైదా, ఆమె భర్త హమద్ ఆ పిల్లలకి ఆహారం, పరిశుభ్రమైన తాగునీరు అందించడానికే తీవ్రంగా కష్టపడాల్సి వస్తోంది. చాలీచాలని ఆహారంతో ఒక్క రొట్టెతో కడుపునింపుకుంటున్న ఆ పిల్లలని అలా చూడలేక ఆ వృద్ధ జంట తల్లడిల్లుతోంది. బాంబు మోతల మధ్య వారు నిద్రపోతుంటే, ఎప్పుడు ఏమవుతుందో అన్న భయం వారిని వెంటాడుతోంది. తన మానసిక పరిస్థితి గురించి రైదా ఇలా చెబుతోంది. 'అక్టోబరు 10 నుండి ఇజ్రాయిల్ సీజ్‌ఫైర్ ప్రకటించింది. అయినా మాకు యుద్ధ భయం పోలేదు. యుద్ధం నా పిల్లల్ని పొట్టనపెట్టుకుంది. వాళ్ల పిల్లలని అనాథలని చేసింది. 60 ఏళ్ల నేను ఈ పిల్లలకి మెరుగైన భవిష్యత్తును ఎలా అందిస్తాను? బతికుండగా నా పిల్లలు నాకు కావాల్సినవన్నీ సమకూర్చారు. కానీ నేను వాళ్ల ప్రేమ గుర్తులని భద్రంగా చూసుకోలేకపోతున్నాను. ప్రతి క్షణం నా బిడ్డలే కళ్లముందు మెదులుతున్నారు. వారు లేని బాధ నన్ను ఎంతలా బాధిస్తోందో మాటల్లో చెప్పలేను' అంటున్న రైదా లాంటి నానమ్మలు, అమ్మమ్మలు అక్కడ దుర్భర పరిస్థితులని అనుభవిస్తున్నారు.

హమద్ ఆ పరిస్థితి గురించి ఏం చెప్పాడంటే.. 'పిల్లలకి కనీస ఆహారాన్ని కూడా మేం సమకూర్చలేకపోతున్నాం. మేం వాళ్ల భవిష్యత్తుకి భద్రత ఇవ్వలేకపోతున్నాం. శిథిలమైపోయిన ఈ నగరంలో వారికి ఎక్కడా శాశ్వత గృహం లేదు. కుప్పకూలిన భవనాల మధ్యే వాళ్లు పెరుగుతున్నారు. దుమ్ము, ధూళితో నిండిపోయిన దుస్తులనే ధరిస్తున్నారు' అని ఎంతో ఆవేదనగా చెప్పాడు.

సీజ్ ఫైర్ తరువాత పునరావాస కేంద్రాల నుండి 4,73000 మంది పాలస్తీనియన్లు ఉత్తరగాజాకి బయల్దేరారు. అయితే అక్కడ వారు ఉండేందుకు సరైన వసతులు లేవు. ఇళ్లు వాకిళ్లు అన్నీ నాశనమైపోయాయి. ఆహారం, తాగు నీరు అందడం కూడా కష్టంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో అక్కడ తల్లిదండ్రులని కోల్పోయిన పిల్లల పరిస్థితి భయంకరంగా మారింది.



యునిసెఫ్ అంచనా ప్రకారం, యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటి వరకు గాజాలో 20 వేల మంది పిల్లలు చనిపోయారు. గంటకి ఒకరు చొప్పున మరణించారు. 3 వేల నుండి 4 వేల వరకు చిన్నారులు అవయవాలు కోల్పోయి వైకల్యానికి గురయ్యారు. యుద్ధం మిగిల్చిన చేదు జ్ఞాపకాలు ఈ పిల్లలని ఇంకెంత కాలం వేధిస్తాయో చెప్పడం చాలా కష్టం..



ఈ టీని తాగి చూడండి..

సీజన్లు మారినప్పుడు దగ్గు, జలుబు, జ్వరం వంటి సమస్యలు చాలామందికి వస్తుంటాయి. వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల కొందరికి ఇవి చాలా సులభంగా వస్తాయి. రోగ నిరోధకశక్తి తక్కువగా ఉంటేనే ఈ సమస్యల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అలాగే ఆస్తమా వంటి సమస్యలు ఉంటే సీజన్లు మారినప్పుడు ఇంకా ఎక్కువ అవస్థ కలుగుతుంది. ముఖ్యంగా చలికాలంలో అనేక ఇబ్బందులు పడతారు. అయితే ఈ సమస్యలు అన్నింటికీ చెక్ పెట్టడంతోపాటు ఇతర అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందా లంటే వంటింట్లో ఉండే ఆహార పదార్థాలను ఉపయోగిస్తే సరి.

పుదీనా, అల్లంతో తయారు చేసుకున్న టీ ఈ సమస్యలకి చెక్ పెడుతుంది. ఒక పాత్రలో నీటిని పోసి అందులో పుదీనా ఆకులు, అల్లం వేసి మరిగించి రోజూ పరగడుపున ఆ నీళ్లను తాగుతుండాలి. ఇలా టీ తయారు చేసి తాగితే అనేక లాభాలు కలుగుతాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు.

జీర్ణ సమస్యలు : ఈ టీని తరచూ తాగుతుంటే వికారం, వాంతికి వచ్చినట్లు ఉండడం వంటి సమస్యల నుంచి బయట పడవచ్చు. గర్భిణీలకు, ప్రయాణాల్లో వాంతులు అయ్యే వారికి ఈ టీ ఎంతో మేలు చేస్తుంది. ఈ టీలో యాంటీ స్పాస్మోడిక్ గుణాలు ఉంటాయి. కనుక దీన్ని సేవిస్తుంటే కడుపు నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. పొట్టలోని కండరాలు ప్రశాంతంగా మారుతాయి. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. పొట్ట పట్టేసినట్లు ఉండడం, గ్యాస్, కడుపు ఉబ్బరం నుంచి కూడా బయట పడవచ్చు. తిన్న ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి తగ్గుతుంది. ఇరిటబుల్ బౌల్ సిండ్రోమ్ (ఐబీఎస్) అనే సమస్య ఉన్నవారికి ఎంతగానో ఉప శమనం లభిస్తుంది. దీని వల్ల తరచూ మల విసర్జనకు వెళ్లే బాధ తప్పుతుంది.

కీళ్ల నొప్పులు, వాపులు : ఈ టీలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడి, వాపులను తగ్గిస్తాయి. ఈ టీలో ఉండే ఫినోలిక్ సమ్మేళనాలు శక్తివంత మైన యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటాయి. వీటి వల్ల కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. కీళ్లు పట్టుకుపోయినట్లు ఉండడం తగ్గి రిలాక్స్ అవుతాయి. దగ్గు, ఫ్లూ నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ మిశ్రమంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగిస్తాయి.

రోగ నిరోధక శక్తి : ఈ మిశ్రమాన్ని సేవించడం వల్ల ముక్కు దిబ్బడ నుంచి ఉపశమనం లభిస్తుంది. కఫం తొలగిపోతుంది. దగ్గు, జలుబు త్వరగా తగ్గిపోతాయి. రోగ నిరోధక శక్తి పెరుగు తుంది. ఇన్‌ఫెక్షన్లు, వ్యాధుల నుంచి బయట పడవచ్చు.


లివర్ ఆరోగ్యానికి కూడా ఈ టీ మేలు చేస్తుంది. దీన్ని తాగితే లివర్ వాపు తగ్గుతుంది. లివర్‌లోని వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోతాయి. లివర్ క్లీన్ అవుతుంది. ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.

ఘట్టమనేని వారసులొస్తున్నారు...



ఇండస్ట్రీలో ఒకే కుటుంబం నుంచి ఎక్కువమంది వారసులు అనగానే మెగా లేదంటే నందమూరి ఫ్యామిలీలే గుర్తొస్తాయి. అక్కినేని, దగ్గుబాటి కుటుంబాల నుంచి హీరోలు ఉన్నప్పటికీ వేళ్లపై లెక్కపెట్టేంత మంది ఉన్నారు. త్వరలో ఈ లిస్టులోకి ఘట్టమనేని కుటుంబం కూడా చేరనుంది. ఎందుకంటే ఒకరిద్దరు కాదు ఏకంగా ఏడుగురు వరకు వారసులు. సూపర్‌స్టార్ కృష్ణ వారసుడిగా రమేష్‌బాబు, మహేష్‌బాబు పరిశ్రమలోకి వచ్చారు. హీరోగా ఒకటి రెండు సినిమాలు చేసినప్పటికీ రమేష్‌బాబు పెద్దగా నిలదొక్కుకోలేకపోయారు. మహేష్‌బాబు మాత్రం స్టార్‌హీరోగా నిలదొక్కుకున్నారు. ప్రస్తుతం రాజమౌళితో మూవీ చేస్తున్నారు. మహేష్ అక్క మంజుల పలు చిత్రాల్లో సహాయ పాత్రలు చేశారు. మహేష్‌బాబు సోదరి ప్రియదర్శని భర్త సుధీర్ బాబు ప్రస్తుతం హీరోగా సినిమాలు చేస్తున్నారు. గల్లా జయదేవ్ కుమారుడు, మహేష బాబుకి మేనల్లుడు అయిన అశోక్ గల్లా మూడు వరకూ సినిమాలు చేశారు. పెద్దగా గుర్తింపు రాలేదు. మహేష్‌బాబు కుమారుడు గౌతమ్ ప్రస్తుతం అమెరికాలో యాక్టింగ్ శిక్షణలో ఉన్నారు. త్వరలోనే అతడి ఎంట్రీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. కుమార్తె సితార ఇప్పటికే తండ్రితో కలిసి పలు యాడ్స్ చేశారు. సినిమాల్లోని పాటల్లోనూ అతిథిగా కనిపించింది. రమేష్‌బాబు కుమారుడు జయకృష్ణ ఇప్పటికే హీరోగా తొలి సినిమా చేసేందుకు సిద్ధమయ్యారు. 'ఆర్ఎక్స్ 100' ఫేమ్ డైరెక్టర్ అజయ్‌భూపతి దర్శకుడు. రమేష్ బాబు కుమార్తె భారతి కూడా నటి అయ్యేందుకు ఆసక్తి చూపుతున్నారని సమాచారం. మంజుల కూడా తన కుమార్తె జాన్వి త్వరలో సినిమాల్లోకి రానుందని చెబుతూ ఇన్‌స్టాలో పోస్టు పెట్టారు. సుధీర్‌బాబు పెద్ద కుమారుడు చరిత్ మానస్, చిన్న కుమారుడు ఇప్పటికే ఎంట్రీ ఇచ్చేశారు.

నితిన్ ద్విపాత్రాభినయం!



నితిన్ కొత్త ప్రాజెక్టుపై ఒక వార్త వినిపిస్తోంది. వి.ఐ.ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న కొత్త చిత్రంలో నితిన్ ద్విపాత్రా భినయం చేస్తున్నట్లు సమాచారం. ఈ సినిమా సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో వుండనున్నట్లు వార్తలు వస్తున్నాయి. చిట్టూరి శ్రీనివాస రావు బ్యానర్‌లో ఈ సినిమా రానుంది. త్వరలో ఈ సినిమా వివరాలని చిత్రబృందం ప్రకటించనుంది.

హాస్యం, యాక్షన్‌తో 'మాస్ జాతర'

దర్శకుడు భాను భోగవరపు



'మాస్ జాతర' సినిమా రైల్వే పోలీస్ నేపథ్యంలో జరిగే కథ. క్రైమ్ కొత్తగా ఉంటుంది. సన్నివేశాలు కూడా అంతే. టైటిల్‌ను కథానాయకుడు రవితేజ గారే చెప్పారు. కథ విన్న తర్వాత వినోదంతో పాటు అన్ని అంశాలు బాగున్నాయి అంటూ ఆయన ఈ టైటిల్ సూచించారు.చాలా మాస్ అంశాలు ఉన్నాయి. థియేటర్‌లో ప్రేక్షకులు కొన్ని సర్‌ప్రైజ్‌లు చూడబోతు న్నారు. ఇది కల్పిత కథే. నవీన్ చంద్ర శివుడు అనే శక్తివంతమైన ప్రతినాయక పాత్ర పోషించారు. తులసి పాత్రలో శ్రీలీల బాగా ఇమిడిపోయారు. గ్యాంగ్‌లీడర్‌లో చిరంజీవి-విజయశాంతి మధ్య సన్నివేశాలు ఎలాగైతే కామెడీ టచ్‌తో మాసీగా ఉంటాయో.. ఇందులో రవితేజ-శ్రీలీల మధ్య సన్నివేశాలు అలా ఉంటాయి. దర్శకుడిగా నాకిది మొదటి సినిమా అయినప్పటికీ నాగవంశీ ఎంతో మద్దతుగా నిలిచారు. హాస్యం, యాక్షన్ సన్నివేశాలను కొత్తగా రూపొందించాం' అని దర్శకుడు భాను భోగవరపు అన్నారు. రవితేజ, శ్రీలీల జోడీగా నటించిన 'మాస్ జాతర' ఈనెల 31న థియేటర్లలో విడుదల కానుంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు.

మహారాణి 4 ట్రైలర్ విడుదల



బాలీవుడ్ నటి హేమా ఖురేషి ప్రధాన పాత్రలో వచ్చిన పొలిటికల్ థ్రిల్లర్ సిరీస్ 'మహారాణి' నాలుగో సీజన్ త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ వెబ్ సిరీస్ ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ సీజన్ వచ్చేనెల 7 నుంచి సోనీ లివ్‌లో స్ట్రీమింగ్‌కు రానుంది. మహారాణి తొలి సీజన్ 2021లో రాగా.. ఆ తర్వాత 2022లో రెండో సీజన్, 2024లో మూడో సీజన్ అభిమానులను అలరించాయి. నాలుగో తరగతి పాసైన ఓ సాధారణ గృహిణి సీఎంగా మారి.. రాజకీయంగా అక్రమా లకు పాల్పడే వ్యక్తులకి ఎలా చెక్ పెట్టిందనే కోణంలో ఈ సిరీస్‌ను రూపొందించారు. ఈ వెబ్ సిరీస్‌లో శ్వేతా బసు ప్రసాద్ కీలక పాత్రలో కనిపించనున్నారు.

ఆసీస్‌ను ఓడిస్తేనే ఫైనల్ బెర్త్

- నేడు సెమీస్‌లో ఆస్ట్రేలియాతో హర్మన్‌ప్రీత్ సేన కీలక పోరు
- మధ్యాహ్నం 3.00గం॥లకు



నవీ ముంబయి: ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా ఫైనల్ బెర్త్‌పై గురిపెట్టింది. ఫైనల్‌కు చేరే క్రమంలో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాను గురువారం జరిగే సెమీస్‌లో ఓడిస్తేనే టైటిల్ ఆశలు సజీవంగా ఉండనున్నాయి. టోర్నీ చరిత్రలో కేవలం రెండుసార్లు మాత్రమే భారత మహిళలజట్టు ఫైనల్‌కు చేరింది. ఆ రెండు సందర్భాల్లోనూ ఓటమిపాలై రన్నరప్‌కే పరిమితమైంది. ఈసారి భారీ అంచనాలతో బరిలోకి దిగిన టీమిండియా ఆశించిన మేరకు ప్రదర్శన చేయకపోయినా నాలుగో స్థానంలో నిలిచి సెమీస్‌కు చేరింది. మూడోసారి టైటిల్ పోరుకు సిద్ధమయ్యే క్రమంలో 'కంగారూ'ను ఇక్కడో చిత్తుచేయాల్సి ఉంది. డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాను ఓడించడం భారత్‌కు అంత సులువేమీ కాదు. లీగ్ దశలో కంగారూ జట్టుపై భారత్ 330 పరుగులు చేసినా ఆ లక్ష్యాన్ని కాపాడుకోలేకపోయింది. ఎల్లిస్ పెర్రీ, ఆష్లీన్ గార్డ్‌నర్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్, బెత్ మూనీలతో ఆ జట్టు బ్యాటింగ్ విభాగం పటిష్ఠంగా ఉంది. వీరంతా ఒంటిచేత్తో మ్యాచ్‌ను మలుపుతిప్పగల సమర్థులే. సూపర్ ఫామ్‌లో ఉన్న ఆసీస్ కెప్టెన్ అలీసా హీలీ భారత్‌తో సెమీస్ మ్యాచ్‌కు అందుబాటులో ఉండకపోవచ్చు. బౌలింగ్‌లో ప్రధానంగా అలానా కింగ్, అన్నాబెల్ సదర్లాండ్‌తో భారత్‌కు ముప్పుంది. సోఫీ మోలినెక్స్, ఆష్లీన్ గార్డ్‌నర్ కూడా బంతితో రాణిస్తే టీమిండియాకు ఇబ్బందులు తప్పవు. సెమీస్‌కు ముందు ఫామ్‌లో ఉన్న ప్రతీక రావల్ గాయంతో టోర్నీకి దూరమవడం భారత్‌కు ప్రతికూలంగా మారింది. మంధాన, రోడ్రిగ్స్, హర్లీన్, హర్మన్‌ప్రీత్, దీప్తి శర్మ, రీచా ఘోష్ ఫామ్‌లో ఉండడం టీమిండియాకు శుభ పరిణామం. క్రాంతి గౌడ్, శ్రీచరణి, దీప్తి, రేణుకా సింగ్ బంతితో మెరిస్తే ఆసీస్‌కు చెక్ పెట్టడం ఖాయం. తొలిసారి టైటిల్‌పై కన్నేసిన టీమిండియాకు ప్రధాన అడ్డంకి సెమీస్‌లో ఆసీస్ రూపంలో ఎదురైంది. ఈ అడ్డంకిని తొలిగిస్తేనే హర్మన్‌ప్రీత్ సేన మరోసారి తుదిపోరుకు అర్హత సాధించనుంది.

ఇప్పటిదాకా 12 వన్డే ప్రపంచకప్‌లు జరగ్గా.. భారత్ నాలుగుసార్లు సెమీస్‌కు చేరింది. ప్రస్తుతం జరుగుతోన్న 13వ ఎడిషన్‌లో భారత్ మరోసారి నాకౌట్ దశకు అర్హత సాధించగలిగింది. 1997లో ఆస్ట్రేలియా, 2005లో న్యూజిలాండ్ చేతిలో ఓటమిపాలైంది. 2005లో కివీస్‌ని 40 పరుగుల తేడాతో మట్టికరిపించిన మిథాలి రాజ్ సేన.. తుది పోరులో ఆస్ట్రేలియా జోరు ముందు నిలవలేక రన్నరప్‌తో సరిపెట్టుకుంది. 2017లో కప్పు గెలిచేం దుకు భారత అమ్మాయిలకు మంచి అవకాశమే వచ్చినా సద్వినియోగం చేసుకోలేకపోయారు. సెమీస్‌లో భీకర ఆస్ట్రేలియాను ఓడించిన భారత్.. ఫైనల్‌లో ఇంగ్లాండ్ చేతిలో 9 పరుగుల తేడాతో ఓడి విశ్వవిజేతగా నిలిచే ఛాన్స్‌ను మిస్ చేసుకుంది. ఇప్పుడు టైటిల్‌కు మరో రెండు అడుగుల దూరంలో నిలిచిన టీమిండియా.. సెమీస్‌లో 'ఆస్ట్రేలియా' గండాన్ని దాటితే.. ఫైనల్‌లో దక్షిణాఫ్రికాతో టైటిల్ పోరుకు సిద్ధం కానుంది.

జట్లు(అంచనా)...

ఇండియా: హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), మంధాన, హర్లిన్ డియోల్, రీచా ఘోష్(వికెట్ కీపర్), రోడ్రిగ్స్, దీప్తి శర్మ, షెఫాలీ వర్మ/అమన్‌జోత్ కౌర్, క్రాంతి గాడ్, శ్రీ చరణి, రేణుక సింగ్, స్నేహ రాణా.

ఆస్ట్రేలియా: మెక్ గ్రాత్(కెప్టెన్), మూనీ(వికెట్ కీపర్), లిచ్‌ఫీల్డ్, ఎలైసే పెర్రీ, సథర్లాండ్, గార్డినర్, వారేహామ్, అలానా కింగ్, కిమ్ గ్రాత్, మోలినెక్స్, హీలీ/బ్రౌన్.

ఫైనల్‌కు దక్షిణాఫ్రికా మహిళలు

సెమీస్‌లో ఇంగ్లండ్‌పై 125పరుగుల తేడాతో గెలుపు



గౌహతి: ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్లోకి దక్షిణాఫ్రికా జట్టు దూసుకెళ్లింది. బుధవారం జరిగిన తొలి సెమీస్‌లో దక్షిణాఫ్రికా జట్టు మూడుసార్లు టైటిల్ విజేత ఇంగ్లండ్‌పై 125 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్ చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడింది. 26 ఏళ్ల వోల్వార్డ్ కేవలం 143 బంతుల్లో 20ఫోర్లు, 4సిక్సర్ల సాయంతో 169 పరుగులు రాణించింది. దీంతో దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 319 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఛేదనలో ఇంగ్లండ్ జట్టును 42.3ఓవర్లలో 194పరుగులకే ఆలౌట్ చేసింది. పేసర్ మారిజానే కాప్(5/20), క్లర్క్(2/24)కి తోడు ఖాకా, మ్లాబా, లూస్ ఒక్కో వికెట్‌తో చెలరేగారు. ఈ గెలుపుతో 2025 ఐసిసి వన్డే మహిళల ప్రపంచకప్ ఫైనల్లోకి దక్షిణాఫ్రికా జట్టు తొలిసారి దూసుకెళ్లింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ వోల్వార్డ్‌కు లభించగా.. ఫైనల్ మ్యాచ్ శనివారం జరగనుంది.

స్కోర్లు(సంక్షిప్తంగా)...

దక్షిణాఫ్రికా : 319/7(50 ఓవర్లలో) వోల్వార్డ్ 169, బ్రిట్స్ 45; ఎక్లేస్టోన్ (4/44)

ఇంగ్లండ్ : 194/10(42.3 ఓవర్లలో) స్కీవర్ బ్రంట్ 64, కాప్సే 54; మారిజానే కాప్ (5/20)

తొలి టి20 వర్షార్పణం



కాన్‌బెర్రా: భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరగాల్సిన తొలి టి20 మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా తొలుత 5ఓవర్లకు ఒకసారి వర్షం కారణంగా నిలిచింది. ఆ సమయానికి భారతజట్టు వికెట్ నష్టపోయి 43పరుగులు చేసింది. శుభ్‌మన్(16), సూర్య కుమార్(8) క్రీజ్‌లో ఉన్నారు. ఆ తర్వాత వర్షం నిలవడంతో 18ఓవర్లకు మ్యాచ్‌ను కుదించి తిరిగి మ్యాచ్ ప్రారంభించగా.. 9.4ఓవర్ల అనంతరం మళ్లీ భారీ వర్షం కురవడంతో మ్యాచ్‌ను నిలిపివేశారు. ఆ సమయానికి టీమిండియా వికెట్ నష్టానికి 97పరుగులు చేసింది. శుభ్‌మన్(37; 20బంతుల్లో 4ఫోర్లు, సిక్సర్), కెప్టెన్ సూర్యకుమార్(39; 24బంతుల్లో 3ఫోర్లు, 2సిక్సర్లు) క్రీజ్‌లో ఉన్నారు. ఎంతసేపటికీ వర్షం నిలువకపోవడంతో మ్యాచ్‌ను రద్దుచేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. రెండో మ్యాచ్ మెల్‌బోర్న్ వేదికగా 31న జరగనుంది.

పోరాడినా.. తెలుగు టైటాన్స్‌కు నిరాశే..

ఫైనల్‌కు పుణేరి పల్టన్స్ ● ప్రొ కబడ్డీ సీజన్-12



న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ సీజన్-12 ఫైనల్లోకి పుణేరి పల్టన్స్ దూసుకెళ్లింది. త్యాగరాజ్ ఇండోర్ స్టేడియంలో బుధవారం జరిగిన క్వాలిఫయర్-2లో పుణేరి పల్టన్స్ 50-45పాయింట్ల తేడాతో తెలుగు టైటాన్స్‌ను చిత్తుచేసింది. హోరాహోరీగా సాగిన ఈ పోటీలో తొలి అర్ధభాగం ముగిసేసరికి తెలుగు టైటాన్స్ ఆధిక్యతలో నిలిచింది. 40-41పాయింట్లతో తెలుగు టైటాన్స్ పుణేరికి చేరువైన దశలో పుణేరి రైడర్ ఆదిత్య షిండే తెలుగు టైటాన్స్ నలుగురు ఆటగాళ్లను ఔట్ చేయడంతో మ్యాచ్ ఫలితం తారుమారైంది. ఆదిత్య షిండే(22), పంకజ్ మోహితే(10) రాణించగా.. ట్యాకిల్స్‌లో గౌరవ్(5), కెప్టెన్ అస్లామ్(2) రాణించారు. టైటాన్స్ జట్టులో భరత్ హుడా(23)కి మాత్రమే రైడ్‌లో మెరిసారు. శుక్రవారం జరిగే ఫైనల్లో పుణేరి జట్టు దబాంగ్ ఢిల్లీతో తలపడనుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68